



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY









SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 6 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 26 సెప్టెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-

## జీఎస్టీ సంస్కరణలు ఆగవు

- ప్రజలపై పన్నుల భారం మరింత తగ్గిస్తాం
- కాంగ్రెస్ పాలనలో ట్యాక్స్ లూటీ
- సామాన్యులపై విపరీతంగా పన్నులు
- ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం


6



## రైలు నుంచి అగ్ని వర్షం

- అగ్ని-ప్రైమ్ క్షిపణి పరీక్ష విజయవంతం
- డీఆర్‌డీఓ అరుదైన ఘనత
- మిస్సైల్ పరిధి 2,000 కిలోమీటర్లు
- స్థిరమైన ప్రదేశం నుంచి కాకుండా పట్టాలపై పరుగులు తీస్తున్న రైలు నుంచి మిస్సైల్‌ను పరీక్షించడం భారత క్షిపణి తయారీ రంగంలో ఒక కీలకమైన మైలురాయి
- క్షిపణులను దేశంలో ఎక్కడికైనా రైలులో సులభంగా తరలించే సామర్థ్యాన్ని భారత్ సాధించడం గమనార్హం

# తప్పు చేసిన వారిని వదలను



- నాది కక్ష రాజకీయమైతే అధికారంలోకి రాగానే జైల్లో వేసేవాడిని
- ప్రజాస్వామ్యంపైనే నాడు వైసీపీ దాడి.. స్పీకర్, డిప్యూటీ స్పీకర్, డిప్యూటీ సీఎం.. అంతా బాధితులమే.. ఏ తప్పూ చేయని నాపై 17 కేసులు: సీఎం
- జైల్లోనూ డ్రోన్లతో నిరంతర నిఘా పెట్టారు.. రాజధాని మహిళల నుంచి నేతలదాకా కేసులు
- ఆ అరాచకాలు ఇప్పటికీ జీర్ణం కావట్లేదు.. అవన్నీ ప్రజలకు వివరించి చట్టపరంగా శిక్షిద్దాం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

"అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్., సీఎం, డిప్యూటీ సీఎం.. ఇక్కడున్న చాలా మందిమి గత ప్రభుత్వ బాధితులమే. ఎప్పుడూ తప్పు చేయని నాపై 17 కేసులు పెట్టారు. జైల్లో బంధించి నా కదలికలపై నిఘాకోసం డ్రోన్లు ఎగురవేశారు. నేను కక్షపూరిత రాజకీయాలు చేస్తే అధికారంలోకి వచ్చిన మొదటిరోజే అరెస్టులు చేయించేవాళ్లం. నాకు ప్రజలు, రాష్ట్రం పట్ల బాధ్యత ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గురువారం అసెంబ్లీలో రాష్ట్ర శాంతి భద్రతలపై చర్చలో ఆయన మాట్లాడారు. "నాగరిక ప్రపంచంలో శాంతి భద్రతలే కీలకం. గత ఐదేళ్ల అరాచకాలు ఇప్పటికీ జీర్ణం కావట్లేదు. అన్నీ చర్చించి ఆధారాలతో సహా చట్టపరంగా చర్యలు తీసుకుందాం. వాళ్లు (వైసీపీ నేతలు) చేసిన తప్పు మనం చేస్తే రాష్ట్రానికి న్యాయం జరగదు. తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టను" అని ముఖ్యమంత్రి తెలిపారు. ఆనాటి వైసీపీ అరాచకాలను ఆయన గుర్తుచేశారు. "ప్రాజెక్టుల పరిశీలనలో ఉంటే వచ్చి.. అరెస్టు చేస్తున్నామన్నారు. కేసు ఏంటని అడిగితే చెప్పరు. ముందు జీపు ఎక్కండి అంటారు. అంగళ్లులో నాతో పాటు రామ్‌ప్రసాద్‌రెడ్డి, కిశోర్ కుమార్ అనే ఇద్దరు టీడీపీ కార్యకర్తలపై దాడి చేసి ఎదురు కేసులు పెట్టారు. ఈ వయసులో అయ్యన్నపాత్రుడిపై అత్యాచారం కేసు పెట్టారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి, చింతమనేని ప్రభాకర్, దేవినేని ఉమా, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి, పులివర్తి నాని.. ఆఖరికి ఎంతో సౌమ్యుడైన నిమ్మల రామానాయుడుపైనా పదుల సంఖ్యలో కేసులు పెట్టారు. విశాఖలో పవన్ కల్యాణ్, యువగళంలో లోకేశ్... ఎవ్వరినీ వదలకుండా వేధించారు. మిమ్మల్ని కాపాడుకోవడానికి ఆ రోజు (రఘురామకృష్ణంరాజు అరెస్టు) రాత్రంతా నిద్ర లేకుండా అన్ని కోర్టుల్లోని లాయర్లతో సమన్వయం చేసుకొంటూ గడిపాం. అమరావతికి భూములిచ్చిన రైతులను వేధించి కేసులు పెట్టారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు.. అనే కార్యక్రమానికి వెళుతున్న మహిళలు కన్నీళ్లు పెట్టుకుని రోడ్లపైనే భోజనాలు - మిగతా2లో

## గట్టిగా 'ఎవడూ' అడగలేదు

**అసెంబ్లీలో చిరంజీవిపై బాలకృష్ణ ఫైర్**

**జగన్‌ను కలవడానికి వెళితే అవమానించారని చిత్రీకరణ**

**మాజీ సీఎం వైఎస్ జగన్‌పైనా పరుష వ్యాఖ్యలు**



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

మెగాస్టార్ చిరంజీవిపై హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ శాసన సభలో గురువారం అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. చిరంజీవిని ఏకవచనంతో సంబోధిస్తూ 'ఎవడు' అంటూ మాట్లాడారు. శాసనసభలో గురువారం శాంతిభద్రతల అంశంపై చర్చ సందర్భంగా బీజేపీ సభ్యుడు కామినేని శ్రీనివాస్ మాట్లాడిన విషయాలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు చిరంజీవిని అవమానించారని, ఆయన్ను కలవడానికి వెళితే కలవకుండా సినిమాటోగ్రఫీ మంత్రిని కలవమన్నారని శ్రీనివాస్ చెప్పారు. దీనిపై జోక్యం చేసుకున్న బాలకృష్ణ.. - మిగతా2లో




## చిరస్థాయిగా నిలిచే శుభ సమయం

- ఉద్యోగార్థుల ఏళ్ల నిరీక్షణకు తెరపడింది
- కొత్త టీచర్లకు డిప్యూటీ సీఎం పవన్ శుభాకాంక్షలు
- ఎన్నికల్లో యువతకు ఇచ్చిన మాటకు కట్టుబడి మెగా డీఎస్సీ ద్వారా వారికి దారి చూపిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుంది
- సీఎం మార్గదర్శకత్వంలో విద్యాశాఖ మంత్రి, సోదరుడు లోకేశ్ ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లారు

2

## ఇకపై ఏటా డీఎస్సీ



- యువతా సన్నద్ధమవ్వండి
- అన్ని ఖాళీలకూ నోటిఫికేషన్ ఇస్తాం
- 15 ఏళ్లలో 14 డీఎస్సీలతో 1,96,619 మందికి కొలువులిచ్చాం
- మెగా డీఎస్సీతో 15,941 ఉద్యోగాలు భర్తీ చేశాం
- విలువలతో కూడిన విద్య అందించాలి
- కొత్త ఉపాధ్యాయులకు నియామక పత్రాల పంపిణీలో సీఎం చంద్రబాబు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్రంలో ఇక ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని.. ఎన్ని ఖాళీలు ఉంటే అన్నింటికీ నోటిఫికేషన్ ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. విద్యా శాఖను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయబోమని, నిరుద్యోగులు సన్నద్ధమవుతూనే ఉండాలని సూచించారు. మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు గురువారం అమరావతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "15 సంవత్సరాల్లో 14 సార్లు డీఎస్సీ పెట్టి 1,96,619 మందికి ఉద్యోగాలు ఇచ్చింది నేనే. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి, 15,941 ఉద్యోగాలు భర్తీ చేశాం" అని వివరించారు. 'సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయింది. - మిగతా2లో

## పార్టీ పరిశీలకులతో అగ్ర నేతల భేటీ

డీసీసీ అధ్యక్షుల ఎంపిక కోసం 22 మంది పరిశీలకులతో వారు భేటీ అవనున్నారు

6

# నూతన తేజస్సు



- రూ.62,370 కోట్లతో 97 తేజస్ ఎంకే-1ఏ ఫైటర్ జెట్ల కొనుగోలు
- హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌తో రక్షణ శాఖ ఒప్పందం
- ఏటా 11,750 మందికి ఉద్యోగాలు, ఉపాధి

6

# ఇకపై ఏటా డీఎస్సీ

-మొదటిపేజీ తరువాయి

ప్రధాని మోదీ సూపర్ జీఎస్టీ తెచ్చారు. ఈ దసరా అందరికీ ఆనందం పంచుతుంది. మీ అందరికీ ఉద్యోగాలొచ్చాయి. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయి. సూపర్ జీఎస్టీతో పొదుపు చేసుకోవచ్చు' అని పేర్కొన్నారు.

**లోకేశ్ బృందానికి అభినందనలు**

'అసాధ్యమనుకున్న పనిని ఏడాదిలో పూర్తి చేసి, నియామక ఉత్తర్వులు ఇప్పించిన విద్యాశాఖ మంత్రి లోకేశ్, ఆయన బృందానికి అభినందనలు. పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించారు. మంత్రుల నుంచి నేను కోరుకునేది ఇదే. ఎన్టీఆర్ మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టారు. లోకేశ్ సన్న బియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. బడులు తెరిచేలోపే యూనిఫాంలు, పుస్తకసామగ్రి ఇచ్చారు' అని సీఎం వివరించారు. 'సీట్లు ఖాళీ లేవు' అనే బోర్డులు ప్రభుత్వ పాఠశాలల్లోనూ పెట్టారంటే.. కూటమి ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనంగా చెప్పుకొచ్చారు. 'ప్రభుత్వ బడుల్లో మౌలిక సౌకర్యాలున్నాయి. సరైన నాయకత్వం ఒక్కటే లేదు. ఆ బాధ్యత తీసుకునేందుకు విద్యాశాఖ తరఫున లోకేశ్ ముందుకొచ్చారు. సవాళ్లు ఉంటాయని తెలిసినా సిద్ధమన్నారు' అని చంద్రబాబు పేర్కొన్నారు. 'రాజకీయ ప్రయోజనాల కోసం డీఎస్సీని అడ్డుకునేందుకు ప్రతిపక్షం 106 కేసులేయించింది. మంత్రి లోకేశ్ శ్రద్ధ పెట్టి ఒక్క కేసూ లేకుండా చేశారు. రాష్ట్రంలో చేతగాని ప్రతిపక్షం ఉంది. వారు మంచి చేయలేరు. మంచి జరిగితే ఓర్వలేరు' అని సీఎం విమర్శించారు. 'ఉపాధ్యాయులు ఒకప్పుడు నేతల దగ్గరకెళ్లి పోస్టింగుల కోసం పైరవీలు చేసే పరిస్థితి ఉండేది. 1998లో ప్రతిభ ఆధారంగా కౌన్సెలింగ్ విధానం తెచ్చాం. ఆడపిల్లలకు ఉద్యోగాల్లో.. కాలేజీల్లో 33% సీట్లు పెట్టాం' అని సీఎం పేర్కొన్నారు.



**ఉపాధ్యాయులు నిత్యం నేర్చుకోవాలి**

'విద్యావిధానంలో పెనుమార్పులు వచ్చాయి. భవిష్యత్తు విద్య ఎలా మారుతుందో టీచర్లు ఆలోచించాలి. విద్యార్థుల మనోభావాల మేరకు పనిచేయాలి. విలువలతో కూడిన విద్య అందించాలి. పునాదులు ఎంత బలంగా నిర్మిస్తే.. అది స్వర్ణాంధ్రప్రదేశ్‌కు అంతగా ఉపయోగపడుతుంది. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చారు. నేర్చుకోవడం ఆపొద్దు. ప్రతి ఒక్కరూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా తయారవ్వాలి. నాలెడ్జి ఎకానమీకి ఏపీని చిరునామాగా నిలపాలి' అని సూచించారు.

**విద్యావ్యవస్థను నాశనం చేసిన గత ప్రభుత్వం**

'నాయకుడు సరిగా పనిచేయకపోతే వ్యవస్థ కుప్పకూలుతుంది. 2019–24 మధ్య ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యా వ్యవస్థకు శాపంగా మారింది. 10 లక్షల మంది పిల్లలు ప్రభుత్వ బడులు మానేసి ప్రైవేటుకు వెళ్లారు. విద్యారంగంలో రాష్ట్రం 3 నుంచి 19వ స్థానానికి పడిపోయింది. ఆంగ్లం అని ప్రజల్ని రెచ్చగొట్టి విద్యావ్యవస్థను నాశనం చేశారు. 'నాడు–నేడు' పనులెక్కడా పూర్తికాలేదు' అని చంద్రబాబు ధ్వజమెత్తారు.

**విద్యాశాఖలో వినూత్న మార్పులు**

'కూటమి అధికారంలోకి వచ్చాక.. మంత్రి లోకేశ్ విద్యాశాఖలో వినూత్న మార్పులు తెస్తున్నారు. ఏడాదికి 2 సార్లు మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నారు. 'మన బడి మన భవిష్యత్తు' కింద సౌకర్యాలు కల్పిస్తున్నారు. 9,620 పాఠశాలల్లో 'ఒక తరగతి.. ఒక ఉపాధ్యాయుడు' అమలు చేస్తున్నారు' అని చంద్రబాబు ప్రశంసించారు.

# తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన శిక్ష తప్పదు

అమరావతి

'సామాజిక మాధ్యమాల్లో ఇష్టానుసారం తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. ఓ క్రిమినల్ వ్యవస్థను తయారుచేసి మనపై వదులుతున్నారు. దీనివెనుక రాజకీయ ముసుగులో ఉన్న క్రిమినల్ ఉన్నాడు. ఆర్గనైజ్డ్ క్రైమ్ చేసేందుకు ఎంతకైనా తెగిస్తాడనడానికి ప్రపంచంలోనే ఉదాహరణగా నిలిచేవ్యక్తి జగన్. ఎవరినైనా ఏదైనా అనేసి, ఐపీ అడ్రస్ మార్చేస్తే ఏమీ చేయలేరని, ఎక్కడో ఉండి పోస్ట్ పోడితే ఏమీ కాదనుకుంటున్నారు. ప్రతి ఒక్కరినీ ఇక్కడికి తీసుకొచ్చి అరెస్ట్ చేస్తాం. తప్పుడు పోస్టులు, ఫేక్ ప్రచారాలు చేసేవారిని ఎవరినీ వదలం. వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికే చట్టసవరణ చేయనున్నాం. సామాజిక మాధ్యమాలు, సైబర్ క్రైమ్‌కు సంబంధించి చట్టసవరణలు, అవసరమైన కొత్త చట్టాలు చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని సీఎం వేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి వీటిని తీసుకురానున్నాం' అని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. శాసనసభలో గురువారం 'శాంతి భద్రతలు' అనే అంశంపై జరిగిన లఘు చర్చ సందర్భంగా ఆమె మాట్లాడారు.

**కులాల పేర్లు మార్చుకొని అసభ్య పోస్టులు**

'జగన్ వల్ల కొందరు తమ కులాల పేర్లు మార్చుకొని దొంగ పేర్లతో సామాజిక మాధ్యమాల్లో మాపై



దూషణలకు దిగుతున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇష్టానుసారం పోస్టులు పెడుతున్నారు. బయటకు కనిపించకుండా, ఆర్గనైజ్డ్ క్రైమ్ చేస్తున్నారు. 2024 జూన్ 1 నుంచి ఇప్పటి వరకు సామాజిక మాధ్యమాల్లో పోస్టులపై 1,122 కేసులు నమోదు చేశాం' అని హోంమంత్రి తెలిపారు. 'రప్పారప్పా నరుకుతా అని బోర్డులు పెడితే.. కేసులు పెట్టమా? గంజాయి, బెట్టింగ్ బ్యాచ్‌ల వద్దకు జగన్ పరామర్శలకు వెళ్తారు. దారిలో సింగయ్య వంటి కార్యకర్తలను తొక్కించుకొని పోతారు అయినా మనం ఏమీ మాట్లాడకూడదంటారు. జగన్ పర్యటనలను మేం ఎక్కడా అడ్డుకోవడంలేదు. అయినా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆయన అసెంబ్లీకి రారు. ప్రతిపక్ష హోదా ఇవ్వండని కోరతారు. సీఎంకు నోటీసులు పంపిన సీఐ శంకరయ్యపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోనున్నాం' అని పేర్కొన్నారు.

**గంజాయి సాగులేకుండా చేశాం**

'వైకాపా పాలనలో దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఏపీలో ఉండేవి. ఆ సమయంలో మహిళలపై నేరాలు అత్యధికంగా జరిగేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈగల్ వ్యవస్థను ఏర్పాటుచేసి, గంజాయిపై ఉక్కుపాదం మోపింది. రాష్ట్రంలో గంజాయి మొక్క కనిపించకుండా చేశాం. పొరుగు రాష్ట్రాల నుంచి రవాణా అవుతున్నదాన్ని కూడా అరికట్టడంలో సఫలమయ్యాం. మెడికల్ దుకాణాల్లో మాదక ద్రవ్యాలు లభిస్తున్నాయనే ఫిర్యాదులపై.. ఆపరేషన్ గరుడ పేరుతో దాడులుచేసి 152 దుకాణాలను సీజ్ చేశాం. 40 వేల ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశాం. మహిళలు, పిల్లల భద్రత కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి, మహిళా ఐపీఎస్ అధికారిని నియమించాం. 12 అంశాలతో శక్తి యాప్‌ను పునరుద్ధరించాం. 164 శక్తి బృందాలు పనిచేస్తున్నాయి. కొద్దిరోజుల కిందట ఓ అమ్మాయి రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకోవడానికి వెళితే.. దీనిపై ఫోన్ రావడంతో శక్తి బృందం వెళ్లి, ఆమెను కాపాడింది. ఇప్పుడు ఆమె డీఎస్సీలో ఎంపికైంది' అని అనిత తెలిపారు.

## తప్పు చేసిన వారిని వదలను

-మొదటిపేజీ తరువాయి

చేసే దారుణ స్థితి కల్పించారు. అప్పటి అరాచకాలన్నీ చెప్పాలంటే రోజులు సరిపోవు. మీ ఆవేశంలో అర్థముంది.. మీ ఆవేదన పట్ల సానుభూతి ఉంది. నేనూ బాధితుడినే. కాకపోతే నాది కక్ష రాజకీయం కాదు. అందుకే 23 క్లెమోర్‌లతో పేల్చినా.. బయట పడి 23వసారి తిరుమలేశుడికి పట్టువస్త్రాలు సమర్పించాను" అని చంద్రబాబు వివరించారు. మావోయిస్టుల హింసకు తాను వ్యతిరేకం తప్ప వారితో ఎలాంటి ఇబ్బందీ లేదన్న చంద్రబాబు, తనకు రాష్ట్ర భవిష్యత్తు తప్ప ప్రాణాలు ముఖ్యం కాదని వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

**నేర ప్రవృత్తిని కట్టడి చేద్దాం.**

"రాష్ట్రంలో నేర ప్రవృత్తి ఉన్న ప్రతి ఒక్కరినీ కట్టడి చేసి వీలైనంత మేరకు నేరాలు తగ్గించేందుకు అందరం కృషి చేద్దాం. హింసకు పాల్పడితే సొంత మనుషులైనా ఉపేక్షించబోను. గతంలో భూమా నాగిరెడ్డి, బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిని కూడా ఫ్యాక్షన్ గొడవల్లో అరెస్టు చేయించాను. అప్పట్లో పోలీసు వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేది. గత ఐదేళ్లలో భ్రష్టు పట్టించారు. నేరస్థులకు అండగా ఉండే రాజకీయ నాయకుల్ని చూశాను తప్ప నేరస్థులే రాజకీయ ముసుగు వేసుకుని అరాచకాలకు పాల్పడం వైసీపీ హయాంలోనే చూశాను."

**బాధితులకు న్యాయం చేస్తాం..**

"వైసీపీ అరాచకాలకు బలైన వారి కుటుంబసభ్యులకు న్యాయం చేస్తాం. టీడీపీ కార్యకర్త తోట చంద్రయ్య, సోదరిని రక్షించుకునే క్రమంలో ఆహుతైన అమరేంద్ర గౌడ్, వైసీపీ ఎమ్మెల్సీ డ్రైవర్ సుబ్రమణ్యం, దళిత డాక్టర్ సుధాకర్, పల్నాడులో జల్లయ్య హత్య కేసు, వైసీపీ నేత అదే జిల్లాలో గిరిజన మహిళను ట్రాక్టర్‌తో తొక్కించిన ఘటన, కడపలో వెటర్నరీ డాక్టర్ హత్య తదితర కేసులపై సీబీఐ దర్యాప్తు చేస్తోంది. బాధ్యులకు కోర్టుల్లో శిక్షలు పడేలా ఆధారాలు సేకరిస్తోంది" అని చంద్రబాబు తెలిపారు.

**చట్టాన్ని బలోపేతం చేస్తాం..**

"మారుతున్న కాలానికి అనుగుణంగా సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు పెరుగుతున్నాయి. వాటి కట్టడికి పోలీసుశాఖ సైబర్ కమెండోలను సిద్ధం చేస్తోంది. డిజిటల్ అరెస్టులు, ఈడీ, సీబీఐ అనగానే విద్యావంతులే కోట్ల రూపాయలు సైబర్ నేరగాళ్లకు సమర్పించుకొంటున్నారు. ఇది బాధాకరం. ఫేక్ ప్రచారాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ఇతర దేశాల్లో టీమ్‌లు ఏర్పాటు చేసుకుని తప్పుడువార్తలు సృష్టించి సోషల్ మీడియాలో వదులుతున్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ పైశాచికానందం పొందుతున్నారు. త్వరలో చట్టాన్ని మరింత బలోపేతం చేసి ఇలాంటి వారిని శిక్షిస్తాం. రాజధానికి భూములిచ్చిన ఆడబిడ్డల్ని వ్యభిచారులనడం కన్నా దారుణం ఏముంటుంది? మా ప్రభుత్వం అధికారంలోకొచ్చే నాటికి రాష్ట్రమంతా గంజాయి, మత్తు విస్తరించింది. ఈగల్ వింగ్ ఏర్పాటు చేసి గంజాయి జీరో సాగులోకి తీసుకొచ్చే క్రమంలో దాదాపు విజయం సాధించాం."

## చిరస్థాయిగా నిలిచే శుభ సమయం



అమరావతి

ఏకకాలంలో 15,941 మంది ఉపాధ్యాయులను నియమించిన ఈ శుభ సమయం విద్యారంగంలో చిరస్థాయిగా నిలిచిపోతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఉద్యోగార్థులు ఎన్నో ఏళ్లు డీఎస్సీ కోసం నిరీక్షించారని చెప్పారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో యువతకు ఇచ్చిన మాటకు కట్టుబడి మెగా డీఎస్సీ ద్వారా వారికి దారి చూపిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. డీఎస్సీ నియామకాల ఫైలుపై సీఎం చంద్రబాబు తొలి సంతకం చేశారని గుర్తుచేశారు. సీఎం మార్గదర్శకత్వంలో విద్యాశాఖ మంత్రి, సోదరుడు లోకేశ్ ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లారని కొనియాడారు. ఈ ప్రక్రియలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. ఆరోగ్యం సహకరించని కారణంగా డీఎస్సీ నియామక పత్రాల ప్రధాన కార్యక్రమానికి తాను వ్యక్తిగతంగా హాజరు కాలేకపోయానని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను తీర్చిదిద్ది వారి భవితకు బాటలు వేసే బృహత్తర బాధ్యత ఈ రోజు నియామక పత్రాలు అందుకుంటున్న ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఆ దిశగా విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# ఉప్పాడలో ఏం జరుగుతోంది?

రాజమండ్రి

గోదావరి జిల్లాలో మత్స్యకారులు ఆందోళనతో ఉన్నారు. ముఖ్యంగా కాకినాడ ఉప్పాడ తీరంలో రసాయన వ్యర్థాలతో మత్స్య సంపదకు నష్టం వాటిల్లుతోందని.. మత్స్య సంపద అంతరించి పోతుందనే భయంతో పెద్ద ఎత్తున ఆందోళన బాటపట్టారు. రహదారులను దిగ్బంధించారు. ఒక్కో మత్స్యకార కుటుంబానికి లక్ష యాభై వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు కలుగజేసుకొనీ వారి ఆందోళనను విరమింప చేశారు. అయితే గోదావరి జిల్లాలో ఇలా మత్స్యకారులు రహదారుల పైకి రావడం ఆందోళన కలిగించింది.ఉప్పాడ నుంచి అద్దరిపేట వరకు సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. గతంలో అపారమైన మత్స్య సంపద చిక్కేది. కానీ ఇప్పుడు ఆశించిన స్థాయిలో చేపలు వలలు చిక్కడం లేదు. ఒకప్పుడు రాత్రి వేటకు వెళ్లి తెల్లారేసరికి వలలో కుప్పలు కుప్పలుగా చేపలు పడేవి. ఇప్పుడు చేపలు చిక్కకపోవడంతో మత్స్యకారులు ఉపాధికి దూరమయ్యారు. అయితే దీనంతటికీ కారణం తీరంలో ఉన్న రసాయన పరిశ్రమలేనని తెలుస్తోంది. భారీ ఔషధ తయారీ పరిశ్రమలు, ల్యాబ్లు తీర ప్రాంతంలో ఉన్నాయి. అవి విడిచి పెట్టే వ్యర్థాలతోనే సముద్రంలో నీటి రంగు మారిపోతోందని.. అందుకే చేపలు వలలకు చిక్కడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ఒకప్పుడు వలలో పడిన చేపలతో తమ కుటుంబాలు సుఖంగా జీవించేవని.. ఇప్పుడు ఉపాధి లేక అప్పులు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మత్స్యకారులు.అయితే తీర ప్రాంతం వెంబడి మత్స్యకారులు ఇప్పుడు రోడ్డు ఎక్కడంతో ఏదో ఉద్యమంలా మారే అవకాశం ఉంది. సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు. సముద్రం విషం గా మారిందని.. మమ్మల్ని రక్షించేది ఎవరు అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ సమస్యపై తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ సమస్యపై అధ్యయనానికి కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, ఫిషరీస్, రెవెన్యూ ఉన్నతాధికారులు, కాకినాడ జిల్లా కలెక్టర్ తో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంతో పాటు జీవనోపాధి మెరుగుదల, వీరప్రాంత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ఈ కమిటీ దృష్టి పెడుతుందని చెప్పారు. ఈ కమిటీ నివేదికల ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. అయితే తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉప్పాడ మత్స్యకార కుటుంబాలు చేపట్టిన నిరసనలు రెండో రోజు కూడా కొనసాగుతున్నాయి.



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శుక్రవారం 26 సెప్టెంబర్ 2025




www.viswamvoice.com

# ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి.

పాత పింఛన్ విధానము వెంటనే అమలు చేయాలి,

మంత్రి నారాలోకేష్‌కు వినతిపత్రం అందజేసిన ఎస్సీ,ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్:** మంగళగిరిలో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖమంత్రి నారా లోకేష్ కి రాష్ట్ర ఉపాధ్యాయ సమస్యలపై మెమోరాండం ఎస్సీ ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు,అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.డి సత్యనారాయణరెడ్డి, అన్ను వెంకట్రావు, వ్యవస్థాపక అధ్యక్షులు ముఖ్య సలహాదారులు పోతల దుర్గారావు, కోశాధికారి ఆవల అప్పన్న,మంగళగిరి సచివాలయంలో సమర్పించారు.

**ఉపాధ్యాయ సమస్యలు:**

1)డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానము వెంటనే అమలు చేయాలి,

2) ప్రభుత్వము వెంటనే 12 పిఆర్సిని ప్రకటించి ఐ.ఆర్ ను ఉద్యోగుల మనోభీష్టం నకు అనుకూలంగా ఇవ్వవలసిందిగా కోరడమైనది.

3) బదిలీ అయినా ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి వారి స్థానంలో నూతన డిఎస్సి వారిని నియమించాలి.

4) 17 ,10 ,2002, డీఎస్సీ లో సెలెక్ట్ అయిన ఉపాధ్యాయుల కంటే 1,11, 2002 లో ప్రమోషన్ పొంది ఫీ డర్ కేటగిరీలో సీనియర్లు అయినవారిని, 17, 10, 2002, డీఎస్సీ వారి కన్నా సీనియర్లుగా పరిగణించాలి,

5) అసెస్మెంట్ పరీక్షలబుక్లెట్ విధానాన్ని, పున సమీక్షించాలి

6) జీవో నెంబర్ 342 స్టడీ లీవ్ ను ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులకు ఆయా విద్యా సంవత్సరంలోనే, వారు ట్రైనింగ్ అవకాశాన్ని కల్పించి వారి పదోన్నతికి దోహదపడే విధముగా కోరడమైనది.

7) ఏకీకృత సర్వీసు రూల్స్ అమలకు చర్యలు గైకొనాలి.

8) ప్రతి హై స్కూల్ లోనూ కంప్యూటర్ ఆపరేటర్ ను,

9) దసరా పండుగ సందర్భంగా బకాయిలు పడిన నాలుగు డి ఎ లను, వెంటనే ప్రకటించాలి.

10) 11వ పి.ఆర్.సి బకాయిల అమలకు చర్యలు గైకొనాలి.

11) పిఎఫ్ జిపిఎఫ్ ,ఏపీ జిఎల్ఐ సరెండర్ లీవ్ బకాయులకు వెంటనే నిధులు మంజూరు చేయవలసిందిగా కోరడమైనది.

12) మెడికల్ లీవ్ రియంబర్స్మెంట్ బిల్లులు చెల్లించుటకు ఉత్తర్వులు మంజూరు చేయాలి.

# మెడికల్ కాలేజీల నిర్వహణలో పిపిపి మోడల్ వద్దు.... ప్రభుత్వమే నిర్వహించాలి

**.........రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్..**






**కాకినాడసిటీ:విశ్వం వాయిస్ న్యూస్** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ లో ప్రకటించిన పి పి పి పద్ధతిలో మెడికల్ కాలేజీల నిర్వహణ అంటే పరోక్షంగా ప్రభుత్వం తన బాధ్యతను,వదిలించుకుని ప్రైవేటు వారికి మెడికల్ కాలేజీలు అప్పగించడమేనని పలువురు పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ ఎ పి ఎన్ జి ఓ హోమ్ నందు రౌండ్ టేబుల్ సమావేశం ఎం. రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ వామపక్ష, ప్రజా, దళిత, పౌర సంఘాల నాయకులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభం ప్రముఖ చెస్ట్ డాక్టర్ సిహెచ్ గోపినాధ్ మాట్లాడుతూ ప్రభుత్వ విధి విధానాలు స్పష్టత ఇవ్వాలని కోరారు.గతంలో ఎన్ ఆర్ ఐ సీట్ కొటా రద్దు చేసారని, తాను చదువుతున్న రోజుల్లో యూసర్ చార్జీలు ప్రవేశపెడితే ప్రజల్లో పెద్ద నిరసన వచ్చింది అని తెలిపారు. పీపీపీ మోడల్ లో వైద్య విద్యార్థులు నుండి సీట్ ఫీజు నిమిత్తం ఎంత వసూలు చేస్తారు? వైద్యం నిమిత్తం ప్రజల నుండి ఏమైనా వసూలు చేస్తారా అనేది తేటతెల్లం చేయాలని కోరారు. ప్రపంచంలో ఎక్కడైనా వైద్య వ్యవస్థ ప్రభుత్వం అదినంలో ఉంటే ఒక రకముగా, ప్రైవేటు వాళ్ళు చేతుల్లో ఉంటే ఒకరకంగా ఉంటుందని దానిని ప్రజలే తేల్చుకోవాలని సూచించారు. సిపిఐఎంల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె వెంకటేశ్వర్లు, లైబరేషన్ జిల్లా నాయకులు సి చ్ నాగేశ్వరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారి ఆర్థిక విధానం అవాలంబిస్తూ కార్పొరేట్ లకు వైద్య విద్య తాకట్టు పెట్టడానికి పీపీపీ మోడల్ తీసుకొచ్చిందని దీనిని విరామించుకోవాలని డిమాండ్ చేసారు. బీసీ సంఘాల జాతీయ నాయకులు చోళ్లంగి వేణుగోపాల్, ఎస్సీ ఎస్టీ ఫోరమ్ నాయకులు బయ్యా రాజేంద్ర కుమార్,రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ వెనకబడిన సామాజిక వర్గాలకు చదువు దూరం చేసె కుట్రల్లో భాగం గానీ పీపీపీ అన్నారు. రిజర్వేషన్ లు ఇప్పటికే అమలు కావడం లేదని పీపీపీ తో మొత్తానికి ఎసరు తెచ్చే పద్దతి తెచ్చారని అన్నారు.సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్ మాట్లాడుతూ 3 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్ లో 8 వేలు కోట్లు ఖర్చు పెట్టి కాలేజీలు కట్టలేక పీపీపీ పేరుతో ప్రైవేటకరణ చేస్తున్నారని అన్నారు. పౌర సంఘం నాయకులు డి రమణ రాజు మాట్లాడుతూ పీపీపీ, ప్రజల కొరకు, ప్రజల చేత ప్రజాప్రభుత్వం పోయి ప్రైవేట్ జపం చేయడం చేస్తే కూటమిలోని అన్ని పార్టీలు మూల్యం చెల్లించుకుంటాయని అన్నారు. పౌర సమాజం దీనిపై గళం విప్పాలని కోరారు. ఆర్ టీ ఐ జేఏసీ నాయకులు పప్పు దుర్గా రమేష్,ఎంజేఫ్ నాయకులు హాసన్ షరీఫ్ మాట్లాడుతూ పెద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య చదువు చదవకుండా చేసె కుట్రలు కేంద్రం తీసుకు వస్తే ఆ కోవలోనే రాష్ట్ర ప్రభుత్వం నడుస్తుందని తెలిపారు. ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి ఎం గంగా సూరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటికే ఇంటర్, నీట్ కోచింగ్ కు 2,3 లక్షలు ఖర్చు పెడుతున్నారని, పీపీపీ మోడల్ వస్తే కోట్లు ఖర్చు చేయగల విద్యార్దులే వైద్య విద్య చదువుతారని ఇది సమాజం లో సమాన అవకాశాలు దూరం చేయడమే అని అన్నారు.జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి వర్మ మాట్లాడుతూ, హై వే నిర్వహణ, పీపీపీ పద్ధతి లో నడిపి ప్రజలనుండి దోపిడీ చేస్తుసంవత్సరాలు తరబడి టోల్ టాక్స్ వసూలు చేసిన అనుభవం ఉందని, మెడికల్ విద్య లో కూడా ఇదే ధోరణి తెస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తన బాధ్యత నుండి వైదొలాగి ప్రైవేటుకు అప్పగించే పని తప్ప ఇంకోటి కాదంన్నారు.ఇంకా ఈ సమావేశంలో ఎం నరసింహం, గోపాల కృష్ణ తదితరులు మాట్లాడారు. రాజశేఖర్ మాట్లాడుతూ గుజరాత్ లో పీపీపీ మోడల్ అమలవుతుందని ఏ కేటగిరికి 8 లక్షలు, బి కేటగిరికి 16 లక్షలు, సి కేటగిరి కి 30 లక్షలు ఫీజులు వసూలు చేస్తున్నారని ప్రభుత్వం ఇక్కడ కూడా అదే రకంగా చేసి 33 సంవత్సరాల తరువాత వెనక్కి తీసుంటే ప్రయివేట్ వారు వప్పుకుంటారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రజలతో దాగుడు మూతలు ఆడుతుందని స్పష్టత చెపితే ప్రజలు తిరగభాడతారని అన్నారు. దళిత్ ఉద్యమ సీనియర్ నాయకులు అయితబత్తుల రామేశ్వరావు మాట్లాడుతూ ప్రజలను చైతన్య పరచడానికి కార్యాచరణ చేపట్టాలని పిలిపు ఇచ్చారు. తన కుమారుడు ప్రభుత్వ మెడికల్ కాలేజలోనే చదివారాని గుర్తు చేసారు.ఈ సమావేశం ప్రభుత్వమే మెడికల్ కాలేజీలు నడపాలని, పీపీపీ పద్ధతి వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తు తీర్మానం చేసింది. ప్రజలకు అవగాహనా పెంచడానికి కరపత్రం ముద్రించి పంచాలని, సమావేశాలు, చర్చలు చేయాలని తీర్మానం చేయడం జరిగింది. వైద్య విద్య కోసం చదివే విద్యార్థులు తో సంతకాల సేకరణ చేపట్టాలని నిర్ణయం చేయడం జరిగింది. ఈ సమావేశం లో సిపిఎం కాకినాడ రూరల్ మండలం కార్యదర్శి తిరుమల శెట్టి నాగేశ్వరావు, జె వి వి నాయకులు యు. సత్యనారాయణ,ఎస్ ఎఫ్ ఐ నాయకులు,శ్రీకాంత్ లోవరాజు, సాహిత్, వాసు తదితరులు పాల్గొనగ, పలివెల వీరబాబు వందన సమర్పణ చేసారు

## ఏక్ దిన్, ఏక్ గంటా, ఏక్ సాథీ నినాదంతో జిల్లా వాసులందరు స్వచ్ఛత వైపు అడుగులు వేయ్యాలి....


**....జిల్లా కలెక్టర్ షణ్మోహన్**






**కాకినాడ కలెక్టరేట్:విశ్వం వాయిస్ న్యూస్ :** ఏక్ దిన్-ఏక్ ఘంట-ఏక్ సాథ్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం కాకినాడ కలెక్టరేట్ లో స్వచ్ఛత హీ సేవ స్ఫూర్తితో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. జేసీ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ మానీషా, డీఆర్వో వెంకటరావు ఇతర అధికారులతో కలిసి శ్రమదానం చేశారు. కలెక్టరేట్ ఆవరణాలను శు భ్రం చేశారు. చెత్తను తొలగించి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవా స్ఫూర్తితో కనీసం రోజుకో గంటపాటైనా పరిశుభ్రతపై దృష్టి పెట్టారన్నారు. స్వచ్ఛత హీ సేవ స్ఫూర్తితో జిల్లాలో అన్ని మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో అన్ని ప్రదేశాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో పెద్ద ఎత్తున స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. మన ఇంటితోపాటు పని చేసే కార్యాలయాల పరిసరాల పరిశుభ్రత కూడా ఎంతో ముఖ్యమన్నారు. మన పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పాటు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు మానసిక ఆరోగ్యం పొందవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ కాకినాడ సాధనకు ప్రతి ఒక్కరు బాధ్యతతో కృషి చేయాలని ఏక్ దిన్, ఏక్ గంటా, ఏక్ సాథీ నినాదంతో జిల్లా వాసులందరు స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ. వెంకటలక్ష్మి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవులా నాయక్, సీపీవో పీ త్రినాథ్, కలెక్టరేట్ ఏవో ఎస్ రామ్మోహన్ రావు, వివిధ విభాగాల అధిపతులు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## 26 న శంఖవరంలో ఉద్యమ్ ఆధార్ క్యాంపు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరంలోని వెలుగు కార్యాలయలో ఉదయం 10 గంటల నుండి ఉద్యమ్ ఆధార్ క్యాంపును నిర్వహిస్తున్నట్టు మండల వెలుగు ఏపిఎం. వినకోటి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతదేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వ్యవస్థలో తమను తాము నమోదు చేసుకోవడానికి ఉచితంగా అవకాశం కల్పిస్తారు అన్నారు. వ్యాపారాల ఏర్పాటు ఆసక్తిగల వారికి ఈ వ్యవస్థ అనేక ప్రయోజనాలు లభిస్తాయి. వ్యాపారాలను గుర్తించడంలో కేంద్ర ప్రభుత్వం సహాయ పడుతుంది. ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు హాజరు అవుతారు. ఆసక్తి కలవారు అందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపిఎం. వినకోటి శ్రీనివాస్ ఆ ప్రకటనలో తెలిపారు. ఉద్యామ్ (గతంలో ఉద్యోగ్ ఆధార్) ప్రక్రియకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందడానికి, మరియు ప్రభుత్వ ప్రయోజనాలు, రుణాలు పొందడానికి అవసరమైన సహాయాన్ని అందిస్తాయి. క్యాంపులు ఉద్యామ్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు పడే వారికి సహాయం చేస్తాయి. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో నమోదు చేసుకోవడానికి, అవసరమైన పత్రాలను సరి చూసుకునేందుకు, రిజిస్ట్రేషన్ సమయంలో ఎదురయ్యే ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలను పరిష్కరించడంలో, లభించే ప్రభుత్వ ప్రయోజనాలు, రాయితీలు, రుణాల గురించి అనుభవజ్ఞులైన అధికారులు సమాచారం అందిస్తారు. బాగా అవగాహన కల్పిస్తారు. మార్గనిర్దేశం చేస్తారు. క్యాంపులు నిర్వహించే చోట సిబ్బంది దరఖాస్తులను పూర్తి చేయడంలో సహాయం చేస్తారని శంఖవరం మండల వెలుగు ఏపిఎం. వినకోటి శ్రీనివాస్ ఆ ప్రకటనలో తెలిపారు.

## కల్యాణ వెంకన్న కి సుమారు రూ.2 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమలాపురం పట్టణానికి చెందిన దాత రాపాక సత్యనారాయణ వేంకటేశ్వరస్వామి వారికి సుమారు రూ.2 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ చేయించేందుకు ముందుకు వచ్చారు. ఈ అలంకరణ ఈనెల 27వ తేదీ శనివారం నుంచి అక్టోబర్ 2వ తేదీ విజయదశమి వరకు భక్తులకు స్వామి దర్శనమిస్తారు. అన్నదాన సత్రం పక్కన స్థలాన్ని సిమెంట్ చేసి, షెడ్ నిర్మాణానికి కూడా రాపాక సత్యనారాయణ ఆర్థిక సహాయం అందజేస్తున్నారని దేవస్థానం చైర్మన్ కంచిపల్లి అబ్బులు తెలిపారు.

## పోసికుమార్‌ను పరామర్శించిన జేటి రామారావు



**ధవలేశ్వరం,విశ్వం వాయిస్ న్యూస్:** గురువారం ఉదయం ధవలేశ్వరం గ్రామం నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వికలాంగుల సెల్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ ను ఆంధ్రప్రదేశ్ ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు జేటి రామారావు పరామర్శించారు.ఇటీవల. పోసి కుమార్ మామయ్య వంగా వీరభద్రరావు స్వర్గస్తులైనందున పోసి కుమార్ స్వగృహము నందు వీరభద్రరావు చిత్రపటానికి పూలమాల వేసి రామారావు ఘనంగా నివాళులర్పించారు. తదుపరి వంగ వీరభద్ర రావు కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలియజేశారు.

## జాతీయస్థాయిలో కాకినాడ బార్ అసోసియేషన్ కు గుర్తింపు తేవాలి.....


**అధ్యక్షులు ఏలూరు సుబ్రహ్మణ్యం**




**కాకినాడ సిటీ:విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయస్థాయిలో కాకినాడ బార్ అసోసియేషన్కు గుర్తింపు తేవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం న్యాయవాద క్రికెట్ క్రీడాకారులు కోరారు. నవ్యాంధ్ర అడ్వకేట్ క్రికెట్ అసోసియేషన్ ( ఎన్ ఏ ఏ సి ఏ) ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి ఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా అడ్వకేట్స్ 20-20 క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్గా కాకినాడ బార్ అసోసియేషన్ న్యాయవాది దొంతుమళ్ల అశోక్ కుమార్, మరో న్యాయవాది గింజల చక్రవర్తికి జట్టులో చోటు దక్కింది. వీరిద్దరిని గురువారం బార్ అసోసియేషన్ భవన్లో సత్కరించారు. ఢిల్లీలో జరగబోయే 20 20 క్రికెట్ టోర్నమెంట్లో న్యాయవాదులు ఇద్దరు తమ సత్తాను చాటి కాకినాడకు మంచి పేరు తేవాలని అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం కోరారు. ఈ సందర్భంగా స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ నరహరిశెట్టి రవికృష్ణ అసోసియేషన్ కార్యదర్శి చెక్కపల్లి చంటి కమిటీ సభ్యులు పలువురు సీనియర్ జూనియర్ న్యాయవాదులు అభినందించిన వారిలో ఉన్నారు.

## కాకినాడ జిల్లాకు రూ.3.41 కోట్లతో క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సు..

**.....జిల్లా కలెక్టర్ షణ్మోహన్**



**కాకినాడ కలెక్టరేట్:విశ్వం వాయిస్ న్యూస్** గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు విలుగా క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సును అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుం దని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. బీపీసీఎల్ (భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) సీఎస్ఆర్ నిధులు రూ.3.41 కోట్లతో అత్యాధునిక సదుపాయాలు, అధునాతన వైద్య పరికరాలతో కూడిన క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సును కాకినాడ జిల్లాకు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు గురువారం కాకినాడ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీపీసీఎల్ సంస్థ ప్రతినిధులు..జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కు ఒప్పంద పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. జిల్లాలో క్యాన్సర్ ను ముందస్తుగా గుర్తించడంలో ముఖ్యమైన ముందడుగు పడిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు సకాలంలో జరగక చాలామంది క్యాన్సర్ బారిన పడుతున్నారని ఆయన తెలిపారు. ఈ క్యాన్సర్ బస్సును మూడు నెలలలో జిల్లాకు చేరనుందని, సామాజిక బాధ్యతతో కాకినాడ జిల్లాకు క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సును అందించేందుకు ముందుకు వచ్చిన బీపీసీఎల్ సంస్థ ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా కృతజ్ఞత అభినందనలు తెలియజేశారు.

కార్యక్రమంలో బీపీసీఎల్ టెరిటరీ మేనేజర్ బి.సురేష్, సీపీవో పీ త్రినాథ్ ఇతర ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎడిటర్ వాయిస్

# యువత అమెరికా కలలు కల్లలేనా?

దుర్మార్గమైన 50 శాతం టారిఫ్ వడ్డన తర్వాత ట్రంప్ అన్నయ్య తన భారతీయ సోదరులకు మరో దుర్మార్గపు వడ్డన సిద్ధం చేశారు. హెచ్‌వన్-బి వీసా ఫీజు పెంచి ఇప్పటికే అతలాకుతలమైపోతున్న భారత ప్రజానీకానికి మరో గిఫ్ట్ ప్యాకెట్ ఇచ్చారు. హెచ్‌వన్-బి వీసా మీద పనిచేస్తున్న ఉద్యోగులు అమెరికాకు బయట ఉంటే తక్షణమే అమెరికా గడ్డమీద అడుగుపెట్టం డోయ్ అని ఢంకా కొట్టారు. ఇదే అనువైన సమయమని అమెరికాకు భారత్ నుండి ఫ్లైట్ చార్జీలు 50 వేల నుండి లక్షలకు పెంచేశారు. ఈ చర్యలతో కుదేలైపోతున్న ఐటీ రంగం మన కళ్ల ముందు కనిపిస్తోంది. హెచ్‌వన్-బి వీసా ఉద్యోగులు ఇక నుండి తమ వీసా కోసం మూడు వేలు, అయిదు వేల డాలర్లు చెల్లించే కథకు ఫుల్ స్టాప్. నేడు అమెరికా కలలను సాకారం చేసుకోవాలనుకుంటే 85 లక్షల రూపాయలు సంవత్సరానికి వీసా కోసం మాత్రమే ఖర్చు పెట్టాల్సిన గడ్డు పరిస్థితి వచ్చింది. అంటే 1900 శాతం ఛార్జ్ పెరిగింది. సెప్టెంబర్ 20న అమెరికా కాలమానం ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త వీసాల కోసం ఇక నుండి 85 లక్షల రూపాయలను సంవత్సరానికి ఖర్చు చేయాల్సి ఉంటుంది. హెచ్‌వన్-బి వీసాను 1990లో అమెరికా అమలు చేసింది. టెంపరరీగా తమ దేశంలోని కొన్ని రంగాల్లో పనివారు అవసరం అని భావించి ఈ వీసాను ప్రమోట్ చేసింది. 2023లో 23 శాతం ఇండియన్ ఇంజినీర్లు అమెరికాలో ఈ వీసా ద్వారా పనిచేశారు. అది 2025లో 65 శాతానికి చేరుకుంది. ఇప్పుడు ఈ ఫీజు పెంచడంతో అమెరికాలో ఈ వీసాలను ఉపయోగించుకున్న కొన్ని కంపెనీలు నేడు ఇరకాటంలో పడ్డాయి. హిందుస్థాన్ టైమ్స్ ప్రకారం, 2024లో మూడు లక్షల 99వేల 395 మందికి హెచ్‌వన్-బి వీసా మంజూరు కాగా, అందులో భారతదేశం శాతం 71గా ఉంది. చైనా శాతం 11.7గా ఉంది. 2022లో భారత దేశం శాతం 81గా ఉంది. అక్టోబర్ 2022 నుండి సెప్టెంబర్ 2023 వరకు మంజూరైన నాలుగు లక్షల వీసాలలో 72 శాతం వీసాలు ఇండియన్స్ కోసమే కంపెనీలు వాడుకున్నాయి. ఈ లెక్కన చూస్తే, అత్యంత ప్రభావం భారతదేశం మీద మాత్రమే పడబోతుందని స్పష్టమవుతుంది. ప్రపంచీకరణ తర్వాత 1990ల నుండి వచ్చిన ఐటీ బూమ్ భారతదేశ కంపెనీలకు, భారతదేశ యువతరానికి ప్రాణవాయువును అందించింది. ఇంజనీరింగ్ డిగ్రీలు చేసి అమెరికా వెళ్లి లక్షలు గడించి తమ కలల్ని సాకారం చేసుకోవాలనుకున్న ఒక తరం ఆ రోజుల్లో సిద్ధమయింది. తమ కుటుంబ సభ్యులు యూఎస్‌లో ఉన్నారని చెప్పుకుంటూ గర్వంగా ఫీల్ అయ్యే ఒక అసహజమైన సాంస్కృతిక వాతావరణం ఏర్పడింది. దానికి తోడు అమెరికా అల్లుడు అంటూ వివాహాల మార్కెట్ రేట్లు కూడా అలానే పెరిగాయి. ఇంజనీరింగ్ కాలేజీలు అమెరికా ఆశలు అమ్ముకొని పుట్టగొడుగుల్లా వ్యాపించి లక్షలు వసూలు చేసేసి డిమాండ్ కంటే సప్లైని పెంచేసి లాభాల సంచుల్ని నింపుకున్నాయి. అమెరికాలో భారతీయ నిపుణులకు ఉద్యోగాలు ఇచ్చే కంపెనీలు వీసా ఖర్చులను కంపెనీలే భరిస్తాయి. అయితే అది అప్పుడున్న పరిస్థితి. ప్రస్తుతం సంవత్సరానికి 85 లక్షలు చెల్లించడానికి దాదాపు 70 శాతం ఉద్యోగులకు అలాంటి జీతాలు లేవు. మరి కంపెనీలు ఇంత అధిక శాతాన్ని వీసా కోసం ఆ దేశాలకు ఎందుకు అందిస్తాయి? అన్నది ఒక ప్రశ్న. కాబట్టి ఈ రిస్కు ఏ కంపెనీలు కూడా ఇకముందు తీసుకునే పరిస్థితిలో ఉండవు. అవి ఐటీ స్టాఫ్ మీద విడిచి పెట్టేస్తాయి. వారు కూడా అంతంత ఫీజులను చెల్లించే స్థితిలో ఉండకపోవడం ద్వారా కొత్తవారు అమెరికా కలల్ని కలలుగానే ఉంచేసుకుంటారు. అంతర్జాతీయ పెట్టుబడికి ఒక నేల కావాలి. అత్యంత చవగ్గా దొరికే శ్రామికులు కావాలి. వారు శారీరక శ్రామికులైనా, మేధా శ్రామికులైనా సూత్రం ఒక్కటే. అందుకే ప్రపంచీకరణ అంటూ వారి ప్రయోజనాలకు పనికొచ్చే విధంగా వ్యవస్థను అటూ ఇటూ సర్దు కున్నారు. చవగ్గా దొరికే శ్రామికుల్ని గతంలో తేయాకు పంటల్లో బ్రిటీష్ వారు ఉపయోగించిన విధంగానే, అమెరికాలో ఐటీ పరి శ్రమలో కూడా ఉపయోగించుకున్నారు. ప్రయోజనం పొందింది రెండు వైపులా కార్పొరేట్ వర్గాలే.. మరలా ఇదే ఐటీ శ్రామికులు దేశానికి ముప్పు అని కొత్త ప్రవ చనాలు వల్లిస్తున్నారు. ఐటీ శ్రామికులు అమెరికా లాంటి దేశాలకు పయనించడం ద్వారా ఆ దేశాలకు బాగా పనికొచ్చింది. ప్రయోజనం పొందింది ఆ దేశాల



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# సెబీకి విశ్వసనీయత ఉందా!



షార్ట్- సెల్లింగ్‌లో 24 జనవరి 2023న ప్రత్యేకత కలిగిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ కంపెనీ షేరు ధర పడిపోతుందనే అంచనాతో దాని ధరపై పందెం వేయడం - అదానీ గ్రూప్ అకౌంటింగ్ అక్రమాలు, స్టాక్ మానిప్యులేషన్, షేర్ ధరలను పెంచడానికి ఆఫ్ షోర్ షెల్ కంపెనీలను ఉపయోగించిందని ఆరోపిస్తూ 106 పేజీల నివేదికను ప్రచురించింది. గత వారం ఈ ఆరోపణలలో కొన్నింటిని సెబీ తోసిపుచ్చింది. దాని నిబంధనల ప్రకారం అదానీ కంపెనీలు, సంబంధిత పార్టీల మధ్య ఎటువంటి లావాదేవీలు జరగలేదు. అందువల్ల, పెట్టుబడిదారులకు బహిర్గతం చేయవలసిన అవసరం లేదు. అవి మార్కెట్ మానిప్యులేషన్‌కు కారణమని పేర్కొంది. డబ్బులు దారి మళ్లించినట్లు లేదా నిధులను మళ్లించినట్లు లేదా పెట్టుబడిదారులు డబ్బును కోల్పోయినట్లు ఎటువంటి ఆరోపణలు లేవని కూడా సెబీ పేర్కొంది. అదానీ కంపెనీలు ఏదైనా సంస్థ నుండి తీసుకున్న రుణాలను దర్యాప్తు ప్రారంభానికి ముందే తిరిగి చెల్లించారని కూడా సెబీ పేర్కొంది. యోగ్యత ఆధారంగా, నిందించబడిన లావాదేవీలను తారుమారు లేదా మోసపూరిత లావాదేవీలు లేదా అన్యాయమైన వాణిజ్య పద్ధతులుగా వర్గీకరించలేమని కూడా నిర్ధారించబడింది. రాయిటర్స్ వార్తా సంస్థ ప్రకారం, సెబీ అదానీ సంస్థలపై రెండు అభియోగాలను తొలగించింది, కానీ ఇన్‌సైడర్ ట్రేడింగ్ నుండి పబ్లిక్ ఫ్లోట్ ఉల్లంఘనల వరకు 22 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. గత సంవత్సరం, షార్ట్-సెల్లర్ సెబీ మాజీ చీఫ్ మాధబి పూరి బుచ్ అదానీ గ్రూప్ ఉపయోగించే ఆఫ్‌షోర్ నిధులతో సంబంధాలు కలిగి ఉన్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. మే నెలలో భారతదేశ అవినీతి నిరోధక వాచ్‌డాగ్ హిండేబర్గ్ ఆరోపణల ఆధారంగా ఆమెపై మోపబడిన అన్ని అవినీతి ఆరోపణల నుంచి ఆమెను తొలగించింది. ఈ సంవత్సరం ప్రారంభంలో, హిండేబర్గ్ రీసెర్చ్ వ్యవస్థాపకురాలు నేట్ ఆండర్సన్, కంపెనీని ప్రారంభించిన ఎనిమిది సంవత్సరాల తర్వాత దానిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. హిండెన్‌బర్గ్ విడుదల చేసిన నివేదికతో ప్రపంచం యావత్తూ గగ్గోలు పెట్టగా సెబీ ఆ కీలక ఆరోపణల్ని తోసిపుచ్చడం దారుణం. భారతదేశంలోని అతి ముఖ్యమైన రెగ్యులేటరీ సంస్థ సైతం అదానీ తదితర కార్పొరేట్లకు అనుకూలంగా మారిందనడానికిది తాజా తార్కాణం. అదానీపై హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరూపణ కాలేదు. అదానీ గ్రూప్ కంపెనీలు ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదు. ఆ సంస్థపై జరిమానా విధించాల్సిన అవసరం లేదు అని సెబీ హోల్ టైం మెంబర్ కమలేష్ చంద్ర వర్షనేరు తన ఆర్డర్‌లో పేర్కొనడం దిగజారుడు తనానికి నిదర్శనం.

దీంతో అదానీ పవర్, గౌతం అదానీ, రాజేష్ అదానీలపై కొనసాగుతున్న దర్యాప్తు కార్యకలాపాలకు సెబీ మంగళం పాడింది. అదానీ గ్రూప్ తన కంపెనీల ఆదాయాన్ని పెంచడానికి, షేర్ల ధరలను కృత్రిమంగా మార్చడానికి విదేశీ బినామీ, షెల్ కంపెనీలను వాడుకుందని, అదానీ తీవ్ర ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని అప్పట్లో వెల్లడించింది. ఆ దెబ్బతో ఆ సమయంలో స్టాక్ మార్కెట్‌లో అదానీ గ్రూపు కంపెనీల విలువ దాదాపు లక్షల కోట్లు హరించుకుపోయింది. అదానీ ఆర్థిక అక్రమాలను నిశితంగా పరిశీలించామని, సాక్ష్యాలను సంపాదించామని, దాదాపు 100 పేజీల సాక్ష్యాలను రిపోర్ట్‌లో హిండెన్‌బర్గ్ పేర్కొంది. అయినా అవేవీ సెబీ విచారణలో అక్కరకు రాలేదు లేదా వాటిని చూడ నిరాకరించినట్టుంది. ఏలినవారి మద్దతుగల శతకోటీశ్వరుడు తప్పు చేశారనీ, ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారనీ సెబీ చెప్పగలదా? ముమ్మాటికీ అలాంటిది అసంభవమని గత పదేళ్ల చరిత్ర చెబుతోంది. అప్పటి సెబీ చైర్‌పర్సన్ మాధాబి పురీ బుచ్‌కు అదానీ గ్రూపు సంస్థలతో ఉన్న అక్రమ ఆర్థిక సంబంధాన్ని సైతం హిండెన్‌బర్గ్ బయటపెట్టిన విషయం తెలిసిందే. హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారం అంటూనే బెర్ముడా, మారిషస్ వంటి ఆఫ్ షోర్ కంపెనీల్లో, అందునా గౌతం అదానీ సోదరుడు వినోద్ అదానీ ఆధ్వర్యంలోని ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టినట్లు బుచ్ ఫ్యామిలీ అంగీకరించిన విషయం లోకానికెరుకే! తన భర్త బాల్య స్నేహితుడు నిర్వహిస్తున్న ఫండ్‌లోనూ పెట్టుబడులు పెట్టారని మాధాబి అప్పట్లో ధ్రువీకరించారు. 'అదానీ గ్రూపు సంస్థల్లో పెట్టుబడుల తీరును సమీక్షించాల్సిన సెబీ చైర్మన్‌కు వాటిల్లో వ్యక్తిగత పెట్టబడులు, ఇతర స్పాన్సర్ల నిధులు ఉన్నాయి. ఇది విరుద్ధ ప్రయోజనాల అంశం కిందకు వస్తుంది' అని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. అదానీ కంపెనీలతో సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధాబి చరిత్ర ఇదే. దేశంలో కార్పొరేట్ కంపెనీల ఆర్థిక వ్యవహారాలను నియంత్రించవలసిన సంస్థకు అధినేతలుగా అటువంటి వ్యక్తులను నియమించడంలోనే అసలు తిరకాసు ఉంది. నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలు క్రమంలో దేశంలో కార్పొరేట్లు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకుల మధ్య బలమైన బంధం ఏర్పడింది. ఆ బంధం గత పదకొండేళ్ల నరేంద్ర మోడీ పాలనలో మరింతగా బలపడింది. అందుకే ఈ మూడు తరగతులకు చెందినవారు ఒకరినొకరు సమర్థించుకోవడం రివాజుగా మారింది. తాజా అంశం వాటిలో ఒకటి మాత్రమే! అదానీ సెకీ కుంభకోణం గురించి ఒకసారి గుర్తు తెచ్చుకున్నా ఈ విషయం అర్థం అవుతుంది. అదానీ గ్రూపు కార్పొరేట్లు, సెకీ, రాష్ట్ర విద్యుత్ రంగ ఉన్నతాధికారులు అప్పటి ప్రభుత్వాధినేతతో జరిపిన మంతనాలు, వేల కోట్ల రూపాయలు చేతులు మారడం, ఇవన్నీ ఒక్కసారి సినిమా రీల్ మాదిరి తిరుగుతాయి.

# సంఘ సంస్కర్త బంకుపల్లె మల్లయ్యశాస్త్రి

బంకుపల్లె మల్లయ్యశాస్త్రి ప్రముఖ పండితుడు. . రచయిత. ప్రధానంగా సంఘసంస్కర్త. సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన మల్లయ్యశాస్త్రి హైందవ సాంప్రదాయంలో ఉన్న మూఢాచారాలను పూర్తిగా వ్యతిరేకించాడు. స్త్రీ పునర్వివాహము శాస్త్రీయమని అనేక సభలలో వాదించి నిరూపించాడు. స్త్రీ విద్య ఆవశ్యకత గురించి పలు ఉపన్యాసాలు చేశాడు. తన ద్వితీయభార్యకు విద్య నేర్పించి మూడు ప్రబంధాలు, భారత భాగవత పురాణాలను నేర్పించాడు. ఆయన నేర్పిన విద్య, అందించిన ప్రోత్సాహం కారణంగా ఆమె సంగ్రహ రామాయణము, మరికొన్ని గ్రంథాలను రచించ గలిగింది. రజస్వలానంతర పురుష సంయోగార్హ కాలమే స్త్రీలకు వివాహకాలం అన్న సిద్ధాంతాన్ని ప్రకటించాడు. స్త్రీ పునర్వివాహము పూర్వాచారము కాకపోయినప్పటికి శాస్త్రీయము కాబట్టి ఆచరణీయమని వాదించాడు. సతీ శాసనము వచ్చిన తర్వాత పునర్వివాహము అవశ్యకత కలిగినదని వాదించి పత్రికలలో చర్చ కొనసాగించాడు. శారదా చట్టం ప్రతిపాదించిన కాలంలో ఆ చట్టానికి అనుకూలంగా మద్రాసు మొదలైన పలు ప్రాంతాలలో పలు సభలలో చర్చలు చేసి పండితులతో రజస్వలానంతర వివాహమే శాస్త్రీయమని అంగీకరింప చేశాడు. మల్లయ్య శాస్త్రి కుమార్తె కృష్ణవేణమ్మను శతావధాని వేదుల సత్యనారాయణశాస్త్రికి ఇచ్చి పునర్వివాహం చేశాడు. తన రెండవ భార్యవలన కలిగిన ప్రథమ కుమారుని జనన సమయంలో వారి ఆచారం ప్రకారం నల్లమేకను శక్తికి బలి ఇవ్వవలసి ఉండగా, ఆ ఆచారాన్ని విసర్జించాడు. శాఖాంతర వివాహం చేసి ఆకాలంలో ఆదర్శంగా నిలిచాడు. అస్పృశ్యత వ్యతిరేకంగా ఆంధ్రపత్రిక, త్రిలింగ పత్రికలలో వ్యాసాలు రాశాడు. మద్రాసు, నెల్లూరు, గుంటూరు, గోదావరి, కృష్ణ, విశాఖపట్నం, గంజాం మండలాలలో తిరిగి అస్పృస్యతా ప్రచారం చేశాడు. శూద్రులను తన ఇంటికి పిలిచి వారితో పాటు భోజనము చేసేవాడు. అప్పారావు అనే ఒక బ్రాహ్మణేతరుడిని తన ఇంటిలోనే ఉంచుకుని తన కుమారులతో పాటుగా చదువు సంధ్యలు చెప్పాడు. ఆయన ఆంధ్రపత్రిక, భారతి పత్రికలద్వారా ధర్మశాస్త్రములను పరిశీలించి అందలి విషయాలను సప్రమాణకంగా ప్రకటించేవాడు. మల్లయ్యశాస్త్రి 1876వ సంవత్సరం ఏప్రిల్ 29వ తేదీ ధాత నామ సంవత్సరం వైశాఖ శుద్ధ పంచమి నాడు పునర్వసు నక్షత్రము, తులాలగ్నములో గంజాం జిల్లా సింగుపురం గ్రామంలో తన మాతామహుని ఇంటిలో జన్మించాడు. స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట మండలానికి చెందిన ఉర్లాం గ్రామం. ఆయన తల్లిదండ్రులు సూరమ్మ, గంగన్న. ఆయనది కృష్ణ యజుశ్శాఖ, ఆపస్తంబ సూత్రుడు, భారద్వాజ గోత్రుడు. మల్లయ్యశాస్త్రి తన ఐదవ యేట తన తండ్రివద్ద వేదాధ్యయనము ప్రారంభించాడు. తరువాత ఉర్లాం జమీందారు కందుకూరి బసవరాజు ఆస్థాన పండితుడైన భళ్లమూడి లక్ష్మణ శాస్త్రి వద్ద సంస్కృతము నేర్చుకున్నాడు. తన పదహారవ యేడు వచ్చే సమయానికి పంచ.కావ్యాలు పూర్తిగా చదివాడు. తరువాత పర్లాకిమిడి రాజా వారి సంస్కృత కళాశాలలో చేరి అక్కడ భళ్లమూడి వెంకటశాస్త్రి వద్ద శృంగార నైషధము, అభిజ్ఞాన శాకుంతలము చదివాడు. తరువాత పరవస్తు రంగాచార్యుల వద్ద సిద్ధాంత కౌముది పూర్తి చేశాడు. కూరెళ్ల సూర్యనారాయణశాస్త్రి వద్ద తర్కశాస్త్రము చదువు కున్నాడు. పోకల సింహాచలం వద్ద సంగీతము నేర్చుకున్నాడు. బంకుపల్లి కామశాస్త్రి వద్ద మంత్ర శాస్త్రాన్ని అభ్యసించాడు. భళ్లమూడి దక్షిణామూర్తి శాస్త్రి వద్ద పంచదశ ప్రకరణములు, గీతాభాష్యము చదువు కున్నాడు. శ్రీకూర్మం సంస్కృత పాఠశాల పండితుడైన నౌడూరి వెంకటశాస్త్రి వద్ద మనోరమ, శబ్దరత్నములు, పారిభాషేందు శేఖరము చదివాడు. గిడుగు రామమూర్తి పంతులు వద్ద ఇంగ్లీషు చదివాడు. మంత్రశాస్త్ర విద్యలో తన సహాధ్యాయి అయిన గంటి సూర్యనారాయణ శాస్త్రి వద్ద వేదాంత, మీమాంస శాస్త్రాలను నేర్చుకున్నాడు. నీలమణి పాణిగ్రాహి వద్ద సూర్యసిద్ధాంత దర్పణాలను చదివి దృక్సిద్ధ పంచాంగాలను ఐదారు సంవత్సరాలు వెలువరించాడు. మల్లయ్యశాస్త్రి తన 21వ యేట శ్రీకాకుళం హైస్కూలులో తెలుగు పండిత పదవికి 18మంది పండితులతో పోటీపడి ప్రథముడిగా నెగ్గి ఆ ఉద్యోగాన్ని సంపాదించు కున్నాడు. అక్కడ రెండు సంవత్సరాలు పనిచేశాడు. తర్వాత కొంతకాలం లుకలాం గ్రామంలో కన్నేపల్లి రామావధాని కుమారులకు సంస్కృతం బోధించాడు. ఆ తర్వాత పర్లాకిమిడి రాజా వారి ఇంగ్లీషు కళాశాలలో తెలుగు పండిత పదవిని చేపట్టాడు. బరంపురం సిటీ కాలేజీలో కూడా సంస్కృతాంధ్ర పండితుడిగా కొంతకాలం పనిచేశాడు. 1912లో కలకత్తా సంస్కృత విద్యా పీఠంలో పరీక్ష ఉత్తీర్ణుడై కావ్యతీర్థ బిరుదాన్ని పొందాడు. సంస్కృతంలో సీతా కళ్యాణము, జానకీ వహ్ని ప్రవేశము అనే పురాణ హరికథలుగా వ్రాసినందుకు సంస్థానం రాజు "పురాణ వాచస్పతి" అనే బిరుదును ప్రదానం చేశాడు. ఆంధ్ర విద్యారణ్య, విద్యారత్న బిరుదులు పొందాడు. ఆయన కాశీయాత్రను ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఖరగ్‌పూర్ వద్ద 1947, సెప్టెంబరు 26న తనువు చాలించాడు.

# గర్భ నిరోధక పద్ధతులు- ఆరోగ్యం

మహిళా ఆరోగ్యం, శ్రేయస్సు కాపాడడంలో గర్భ నిరోధక పద్ధతులు బహుళ ప్రచారం పొందాయి. ప్రపంచవ్యాప్తంగా జనాభా నియంత్రణకు గర్భ నిరోధక పద్ధతులు వరంగా మారాయి. ఎంత మంది పిల్లలను కనాలి, ఎప్పుడు కనాలి లాంటి నిర్ణయాలు తీసుకొని గర్భనిరోధక పద్ధతులను అవలంబిస్తూ కుటుంబాలు ఎదగడం చూస్తున్నాం. "ఇద్దరు పిల్లలే ముద్దు" అనే నినాదం నుంచి నేడు "ఒక్కరు లేదా అసలే వద్దు (వన్ ఆర్ నన్)" నినాదాన్ని వెంటేసుకొని గర్భ నిరోధక మార్గాలను పాటిస్తూ ఒక్కరే సంతానాన్ని కనడం వరకు పరిస్థితి వచ్చింది. నేడు అందుబాటులో ఉన్న గర్భ నిరోధక పద్ధతులు, యువతలో లైంగిక - పునరుత్పత్తి ఆరోగ్యాలపై సమాచారంతో కూడిన ఎంపిక పట్ల సాధారణ ప్రజలకు అవగాహన కల్పించటానికి ప్రతి ఏట 26 సెప్టెంబర్ రోజు "ప్రపంచ గర్భ నిరోధక దినోత్సవం (వరల్డ్ కాంట్రసెప్టివ్ డే)" పాటించడం 2007 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రపంచ గర్భ నిరోధక దినం-2025 ఇతివృత్తంగా "అవాంతరాలను ఛేదించడం, వారసులను నిర్మించడం - అందరి ముంగిట గర్భ నిరోధక పద్ధతులు" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పించడం జరుగుతోంది. ప్రజారోగ్య సిబ్బంది, ఎన్‌జిఓ సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో గర్భ నిరోధక పద్ధతుల పట్ల సంపూర్ణ అవగాహన కల్పించాలి. గర్భ నిరోధక పద్ధతులతో మహిళా సాధికారత, పరిపూర్ణ ఆరోగ్య సురక్ష, కెరీర్ అభివృద్ధి, కుటుంబ ఆరోగ్యం, మహిళా హక్కుల పరిరక్షణ, లింగ సమానత్వ సాధన లాంటి ప్రయోజనాలు కూడా కలుగుతున్నాయి. నేడు పలు రకాల గర్భ నిరోధక పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఇంప్లాంట్లు, గర్భాశయ పరికరాలు (ఐయూడిలు), స్టెరిలైజేషన్ వంటి గర్భ నిరోధక పద్ధతులు పాటించడం కొనసాగుతున్నది. గర్భ నిరోధక మాత్రలు, ఇంజెక్షన్లు, ప్యాచ్‌లు, వాసెక్టమీ, కండోమ్‌లు, యోని రింగులు వంటి పద్ధతులను కూడా పాటిస్తున్నారు. ప్రణాళిక చేయని గర్భాలను తగ్గించడం, తమ కెరీర్‌ను బట్టి నిర్ణయాలు తీసుకోవడం, లింగ సమానత్వ సాధన, మహిళ లైంగిక ఆరోగ్యాన్ని బట్టి గర్భం దాల్చడం, గర్భ నిరోధక పద్ధతులను ప్రచారం చేయడం లాంటి లక్ష్యాలను ఈ వేదికగా వివరిస్తారు. అన్ని వయస్సుల వారికి, అన్ని వర్గాల ప్రజలకు, ఆడ మగ వర్గాలకు, కుటుంబ నేపథ్యాలకు తావులేకుండా అందరికీ గర్భ నిరోధక పద్ధతులు, లైంగిక ఆరోగ్యాల పట్ల అవగాహన కల్పించడం జరుగుతున్నది. యుక్త వయస్సు వచ్చిన తర్వాత గర్భం దాల్చడం, ఇద్దరు పిల్లల మధ్య 3 లేదా అంత కన్న ఎక్కువ సంవత్సరాలు ఉండే విధంగా చూసుకోవడం, ఎందరు పిల్లల్ని కనాలి అనే విషయంలో నిర్ణయం తీసుకొని తగు రీతిలో గర్భ నిరోధక పద్ధతులను పాటించడం విధిగా జరగాలి. గర్భ నిరోధక పద్ధతుల అమలు వ్యక్తులు, కుటుంబాలు, పౌర సమాజం పట్ల పలు రకాలుగా ప్రభావాన్ని చూపుతున్నాయి. కుటుంబ నియంత్రణ అమలులో గర్భ నిరోధక పద్ధతులను ప్రభుత్వాలు పలు విధాలుగా ప్రచారం చేయడం, సఫలం కావడం, ప్రపంచ స్థాయిలో జనాభా నియంత్రణ జరగడం చూసాం, నేటికీ చూస్తూనే ఉన్నాం. గర్భ నిరోధక పద్ధతులతో మాతాశిశు ఆరోగ్యం, ప్రణాళిక చేయని గర్భం దాల్చడాన్ని నిరోధించడం, మహిళ ఆరోగ్యానికి పట్టం కట్టడం లాంటి ప్రయోజనాలు ఒనగూడు తున్నాయి. గర్భ నిరోధక పద్ధతుల ద్వారా మహిళా లోకం ఆరోగ్యాన్ని పొందుతూ శక్తివంతం కావడం జరుగుతున్నది.

# ఆరోగ్య మహిళలతోనే ఆరోగ్య కుటుంబాలు సుసాధ్యం

## ప్రభుత్వ వైద్యులు శెట్టిబత్తుల శ్రీరామ రాజీవ్ కుమార్





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కుటుంబ జీవన విధాన వ్యవస్థలో గృహ నిర్వాహకురాలైన మహిళలు ఎంత ఆరోగ్యంగా ఉంటే అంత ఆరోగ్యవంతంగా తమ కుటుంబాలను తీర్చిదిద్దు కుంటారని, ఆరోగ్య వంతమైన కుటుంబాలతోనే ఆరోగ్యవం తమైన సమాజ నిర్మాణం సుసాధ్యం అవుతుందని శంఖవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యులు శెట్టిబత్తుల శ్రీరామ రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 75 వ పుట్టిన రోజు సందర్భంగా దేశ వ్యాప్తంగా మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు "స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" పథకం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తూ ఉన్నారు. ఇందులో భాగంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలోని అన్నవరం సచివాలయం 2 పరిధిలోని జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 23 న నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరానికి అదనంగా రెండో దఫాగా గురువారం కూడా వైద్యులు శ్రీరామ రాజీవ్ కుమార్ ఆధ్వర్యంలో మరో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలోని వైద్య బృందం, వివిధ శాఖల ప్రభుత్వ అధికారుల బృందం, కూటమి పార్టీల నేతలు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ శిబిరాల ముఖ్య ఉద్దేశం మహిళలకు సంపూర్ణంగా వైద్య పరీక్షలను నిర్వహించి వారికి అవసరమైన వైద్య సహాయం మందులను ఉచితంగా అందించి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడమే అన్నారు. రక్త ప్రసరణ, మధుమేహం, రక్తం హీనత వంటి రోగాలతో పాటు రొమ్ము , ప్రోస్టేట్, ఊపిరితిత్తులు, నోటి, చర్మ, మూత్రాశయ మూత్రపిండ కణాలు, గర్భాశయం వంటి శరీర భాగాలకు సోకే కేన్సర్ లక్షణాలను బట్టి వాటికి సంబంధించిన అన్ని రకాల ప్రాథమిక పరీక్షలనూ ఈ వైద్య శిబిరంలోనే నిర్వహించి పూర్తి నిర్ధారణకు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రికి సిఫారసు చేస్తామన్నారు. ఆపై అక్కడ రోగ నిర్ధారణ జరిగాక ప్రైవేటు కార్పొరేట్ సంస్థల వివిధ ఆస్పత్రుల్లో పూర్తిగా ఉచిత వైద్య సేవలను అందించే సౌకర్యాన్ని ప్రభుత్వమే కల్పిస్తుందని రాజీవ్ కుమార్ వెల్లడించారు. అందువల్ల మహిళలు, బాలికలు అందరూ విధిగా ఈ ఉచిత వైద్య శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని, అందుకు పురుషులు కూడా తమ సంపూర్ణ మద్దతును అందించి సహకరించాలని శంఖవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యులు శెట్టిబత్తుల శ్రీరామ రాజీవ్ కుమార్ పిలుపును ఇచ్చారు. అనంతరం వివిధ వైద్య విభాగాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య పరీక్షలను నిర్వహించారు. శంఖవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ మాసం - గర్భిణీ స్త్రీల పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా గర్భిణీలకు అవగాహనకు స్థానిక అంగన్వాడీ కార్యకర్తల బృందం పౌష్టికా హార ముడి పదార్థాల ప్రదర్శనను నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికి వారికి సూపర్ వైజర్ బి.వెంకట రజని పర్యవేక్షణలో తగు సలహాలు సూచనలను అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి, మాజీ వైఎస్ ఎంపీపీ. బొమ్మిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల కన్నా అన్నదానమే మిన్న

## మాజీ ఎ.ఏం. సి.చైర్మన్ కర్రి వెంకట్రాజు

భవాని భక్తులకు కర్రి సత్యనారాయణ నివాసం లో ప్రతిరోజు మహా అన్నసంతర్పణ..



**కాకినాడ రూరల్ : విశ్వం వాయిస్ న్యూస్.** అన్ని దానాల కన్నా అన్నదానమే మిన్న అని కాకినాడ రూరల్ మాజీ ఏఎంసీ చైర్మన్ కర్రి వెంకట్రాజు అన్నారు. స్థానిక తిమ్మాపురం గ్రామంలో దేవి శరన్నవరాత్రులు పురస్కరించుకొని స్వర్గీయ కర్రి సత్యనారాయణ వారి నివాసం వద్ద వారి కుమారుడు టిడిపి సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ( ఏఎంసీ )కర్రి వెంకట్రాజు ఆధ్వర్యంలో భవానీ భక్తులకు ఈనెల సెప్టెంబర్ 22 సోమవారం నుండి అక్టోబర్ 2 గురువారం విజయదశమి వరకు నిత్యం ఉదయం 12 గంటల నుండి వందలాది మంది భవానీలకు అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా కేఎస్ఎన్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ దివంగత నేత కర్రి సత్యనారాయణ వారు ఏర్పాటు చేసిన భవానీ భక్తులకు అన్నదానం నేటి వరకు వారి కుమారుడు 12 సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారని అన్నారు. ఈ అన్నసంతర్పణ కార్యక్రమంలో కేఎస్ఎన్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు జవ్వాది రాంబాబు, ఆకుల వెంకటరమణ, తలాటం సత్యనారాయణ, జవ్వాది వీరబాబు,మోటుపల్లి బుజ్జి భవాని, యేసు సోమేశ్వరరావు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సాయిబాబా, మల్లెపాముల సూరిబాబు,తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో "ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్" పరిశుభ్రత కార్యక్రమం






**కాకినాడ సిటీ:విశ్వం వాయిస్ న్యూస్** స్వచ్ఛతా హీ సేవా (%టూసూ)-%2025 ప్రచారం కింద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, "ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్" పరిశు భ్రతా కార్యక్రమాన్ని గురువారం ఉదయం కాకినాడ మున్సిపల్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక సురేష్ నగర్ మూడో డివిజన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ భావన ఐఏఎస్ అధ్యక్షత వహించగా, శాసన మండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ భావన, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీలు స్వయంగా పార్కులో చెత్తను చీపురుతో ఊడుస్తూ పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు. అనంతరం పార్కులో మొక్కలు నాటుతూ, ప్రజలతో కలిసి పరిశుభ్రత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ భావన ఐఏఎస్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీలు మాట్లాడుతూ"ప్రతిఒక్కరు ఒక రోజు, ఒక గంట సమయాన్ని పరిశుభ్రతకోసంకేటాయించాలి.బాధ్యతాయుతమైన అలవాట్లు అలవర్చుకోవాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలి. సమాజానికి శుభ్రమైన వాతావరణాన్ని అందించడంలో పారిశు ద్ధ్య కార్మికుల కృషి అమూల్యం, వారిని మనం గౌరవించాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కే. శ్రీనివాసరావు, ఎస్.ఇ. పి. వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, డిసిపి కె.వి. కృష్ణారావు, శానిటేషన్ సూపర్వైజర్ అప్పలనాయుడు, కార్పొరేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పండిట్ దీన్ దయల్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం.



**కాకినాడ రూరల్ :విశ్వం వాయిస్ న్యూస్.** పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం కాకినాడ రూరల్ మండలం గైగోలుపాడు లో మండల ప్రధాన కార్యదర్శి పాలిక శివ ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకినాడ పార్లమెంట్ కన్వీనర్ రంభాల వెంకటేశ్వరరావు కిసాన్ మోర్చా నాయకులు బొలిశెట్టి వెంకట రామకృష్ణ పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీన్ దయాల్ ఉపాధ్యాయ దేశం కోసం ధర్మం కోసం వ్యక్తి నిర్మాణమే లక్ష్యంగా ఏకాత్మ మానవతా వాదం అనే సిద్ధాంతంతో నిరాడంబర జీవితం గడుపుతూ దేశ ప్రజలలో చైతన్యం తీసుకువచ్చిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ స్థాపించిన జన సంఘ్ పార్టీకి ప్రధాన భూమిక పోషిస్తూ అధ్యక్షులుగా ఆయన చివరి జీవితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో వారణాసి మొఘల్ సరాయ్ స్టేషన్లో అనుమానాస్పద మృతిగా చిత్రీకరించడం జరిగిందని ఇలాంటి వ్యక్తులు ఇద్దరు ఉంటే దేశం దిశ దిశలు మార్చేస్తానని డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ అన్నారంటే ఆయన ఏ స్థాయి వ్యక్తో అర్థమవుతుందని ఆయన బాటలోని దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు నాయకులు నడుస్తున్నారని ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలన సాధించడానికి ప్రధాన మూల సిద్ధాంతం ఆయనేనని రంబాల అన్నారు.పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని గైగోల్పాడు విష్ణు ఆలయంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో కిసాన్ మార్చా నాయకులు బొలిశెట్టి వెంకట రామకృష్ణ, పాలిక శివ, బందరు అజయ్, కండిలి వెంకట్, లావరాజు,వీరబాబు,భద్రం,

## రాయితీలపై రైల్వే మంత్రిని సంప్రదిస్తా....

## ఎంపీ ఉదయ శ్రీనివాస్ హామీ....



**కాకినాడ సిటీ:విశ్వం వాయిస్ న్యూస్** సీనియర్ సిటిజన్స్ కు రైల్వే రాయితీల పునరుద్ధరణ పై రైల్వే శాఖ మంత్రిని సంప్రదిస్తానని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ హామీని ఇచ్చారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో కాకినాడ జిల్లా సీనియర్ సిటిజన్స్ సంఘ ప్రతినిధులు ఎంపీ ఉదయ శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ టీటీడీ దేవస్థానం సీనియర్ సిటిజన్స్ కు రోజుకు రెండుసార్లు స్లాట్స్ కేటాయించి సత్వరం దర్శన భాగ్యం కల్పిస్తుందని ఆ దిశగా రాష్ట్రంలో ప్రధాన దేవాలయాల్లో సీనియర్ సిటిజన్స్ కు ప్రత్యేక దర్శన వేళలు కేటాయించాలని వినతిపత్రం లో కోరారన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళతానని ఉదయ శ్రీనివాస్ హామీనిచ్చారు. సంఘ అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు మాట్లాడుతూ అక్టోబర్ 1న ప్రపంచ వృద్ధుల దినోత్సవం జరుగతున్నందున పార్లమెంట్ సభ్యులు ఉదయ్ శ్రీనివాస్ కు తమ సంఘం తరపున ఆహ్వాన పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అడబాల రత్న ప్రసాద్, సభ్యులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు, రవిశంకర్ పట్నాయక్, రాజా తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం సానా సతీష్ బాబు ఫౌండేషన్ కృషి ఫలించింది




**కాకినాడసిటీ:విశ్వం వాయిస్ న్యూస్** విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో సానా సతీష్ బాబు ఫౌండేషన్ చేసిన కృషి ఫలించింది. కాకినాడ మెయిన్ రోడ్డులో గల జిల్లా గ్రంథాలయ సంస్థలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, మౌలిక సదుపాయాలు లేవని తెలుసుకున్న ఫౌండేషన్, ఒక కంప్యూటర్‌తో పాటు సుమారు రూ.45 వేల విలువైన డీఎస్సీ మరియు ఇతర పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందించింది. ఈ సదుపాయాల వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షల్లో 16 మంది అభ్యర్థులు విజయాలు సాధించగా, పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరీక్షల్లో 9 మంది ఎంపికయ్యారు. గురువారం అమరావతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో విజేతలకు నియామక పత్రాలు అందజేయబడ్డాయి. ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థులు తమ విజయంలో సానా సతీష్ బాబు ఫౌండేషన్ అందించిన సహకారం ఎంతో మేలు చేసిందని, అందుకు గాను ఎంపీ సానా సతీష్ బాబుకు మరియు వారి తల్లిదండ్రులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతూ,"అభ్యర్థులు సాధించిన ఈ విజయం నాకు గర్వకారణం. ఇది మరెందరో యువతకు ప్రేరణాత్మకంగా నిలుస్తుంది," అని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఉపగ్రంథాలయాధికారి కె. కిషోర్ మాట్లాడుతూ, "సానా సతీష్ బాబు ఫౌండేషన్ అందించిన పుస్తకాలు, సదుపాయాల వల్లే నేడు గ్రంథాలయంలో కష్టపడి చదివిన విద్యార్థులు డీఎస్సీ, కానిస్టేబుల్ పరీక్షల్లో విజయం సాధించారు. ఇందుకు ఎంపీ సానా సతీష్ బాబు గారికి, ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు," అని తెలిపారు.

## ఆదర్ష్ కళాశాలలో ప్రారంభమైన సాధన 2కె25





**గొల్లప్రోలు, విశ్వంవాయిస్:** గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో ఆదర్ష్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద మూడు రోజులపాటు జరిగే సాంకేతిక విద్యా ఉత్సవాలు గురువారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ, డైరెక్టర్ బుర్రా అఖిలేష్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ సాంకేతిక విద్యా ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్ పో అనే అంశాలపై పోటీలు నిర్వహిస్తామని స్మార్ట్ బ్రిడ్జ ప్రతినిధి అక్షయ్ కుమార్ తెలియజేశారు. అంతేగాక శుక్రవారం ఉదయం నుంచి 24 గంటల హ్యాక్ థాన్ నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు.ప్రస్తుత ఆధునిక టెక్నాలజీ రంగంలో ఏఐ తో అద్భుతాలు సృష్టించేందుకు కావలసిన కోడింగ్ విధానాన్ని విద్యార్థులకు వినూత్న రీతిలో నేర్పించేందుకే సాధన 2కె25 ఏర్పాటు చేయడం జరిగిందని కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు పేర్కొన్నారు.ఈ సాంకేతిక విద్యా ఉత్సవాల్లో ఆదర్ష్ కళాశాల విద్యార్థులతో పాటు వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



# శిలా ఫలకాలా..? ప్రచార సాధనాలా..?

**కాదేదీ ప్రచారానికి అనర్హం అనేట్టు గా కనబడుతున్న పరిస్థితి.**
**నిధుల వివరాలు సూచించే శిలా ఫలకాలే.. సంక్షేమ సూచీలు.**
**మున్సిపల్ కమీషనర్ ను ప్రశ్నిస్తున్న పట్టణ ప్రజలు**






**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్:** ప్రభుత్వ కార్యాలయాల ప్రకటనలకు స్థలాల కొరత ఏర్పడిందో, సదుపాయాలు కరువయ్యాయో.? కాని జవాబు దారీ తనంగా ప్రభుత్వాలు జరిగించిన అభివృద్ధికి సాక్ష్యంగా ఆయా ప్రాంతాల్లో జరిగించిన అభివృద్ధి వాటి బడ్జెట్ వివరాలు నిష్పక్షపాతంగా శిలాఫలకాలపై ముద్రించి వాటి ప్రారంభోత్సవ వివరాలను సంక్షిప్తంగా తెలిపే శిలా ఫలకాలు మండపేట పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి, కొలువు పువ్వు సెంటర్ పరిసరాలలో పలు శిలాఫలకాలను మున్సిపల్ ప్రభుత్వ అధికారులకు ప్రకటన బోర్డులుగా మార్చిన పరిస్థితులు కనబడుతున్నాయి. మండపేటలో గత ప్రభుత్వాలు జరిగించిన అభివృద్ధికి గుర్తులైన శిలాఫలకాలను, కాపాడవలసిన మున్సిపల్ అధికారులే మరుగయ్యేలా చేశారు. రాబోయే తరాలకు గత పాలకులు చేసిన అభివృద్ధి, వాటి కోసం కేటాయించిన నిధులు వివరాలకు సాక్ష్యాలుగా ఉండే శిలాఫలకాల మీద మున్సిపాలిటీ వారు ప్రకటన బోర్డులను అతికించడం ఎంతవరకు సమంజసం అని, సీనియర్ సిటిజన్లు, పట్టణ ప్రజలు, సంఘసంస్కర్తలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రజా క్షేత్రంలోకి ఎన్నో రాజకీయ పార్టీలు వస్తుంటాయి పోతుంటాయి ప్రజల సంక్షేమం కొరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి వాటిని పూర్తి చేసిన అనంతరం ప్రభుత్వ ధనంతో నిర్మించిన శిలాఫలకాలను పరిరక్షించే బాధ్యత పురపాలక సంఘ కమిషనర్,అధికారులు పై ఉన్నప్పటికీ వారే ఇలాంటి చర్యలకు పాల్పడుతుంటే దీనిని అదునుగా తీసుకుని, ప్రైవేటు వ్యక్తులు కూడా మరింత గా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడతారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.




# సిరిసిల్లలో బూమ్ రాంగ్ అవుతోందా



**కరీంనగర్ :** కొంతకాలంగా సిరిసిల్ల కలెక్టర్ మీద భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఆయన ఎప్పుడు సిరిసిల్ల వెళ్ళినా సరే.. తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. కేటీఆర్ అనుచర వర్గం కూడా ఆ కలెక్టర్ మీద అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సిరిసిల్లలో అడ్డగోలుగా అక్రమాలు జరిగాయని.. ఆ అక్రమాలను ప్రస్తుత సిరిసిల్ల కలెక్టర్ బయట పెడుతున్నారని.. రేవంత్ అందుకోసమే ఆయనను సిరిసిల్ల పంపించారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కేటీఆర్ ఏ స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ.. ఆయన అనుచరులు ఏ స్థాయిలో మండిపడినప్పటికీ అక్కడి కలెక్టర్ మాత్రం తన శైలిని మాత్రం మార్చుకోలేదు. వాస్తవానికి కేటీఆర్ అనుచరులు చేసిన అక్రమాలను బయటికి తీసే క్రమంలో ఆయన అదే దూకుడు కొనసాగించి ఉంటే బాగుండేది. కానీ ఓ నిర్వాసితురాలి విషయంలో ఆయన వ్యవహరించిన తీరు ఏకంగా హైకోర్టు దాకా వెళ్ళింది. ఆయనకు మాత్రమే కాదు.. ప్రభుత్వానికి కూడా మొట్టికాయలు పడేలా చేసింది.సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గా సందీప్ కుమార్ ఝా పనిచేస్తున్నారు. అయితే ఇటీవల ఆయన మిడ్ మానేరు నిర్వాసితురాలు వనభట్ల కవిత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆయనకు పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆయన పట్టించుకోలేదు. పైగా ఆర్డీవో, ఎమ్మార్వోకు చెప్పి కేసులు నమోదు చేయించారు. దీంతో కవిత మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. అయితే గతంలో ఇదే పిటిషన్ మీద హైకోర్టుకు సందీప్ కుమార్ హాజరయ్యారు. ఆ సమయంలో ఆయన వేసుకున్న డ్రెస్ పట్ల హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కోర్టుకు వచ్చే ప్రొసీడింగ్ తెలియదా.. కోర్టుకు వచ్చే విధానం ఇదేనా అంటూ కలెక్టర్ మీద హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది.కవిత మరొకసారి హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో.. ఈసారి హైకోర్టు న్యాయమూర్తులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గతంలో బాధితురాలికి పరిహారం ఇవ్వాలని ఇచ్చిన తీర్పును యధావిధిగా అమలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వానికి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి హైకోర్టు సూచించింది. అంతేకాదు కలెక్టర్ ను చూస్తే భయం వేస్తోందని.. ఆయన డ్రెస్సింగ్ సెన్స్ బాగోలేదని.. ఇలాంటి వ్యక్తి ప్రజలకు ఎలా సేవ చేస్తారని హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. వాస్తవానికి ఇటీవలి కాలంలో ఒక కలెక్టర్ మీద ఈ స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడం ఇదే తొలిసారి. కేటీఆర్, ఆయన అనుచరులు అక్రమాలు వెలుగులోకి తేవాలని సందీప్ కుమార్ ని పంపిస్తే.. రేవంత్ లక్ష్యం నెరవేరకపోగా.. పైగా హైకోర్టు నుంచి చివాట్లు ఎదురయ్యాయని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

# అరికెపూడి గాంధీ ఆక్రమణలపై చర్చ



**హైదరాబాద్ :** శేర్లింగంపల్లి నియోజకవర్గంలో గులాబీ పార్టీ గుర్తు మీద 2023 లో జరిగిన ఎన్నికల్లో అరికెపూడి గాంధీ ఎమ్మెల్యేగా గెలిచారు. అంతకుముందు ఎన్నికల కూడా ఆయన విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లోను ఆయన ఎమ్మెల్యేగా గెలుపును సందం చేసుకున్నారు. మొత్తంగా హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రికార్డ్ సృష్టించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ఆయన తెలుగుదేశం పార్టీ గుర్తు మీద పోటీ చేసి గెలిచారు. అనంతరం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2016లో ఆయన గులాబీ పార్టీలో చేరారు. అప్పట్లో ఆయన చేరికను కెసిఆర్ రాజకీయ పునరేకి కరణ గా పేర్కొన్నారు.ఇక 2023 లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన గాంధీ? ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఈయనకు ప్రజాప్రతిల కమిటీ చైర్మన్ పదవి ఇచ్చింది. అతడికి ఆ పదవిని ఇవ్వడాన్ని భారత రాష్ట్ర సమితి తప్పు పట్టింది. ఆ తర్వాత గులాబీ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, గాంధీ మధ్య మాటల యుద్ధం సాగింది. ఒకానొక దశలో ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు పరస్పరం దాడులకు పాల్పడతాం అన్నట్టుగా సంకేతాలు కూడా ఇచ్చారు. ఇరువురికి చెందిన అనుచరులు రచ్చ రచ్చ చేశారు. అప్పట్లో ఈ రెండు వర్గాల మధ్య జరిగిన సంఘటనలు హైదరాబాద్ లో సంచలనం సృష్టించాయి.కాంగ్రెస్ పార్టీకి గాంధీ దగ్గర కావడం వెనుక చాలా కారణాలు ఉన్నాయని అప్పట్లో భారత రాష్ట్ర సమితి ఆరోపించింది. ఇప్పుడిక సరికొత్త విషయాన్ని బయటపెట్టింది. గులాబీ పార్టీ నేత లక్ష్మారెడ్డి కీలక ఆధారాలను సేకరించి ఏకంగా రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానంలో ఫిర్యాదు చేశారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో సర్వేనెంబర్ 307 లోని 100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని గాంధీకి అక్రమంగా బదిలీ చేశారని లక్ష్మారెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే నెంబర్ 307 లో సీలింగ్ కింద ప్రభుత్వ భూమి ఉంది. మిగిలిన ప్రైవేట్ భూమిలో ఇప్పటికే కొంతమంది పూర్తిగా ఇండ్లు నిర్మించుకున్నారు.అక్కడ ఎటువంటి ప్రవేట్ భూమి లేదని.. అయితే తమ పేరు మీద ఉన్న 11 ఎకరాలు ఎప్పుడో అమ్మేసి వెళ్లిపోయిన జాహేద్ బేగం, షేక్ ఇమామ్, ఇషాన్ ఆమీన్ అనే వ్యక్తులను తీసుకొచ్చి.. వారి భూమిని గాంధీ కొన్నట్టుగా చూస్తూ మోసానికి తెర లేపారని లక్ష్మారెడ్డి ఆరోపించారు. వాస్తవానికి ఆ ముగ్గురి వద్ద ఎటువంటి భూమి లేదని.. అక్రమంగా రిజిస్ట్రేషన్ లు చేయించి 11 ఎకరాల భూమిని స్వాహా చేయడానికి పథకం రూపొందించారని లక్ష్మారెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ 11 ఎకరాల భూమి ప్రభుత్వానికి సంబంధించిందని.. ఇందులో అక్రమంగా చేర్చిన వారి పేర్లను తొలగించాలని.. ఆర్డిఓ సర్టిపై చేసిన నాలా ప్రొసీడింగ్స్ రద్దు చేయాలని.. ఆ స్థలంలో బహుళ అంతస్తుల నిర్మాణానికి చేపడుతున్న ప్రణాళికలను అడ్డుకోవాలని ఆయన కోరారు.. లక్ష్మారెడ్డి హైకోర్టులో వేసిన పిటిషన్ లో ఎమ్మెల్యే గాంధీ, ఆయన భార్య శ్యామల దేవి, కుమార్తె నందిత, ఏడుగురు ప్రవేట్ వ్యక్తులు, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్, ఆర్డీవో, కుత్బుల్లాపూర్ తహసీల్దార్ ను ప్రతివాదులుగా పేర్కొన్నారు.ఈ కేసును విచారించిన ధర్మాసనం భూ బదిలీపై కుత్బుల్లాపూర్ ఎమ్మార్వోకు ఫిర్యాదు చేయాలని.. ఒకవేళ ఆయన గనుక స్పందించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని పేర్కొంది. ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసే విషయమైతే.. తమ పిటిషన్ వెనక్కి తీసుకుంటామని.. లక్ష్మణ్ రెడ్డి తరఫున న్యాయవాది పేర్కొన్నారు. దానికి న్యాయవాది అనుమతులు జారీ చేస్తూ.. ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో లక్ష్మారెడ్డి కోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నారు. ఒకవేళ అదే జరిగితే ఈ భూ వ్యవహారం రాష్ట్రంలో సంచలనంగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది.

## పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా మేధావులు సదస్సు



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు లో జిల్లా బీజేపీ అధ్యక్షులు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన మేధావుల సమావేశం లో పాల్గొని బి జె పి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, ముఖ్య వక్తగా రాష్ట్ర విస్తారక్ ఇంచార్జి ఉన్ని కృష్ణన్, రిటైర్డ్ డీఎస్పీ డి.రమావర్మ, రిటైర్డ్ ఎంఈవో జొన్నలగడ్డ గోపాల కృష్ణ, మేధావులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తపేట పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్ పి రాహుల్ మీనా



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట పోలీసు స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాహుల్ మీనా ఐపీఎస్, క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ పోలీస్ స్టేషన్ ను సందర్శిస్తూ సిబ్బందికి సూచనలు జారి చేస్తున్న జిల్లా ఎస్పి. శాంతి భద్రతల విషయంలో రాజీపడేది లేదని, సిబ్బంది అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని, ముందస్తు సమాచారాన్ని సేకరించి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశాలు జారీచేయడమైనది.

## యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మరొద్దు...
**రూరల్ ఎస్సై కిషోర్...**



**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** మత్తు పదార్థాలకు బానిసలుగా మరొద్దనీ మండపేట రూరల్ ఎస్ ఐ వి కిషోర్ అన్నారు.ద్వారపూడి గ్రామంలో జన జాగృతి రథం ద్వారా పోలీసుల విస్తృత ప్రచారం నిర్వహించారు. డాక్టర్ బి అర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా యస్ పి రాహుల్ మీనా ఆదేశాలతో రాష్ట్రంలో జిల్లాలోనే ప్రప్రధమంగా ప్రత్యేక వాహనం ద్వారా చైతన్య పరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.మండపేట రూరల్ పరిధిలో ద్వారపూడి బస్టాండ్ వద్ద ఈ కార్యక్రమం గురువారం నిర్వహించారు.మత్తు పదార్థాలకు బానిసలవకుండా ఉండాలని మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని అన్నారు. సైబర్ నేరాల ఫోక్సో యాక్ట్ దొంగతనాలు లాంటి 18 అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తూ మండపేట రూరల్ పోలీసులు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వి.కిషోర్ సిబ్బంది డి శ్రీనివాస్, ఎన్ నారాయణమూర్తి, లక్ష్మణరావు ,బాలకృష్ణ లు ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

## రావులపాలెంలో స్వచ్ఛత హీ సేవా ర్యాలీ




**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం** పల్లెలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం రూపొందించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం రావులపాలెం గ్రామపంచాయతీ పరిధిలో ర్యాలీ నిర్వహించారు.పరిసర పరిశుభ్రంగా ఉంచాలని, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని, అలాగే ప్లాస్టిక్ వస్తువులు నిషేధించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా రోడ్లు పక్కన చెత్త తొలగింపు పనులు చేపట్టారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీడీవో సిహెచ్ సుబ్రహ్మణ్యం, డిఎల్డీవో రాజేశ్వరరావు లు మాట్లాడుతూ సెప్టెంబరు 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వభావ్ స్వచ్ఛత,సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీల పరిధిలో ప్రభుత్వం రోజువారీ కార్యక్రమాలు రూపొందించిందన్నారు. అందులో భాగంగానే ఈ ర్యాలీ, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.గ్రామపంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గుత్తుల పట్టాభి రామయ్య, కొవ్వూరు వెంకట కృష్ణారెడ్డి, కోట వెంకటేశ్వరరావు, మద్దింశెట్టి శ్రీనివాసరావు, మంచిగడ్డ కృష్ణ,జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరెడ్డి, మణికంఠ,సచివాలయ కార్యదర్శులు సురేష్, రామకృష్ణ, కిరణ్ కుమార్,పద్మ లతో పాటు పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పార్టీ పటిష్టతకు... ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

## - మీడియాతో రాజమండ్రి సిటీ టీడీపీ కొత్త అధ్యక్షుడు మజ్జి రాంబాబు

**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** రాజమండ్రి నగరంలోని 42 వార్డులో తమ పార్టీని మరింత బలోపేతం చేసి రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో అత్యధిక వార్డులు టీడీపీ గెలిచేందుకు కృషి చేస్తామని టీడీపీ నగర నూతన అధ్యక్షుడుగా నియమితులైన మజ్జి రాంబాబు చెప్పారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) మరింత భారీ మెజారిటీ సాధించేలా చేసి 2024 ఎన్నికల్లో సాధించిన మెజారిటీని ఆయనే అధిగ మించేలా చేస్తామని రాంబాబు చెప్పారు. నగర టీడీపీ నూతన కమిటీతో కలిసి రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో మజ్జి రాంబాబు మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్న సమయం లోను, పార్టీ కష్టకాలంలోను టీడీపీ బలోపేతానికి అంకిత భావంతో,చిత్తశుద్ధితో పని చేసిన వారందరికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నగర కమిటీలో చోటు కల్పించారని కృతజ్ఞతలు తెలిపారు. సీనియారిటీతో పాటు, పార్టీకి విధేయతతో పనిచేసిన వారందరికీ నగర టీడీపీలో అవకాశం కల్పించారని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు రికార్డు స్థాయిలో ఎండోమెంటు కమిటీలు వేశారని, అలాగే నగర పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీని నియమించారని, అర్బన్ హెల్త్ సెంటర్లకు కమిటీలు వేశారని, అన్నింట్లోను సామాజిక సమతుల్యం




పాటించారని మజ్జి రాంబాబు కొనియాడారు. తమ కమిటీ సభ్యులు నగరంలోని 42 వార్డుల ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి ప్రభుత్వపరంగా అన్ని సంక్షేమ పథకాలు, వివిధ ధృవ పత్రాలు అందేలా చేస్తామని రాంబాబు చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు సంపూర్ణంగా అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా టీడీపీ ఎప్పుడూ ప్రజాపక్షమేనని మజ్జి రాంబాబు చెప్పారు. వైసీపీ నాయకుల మాదిరి తాము ప్రచార అర్భాటంతో చేయలేనివి కూడా చేసినట్లు చెప్పుకోబోమని ఆయన అన్నారు.

రాష్ట్ర విద్య ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్ పై ఎస్పీకి ఈరోజు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. వైసీపీ ఎమ్మెల్సీ కల్యాణితో లోకేష్ మర్యాదగా మాట్లాడినప్పటికీ వాటిని ఆ వీడియోను ముక్కలు ముక్కలుగా ఎడిట్ చేసి యువమంత్రి లోకేష్ తప్పుగా మాట్లాడినట్లు ప్రజల్లో అపోహలు కల్పించేలా మాజీ ఎంపీ మార్గాని భరత్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మజ్జి రాంబాబు మండిపడ్డారు. టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు రాజపల్లి ప్రసాద్ ద్వారా భరత్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు మజ్జి రాంబాబు తెలిపారు. నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా మాట్లాడుతూ నగరంలో టీడీపీ పటిష్టతకు కృషి చేస్తామని, కార్పొరేషన్ ఎన్నికల్లో నాలుగో సారి కూడా టీడీపీ విజయం తథ్యమని ఆయన చెప్పారు. మీడియా సమావేశంలో లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచపల్లి ప్రసాద్, నగర కమిటీ ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకి రామయ్య, కార్యనిర్వాహక కార్యదర్శులు కంటిపూడి శ్రీనివాస్, కరగాని వేణు, మొకమాటి సత్య నారాయణ,కార్యదర్శులు కడలి రామకృష్ణ,ద్వారా పార్వతి సుందరి, మహ్మద్ అస్లం, కోశాధికారి శెట్టి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అయోధ్య రామమందిరం

### ఘనంగా రాయల్ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

### రాజమండ్రిలో ప్రత్యేక ఆకర్షణగా అయోధ్య రామమందిరం నమూనా





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాయల్ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను స్థానిక ఎన్‌హెచ్ 16 లక్ష్మి హుండాయ్ వెనుక ప్రజారాజ్యం గ్రౌండ్స్‌లో గురువారం సాయంత్రం రాజమహేంద్రవరం నగర శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు) ప్రారంభించారు. సందర్శకులను ఆకట్టుకునే విధంగా రాయల్ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఎగ్జిబిషన్ మెయిన్ గేట్ వద్ద బాహుబలి సెట్‌ను ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అయోధ్య రామమందిరాన్ని తలపించే విధంగా ఏర్పాటుచేసిన నమూనా మందిరం విశేషంగా ఆకట్టుకుం టుంది. ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఏడాది రాయల్ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ నిర్వాహకులు సందర్శకులను ఆకట్టుకునే విధంగా ఏదో ఒక కొత్తదనాన్ని తీసుకువస్తున్నారని అభినం దించారు. గత ఏడాది జలకన్యలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారని, ఈ ఏడాది ఆయోధ్య రామమందిరాన్ని మరిపించేలా అద్భుత రీతిలో నమూనా దేవాలయాన్ని ఏర్పాటు చేశా రన్నారు. దీంతో పాటు అద్భుతమైన ఎమ్యూజ్‌మెంట్ ఐటమ్స్‌ను ఏర్పాటుచేయడం జరిగింద న్నారు. కుటుంబ సమేతంగా కొంత సమయం సంతోషంగా గడపడానికి అవసరమైన సౌకర్యాలు ఇక్కడ కల్పించడం జరిగిందన్నారు. నిర్వాహకులు ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, గురుగోపినాథ్‌లను అభినందించారు. గత పాలకులు ఎగ్జిబిషన్ నిర్వాహకులను వేధించారని, తమ కూటమి ప్రభుత్వంలో అన్ని విధాల సహకరిస్తున్నామన్నారు. ఇటువంటి నిర్వాహకులను ప్రోత్సహిస్తే ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యాళ్ళ ప్రదీప్, విశ్వనాధరాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగువాని వాణి ప్రపంచానికి చాటిన మహోన్నతుడు "బాలు"

### - 6వ వర్ధంతి సభలో పలువురు ప్రముఖులు నివాళులు..



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** గానగంధర్వులు, పద్మ విభూషణ్ శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం ఆరో వర్ధంతి జలవనరుల శాఖ కార్యాలయం సమీపాన గల బాలు విగ్రహం వద్ద, "రాకా" కల్చరల్ అసోసియేషన్, "గోదావరి"కల్చరల్ అసోసియేషన్ ఆద్వర్యంలో ఘనంగా జరిగింది, రాకా కార్యదర్శి జీ. వి రమణ బాలు జీవితం ఎందరికో స్ఫూర్తి దాయకమన్నారు,గోదావరి కల్చరల్ అసోసియేషన్ కార్యాధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు మాట్లాడుతూ పాడుతాతీయగా వంటి ఈటీవీ కార్యక్రమం ద్వారా ఆయన ఎందరికో మార్గదర్శిగా నిలిచారన్నా రు, జల వనరుల శాఖ పూర్వ పర్యవేక్షక ఇంజనీర్ జి.శ్రీనివాసరావు గాయకునిగా ఎవరెస్టు శిఖరాన్ని మించిన ఉన్నత స్థాయికి చేరినా ఎంలాటి బేషిజం లేకుండా అందరితో ఆప్యాయంగా ఉండడం బాలుకే చెల్లిందన్నారు, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మదర్షాఅలి మాట్లాడుతూ భారతీయ భాషల్లో నలభై వేల పాటలు ఆలపించిన ఏకైక గాయకునిగా చరిత్ర సృష్టించారన్నారు, భమిడిపాటి రామక్రిష్ణ మూర్తి, సూరపరెడ్డి తాతారావు, దేశిరెడ్డి బలరామ నాయుడు, బొబ్బిలి శ్రీనివాస రావు, కె. ఎన్ గౌరీశంకర్ బాలు విశిష్టత సినీ ప్రపంచానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముడెడ్ల రమేష్,లయన్ పుసులూరి శేషు కుమార్,ఏ. లక్ష్మణరావు, సీనియర్ జర్నలిస్ట్ రాఘవరావు, ఆదుర్తి విశ్వమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల పట్ల నేటితరం ఆసక్తితో ఉండాలి





### ఘనంగా జాతీయ సీనియర్ బ్యాట్మెంటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ ను ప్రారంభం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాష్ట్రంలో సాంస్కృతిక రాజధానిగా విలసిల్లుతున్న రాజమహేంద్రవరం నగరాన్ని స్పోర్ట్స్ హబ్ గా (క్రీడల కేంద్రం) తీర్చి దిద్దడానికి కృషి జరుగుతుం దని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు అన్నారు. జాతీయ బ్యాట్మెంటన్ అసోసియేషన్, ఆం ధ్రప్రదేశ్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ , తూర్పుగోదావరి జిల్లా బ్యాట్మెంటన్ అసోసియేషన్,యోనిక్స్ సన్రైజ్ సం యుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో గురువా రం జాతీయ సీనియర్ బ్యాట్మెంటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ 2025 పోటీలు ఘనంగా ప్రారంభమ య్యాయి. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ , ఏపీ బీఏ అధ్యక్షులు అంకం చౌదరీలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ దక్షిణ భారత బ్యాడ్మింటన్ పోటీలను 2018లో ఘనంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో జాతీయస్థాయిలో బ్యాట్మెంటన్ ర్యాంకింగ్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కూటమీ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, మండల,జిల్లా,రాష్ట్ర స్థాయిల్లో మౌలిక వసతులను కల్పిస్తుందని అన్నారు. ఈ బ్యాట్మెంటన్ టోర్నమెంట్ పోటీల్లో దేశ వ్యాప్తంగా సీనియర్ ర్యాంకింగ్ క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. నగరంలో క్రీడా మైదానాలను,మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో బ్యాడ్మింటన్ పోటీలకు రాజమహేంద్రవరం నగరం వేదిక కావడం శుభ పరిణామం అన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని జాతీయస్థాయి క్రీడా పోటీలు జరగాలని ఆకాంక్షించారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడల పట్ల నేటితరం ఆసక్తితో పాలు పంచుకోవాలని క్రీడల్లో గెలుపోవటములను స్ఫూర్తిగా తీసుకోవాలన్నా రు. తూర్పుగోదావరి జిల్లా బ్యాట్మెంటన్ అసోసియేషన్ నాయకుడు కొత్తపల్లి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ,బ్యాట్మెంటన్ ర్యాంకింగ్ పోటీల్లో దేశవ్యాప్తంగా మెన్, ఉమెన్స్ సింగిల్, డబల్, మిక్సడ్, క్యాటగిరిలో జరిగే పోటీల్లో 1300 మంది క్రీడాకారులు హాజరయ్యార ని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు , క్రీడా సంఘాల ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.


## మహిళల పరిపూర్ణ ఆరోగ్యానికి స్వస్త్ నారి- స్వశక్తి పరివార్ అభియాన్.

### -డాక్టర్ కృష్ణవేణి.



**కోరుకొండ విశ్వం వాయస్ న్యూస్:** మహిళల పరిపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం స్వస్త్ నారి- స్వశక్తి పరివార్ అభియాన్ కార్య క్రమాన్ని ప్రవేశపెట్టిందని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోటి కేశవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధి కారిణి కిల్లి కృష్ణవేణి తెలిపారు. గురువారం ఈ కార్యక్రమంలో భాగంగా కోటి గ్రామంలో సర్పంచ్ వెంటపాటి దుర్గారావు అధ్యక్షతన స్వస్త్ నారి, స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళల పరిపూర్ణ ఆరోగ్యానికి వివిధ పరీక్షలు నిర్వహించామని, గ్రామాలలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన పప్పు దినుసులు, ఆకుకూరలు, పండ్లు వంటి వాటిపై అవగాహన కల్పించామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ దుర్గారావు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యవంతంగా ఉంటుందని, తద్వారా గ్రామం, రాష్ట్రం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఉచిత పరీక్షలతో పాటు ఉచిత మందులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటి కేశవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎం, అంగన్వాడి, ఆశ తదితరులు పాల్గొన్నారు.

## కాత్యాయని మాతను దర్శించుకున్న బత్తుల.



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోవ రోజు అమ్మవారిని కాత్యాయని మాతగా అలంకరించి వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్స వాలలో భాగంగా అమ్మవారిని కాత్యాయని మాతగా అలంకరించి, భక్తులకు దర్శనమిచ్చారు. రాజానగరం నియోజవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ కాత్యాయని మాతను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు అత్యంత భక్తి శ్రద్ధలతో శరనవరాత్రులలో భాగంగా దుర్గామాతను తొమ్మిదిరోజుల పాటు తొమ్మిది అలంకారాలతో పూజించి తరిస్తారన్నారు. ఇక భవాని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో దీక్ష చేపట్టి,ఎంతో నియమనిష్టలతో దీక్ష పూర్తి చేసి అమ్మవారిని దర్శిస్తారన్నారు. అనంతరం ఆలయ వేదపండితులు బత్తులకు వేద ఆశీర్వచనాలు అందజేసి, ఘనంగా సత్కరించి, అమ్మవారి జ్ఞాపిక అందజేశారు.

## కోరుకొండలో "స్వచ్ఛతా హి సేవా"బికర్రి.





**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమములో ప్రతి ఒక్కరు పాల్గొని ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ గణేష్ అన్నారు. గురువారం ఆజాద్ కా అమృత మహోత్సవ కార్యక్రమాల భాగంగా ప్రతి గ్రామంలో శ్రమదానం,మొక్కల పెంపకం డ్రైవ్‌ను నిర్వహించాలని " ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్"అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సెక్రటరీ రమేష్ బాబు తెలిపారు. అనంతరం కర్రి లక్ష్మిసరోజ గణేష్ మాట్లాడుతూ సఫాయి మిత్రలు, పారిశుధ్య కార్మికులకు ఈ సందర్భంగా పారిశుధ్య కిట్లను తమ చేతుల మీదుగా పంపిణీ చేసామన్నారు. పరిశుభ్రత పద్ధతులను అవలంబించడం, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయ ప్రాంగణంలోను శ్రమదానం చేపట్టాలన్నారు. వ్యాపారులకు పారిశుధ్యం పై అవగాహన కల్పించడానికి ఉద్యోగులు శ్రద్ధ కనబరచాలన్నారు. ప్రభుత్వకార్యాలయాల పరిశుభ్రత లక్ష్య యూనిట్లను గుర్తించి వాటిని శుభ్రపరచడం, వ్యర్థాలు,చెత్త వస్తువులను అందమైన కళారూపాలు, శిల్పాలుగా మారుస్తారన్నారు. వీటిని బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజా గణేష్, బిజెపి జిల్లా కార్యదర్శి రజనీ, పచ్చారి నరసింహమూర్తి, గ్రామ కార్యదర్శి కె రమేష్ బాబు,సచివాలయం సిబ్బంది,అంగన్వాడీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఛాంబర్ ట్రస్టీ నూతన సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి

- వర్తకుల శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వ కృషి..
- వర్తకుల సమస్యలను రాజకీయ కోణంలో చూడకుండా పరిష్కరించాలి.
- చాంబర్ ఆఫ్ కామర్స్ ఎక్స్ అఫిషియో ఉపాధ్యక్షునిగా కనకాల రాజా
- నూతన సభ్యులకు సూచనలు చేసిన ఆదిరెడ్డి



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** వర్తకుల శ్రేయస్సుకోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసరరావు (వాసు) అన్నారు. జీఎస్టీ 2.0లో ప్రజలకు ఎంతమేలు చేకూరిందో చూస్తున్నామన్నారు. మందులు ధరలు తగ్గాయని, ఇన్స్యూరెన్స్ మీద జీఎస్టీ తీసేశారని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాయని ఎమ్మెల్యే వాసు అన్నారు. జీఎస్టీ సంస్కరణల వలన నెలవారీ ఖర్చులో ఎంత లాభం చేకూరిందో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్ ట్రస్ట్ నుండి ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ ఎక్స్ అఫిషియో ఉపాధ్యక్షునిగా కనకాల రాజా, నామినేటడ్ ట్రస్టీగా యక్కల వీర నాగేశ్వరరావు, డైరెక్టర్ గా ఎంజి మార్కెట్ అధ్యక్షుడు కాలెపు వెంకట వీరభద్రరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్న నేపథ్యంలో వారిని ఎమ్మెల్యే వాసు అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన ఈ ముగ్గురూ కూడా వ్యాపారస్తుల శ్రేయస్సు కోసం అనునిత్యం కృషిచేస్తూనే ఉన్నారని అన్నారు. ఎన్నుకోవడం అనేది రాజకీయ పార్టీ నుంచి జరిగినప్పటికీ భవిష్యత్తులో కూడా పార్టీలకతీతంగా వర్తకుల శ్రేయస్సుకోసం పనిచేయాలని, వర్తకులు సమస్యతో వస్తే రాజకీయ కోణంతో చూడకుండా వారి శ్రేయస్సుకోసం కృషి చేయాలనీ అన్నారు. ఎమ్మెల్యే వాసు సూచించారు. ది చాంబర్ ఆఫ్ కామర్స్ బల్డింగ్ ట్రస్ట్ లైఫ్ ట్రస్టీల సమావేశం చాంబర్ అధ్యక్షులు తవ్వా సూర్యనారాయణమూర్తి (రాజా),చాంబర్ గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ లతో కూడిన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్పటికే ట్రస్ట్ బోర్డు ఎన్నిక ఆలస్యం అయిందని ఆయన గుర్తుచేసారు. మొత్తానికి నిన్న కొలిక్కి వచ్చి ప్యానల్ సభ్యులను కూడా ఎన్నుకోవడం అభినందనీయమని అన్నారు. ఛాంబర్ అధ్యక్ష కార్యదర్శులకు, అలాగే చాంబర్ మాజీ అధ్యక్షులు దొండపాటి సత్యంబాబు, జనసేన సిటీ అధ్యక్షుడు వై శ్రీనివాస్, నగర టీడీపీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు, తెలుగు దేశం కుటుంబ సభ్యులకు పేరు పేరునా ఎమ్మెల్యే వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు నమస్కారాలు తెలియజేసారు. ఛాంబర్ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర-తెలంగాణాలో వున్నది తెలుగు నటులేనా..!

### - మేడా శ్రీనివాస్,సామజిక విశ్లేషణ..



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** నేటి ఆంధ్రప్రదేశ్ తెలంగాణా లో ఎక్కువగా కమెడీయన్స్ హీరోలుగా రాణిస్తుంటారు . నటనలేని వాళ్ళను రూపం లేని వాళ్ళను ఎక్కువగా కార్పొరేట్ మీడియా సృష్టితో సినిమా హీరోలుగా ప్రాచుర్యం పొందుతున్నారు. సినిమా కథ మీద ,హీరో మీద నమ్మకం లేక అధిక ధరలతో తొలి రోజులోనే సొమ్ములు చేసుకునే విధంగా బ్లాక్ లో టిక్కెట్లు అమ్ముకోవటానికి ప్రభుత్వం జీ.ఓ లు ఇచ్చి సహకరించటం దారుణం . అమ్మా భగవాన్ భక్తులు మాదిరి అభిమానులను ఒక రకమైన మత్తుకు బానిసలుగా మార్చటం . తద్వారా ఆర్థిక దోపిడీకి మార్గం చేసుకోవటం . రూపం లేనివాళ్లు నటన తెలియని వాళ్ళు ఆంధ్రప్రదేశ్ తెలంగాణా సినీమా పరిశ్రమలో బలవంతంగా రాణిస్తున్నారు. అదునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తదుపరి వికలాంగులు సైతం ఆంధ్రప్రదేశ్ లో హీరోలుగా చలామణి అవుతున్నారు . ఆంధ్రప్రదేశ్ తెలంగాణా సిని పరిశ్రమ ప్రతిష్టను కొంత మంది బలవంతపు డప్పు హీరోలు ఆపకీర్తికి గురిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణా సినిమా పరిశ్రమలో అగ్రగులుగా ప్రచారంలో వున్న వారిలో ఒక 8 మందిని మినహాయిస్తే అనేకులు జీరోలు,కాని వారేనే హీరోలు అంటున్నారు. ఈ సంస్కృతి ఆంధ్రప్రదేశ్ తెలంగాణా రాష్ట్రాలకు శాపంగా మారింది . గత 10ఏళ్లు లో ప్రభుత్వం ప్రకటించిన అవార్డులో చాలావరకు దొడ్డి దారిలో ప్రకటించుకున్నవే,అసలైన అర్హులు మోనంతో , నిరాశతో నటులుగా ముందుకు సాగుతున్నారు.

## బొబ్బిల్లంకలోస్వస్థ నారి సశక్త పరివార్ అభియాన్



సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్: తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామంలో స్వస్థ నారి సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమములో భాగంగా మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది . ఈ సందర్భంగా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ఇ.ఏసు రాణి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని తద్వారా సమాజమంతా ఆరోగ్యవంతంగా ఉంటుందని కావున స్త్రీ ఆరోగ్యానికి అందరూ తోడ్పాటు అందించాలని చెప్పారు. తదనంతరం స్త్రీ ఆరోగ్యంగా ఉండడం గురించి వారి అభివృద్ధి గురించి కట్టుబడి ఉంటామని గ్రామ నాయకులు, వైద్యఆరోగ్య సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ శిబిరంలో 126 మంది మహిళలు వైద్య సేవలు పొందారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెల్లిమి రామచందర్రావు, గొర్తి చిన్ని,ఎంపీటీసీ పోలిన కృష్ణ, పెండ్యాల అవిస్వామి, పెండ్యాల మోహన్ బాబు, కొత్తపల్లి వీర్రాజు , ఏలేటి బాబురావు వైద్య ఆరోగ్య సిబ్బంది, ఐ సి డి ఎస్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

# జీఎస్టీ సంస్కరణలు ఆగవు

గ్రేటర్ నోయిడా/న్యూఢిల్లీ

వస్తు సేవల పన్ను(జీఎస్టీ)లో సంస్కరణలు ఇకపైనా కొనసాగుతాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ప్రజలపై పన్నుల భారం మరింత తగ్గుతుందని, దేశ ఆర్థిక వ్యవస్థ బలం పుంజుకుంటుందని అన్నారు. జీఎస్టీలో నిర్మాణాత్మక సంస్కరణలు దేశ ఆర్థిక రంగానికి కొత్త రెక్కలు తొడుగుతున్నాయని వ్యాఖ్యానించారు. సంస్కరణల విషయంలో బలమైన సంకల్ప శక్తి మనకు ఉందని ఉద్ఘాటించారు. దేశంలో ప్రజాస్వామ్య, రాజకీయ స్థిరత్వం కొనసాగుతుండడం సానుకూల అంశాలని వివరించారు. గురువారం ఉత్తరప్రదేశ్‌లో ఇంటర్నేషనల్ ట్రేడ్ షో%–%2025ను మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ ప్రభుత్వం పన్నుల భారాన్ని క్రమంగా తగ్గిస్తోందని, ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తోందని అన్నారు. జీఓస్టీలో ఇటీవలే కొత్త సంస్కరణలు తీసుకొచ్చామని, దీనివల్ల దేశ ప్రజలకు ఈ ఏడాది రూ.రెండున్నర లక్షల కోట్ల మేర లబ్ధి చేకూరుతుందని వివరించారు. నేడు దేశమంతా 'జీఎస్టీ ఆదా ఉత్సవాన్ని' గర్వంగా నిర్వహించుకుంటోందని వ్యాఖ్యానించారు. ఇది ఇక్కడితో ఆగదని, ప్రజల ఆశీస్సులతో జీఎస్టీలో మరిన్ని సంస్కరణలు తీసుకొస్తామని తేల్చిచెప్పారు. ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారంటే...

**అవరోధాలే మనకు కొత్త దారులు**

"గత ప్రభుత్వాలు పాలనలో విఫలమయ్యాయి. అప్పటి నిర్వాకాలను కప్పిపుచ్చుకోవడానికి మా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. కాంగ్రెస్ పాలనలో సామాన్య ప్రజలపై విపరీతంగా పన్నులు విధించారు. ట్యాక్స్ లూటీ జరిగింది. ప్రజలు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. 2047 నాటికి 'పూర్తిగా అభివృద్ధి చెందిన భారత్' మన లక్ష్యం. ఆ దిశగానే దేశం పరుగులు తీస్తోంది. అంతర్జాతీయంగా పలు సవాళ్లు, అవరోధాలు ఉన్నప్పటికీ మన దేశం ఆకర్షణీయమైన ప్రగతి సాధిస్తోంది. అవరోధాలు మనకు అడ్డంకి కాదు. అవే మనకు కొత్త దారులు చూపిస్తున్నాయి. రాబోయే దశాబ్దాల కోసం ఇప్పుడే బలమైన పునాది వేస్తున్నాం. మన సంకల్పం ఆత్మనిర్భర్ భారత్. మన అవసరాలు తీర్చుకోవడానికి ఇతరులపై ఆధారపడడం కంటే నిస్సహాయత ఇంకేమైనా ఉంటుందా? రోజురోజుకీ మారుతున్న నేటి ప్రపంచంలో ఇతర దేశాలపై ఆధారపడితే అభివృద్ధి విషయంలో మనం రాజీపడాల్సి వస్తుంది. అందుకే మనం స్వయం సమృద్ధి సాధించాలి. మనం వాడుకొనే ప్రతి వస్తువూ ఇక్కడే తయారు కావాలి. మేడ్ ఇన్ ఇండియా సరుకులే మనం కొనుగోలు చేయాలి.

**రష్యాతో స్నేహబంధం బలోపేతం**

రష్యాతో మన స్నేహబంధం కాలపరీక్షకు నిలిచింది. రెండు దేశాల మధ్య రక్షణ సహకారం అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది. ఈసారి ఇంటర్నేషనల్ ట్రేడ్ షోలో రష్యా సైతం భాగస్వామి. ఈ కార్యక్రమం ద్వారా రష్యాతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటాం. రష్యా భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలో ఏకే%–%203 రైఫిళ్ల తయారీ త్వరలోనే ప్రారంభం కాబోతోంది. ఉత్తరప్రదేశ్‌లో డిఫెన్స్ కారిడార్‌ను అభివృద్ధి చేస్తున్నాం.

ఇక్కడ బ్రహ్మోస్ క్షిపణులు, ఆయుధ వ్యవస్థల తయారీ ఇప్పటికే ప్రారంభమైంది. దేశంలో స్వావలంబనను బలోపేతం చేసే విధానాలు రూపొందించాలని వ్యాపారులు, వాణిజ్యవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలను కోరుతున్నా. సైనిక దళాలకు అవసరమైన ఆయుధాలు, రక్షణ వ్యవస్థల కోసం విదేశాలపై ఆధారపడడం తగ్గించుకోవాలి. మనకు కావాల్సినవి మన దేశంలోనే తయారు చేసుకుందాం. సైన్యం వాడుకొనే వస్తువులు, ఆయుధాలపై మేడ్ ఇన్ ఇండియా ముద్ర ఉండాల్సిందే" అని ప్రధాని మోదీ వివరించారు.

**ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులు పెట్టండి**

భారత ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులు పెట్టాలని అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు మోదీ చెప్పారు. దేశంలో ఈ రంగంలో వ్యాపారాభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గత పదేళ్లుగా తమ ప్రభుత్వం ఆహార శుద్ధి రంగాన్ని ఎంతగానో ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. ఉత్పత్తి అనుసంధాన పథకాలు ప్రవేశపెట్టామని, మెగా ఫుడ్ పార్కులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వీటివల్ల ఆహార శుద్ధి సామర్థ్యం 20 రెట్లు పెరిగిందని, ఎగుమతులు రెండు రెట్లు పెరిగాయని ఉద్ఘాటించారు. గురువారం ఢిల్లీలో 'వరల్డ్ ఫుడ్ ఇండియా' నాలుగో ఎడిషన్ కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. శుద్ధి చేసిన ఆహారాన్ని నిల్వ చేయడానికి పర్యావరణహిత బయో డిగ్రేడబుల్ ప్యాకేజింగ్ తయారీలో సైతం పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను కోరారు.

**విద్యుత్ ఉత్పత్తి అత్యవసరం**

విద్యుత్ ఉత్పత్తి ప్రాధాన్యతను గత కాంగ్రెస్ ప్రభుత్వాలు విస్మరించాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. 21వ శతాబ్దంలో ఏ దేశమైనా వేగంగా ప్రగతి సాధించాలంటే విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవడం అత్యవసరమని స్పష్టంచేశారు. గురువారం రాజస్తాన్‌లోని బనస్వర జిల్లాలో ఆయన పర్యటించారు. రూ.1.22 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో రూ.42,000 కోట్లతో నిర్మించనున్న అణు విద్యుత్ ప్రాజెక్టు కూడా ఉంది. ఈ సందర్భంగా బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు.

కాంగ్రెస్ పాలనలో విచ్చలవిడిగా విద్యుత్ ఉండేదని, గ్రామాల్లో కనీసం ఐదు గంటలు కూడా కరెంటు సరఫరా అయ్యేది కాదని చెప్పారు. తగినంత విద్యుత్ లేకపోవడంతో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. నేడు దేశవ్యాప్తంగా ప్రతి గ్రామానికీ విద్యుత్ సరఫరా అవుతోందని, ప్రజల జీవనం సులభతరంగా మారిందని అన్నారు. క్లీన్ ఎనర్జీలో ముందంజలో ఉన్న దేశాలు విజయవంతమైన దేశాలుగా కీర్తినందుకుంటాయని స్పష్టంచేశారు. బనస్వర జిల్లాలో 'పీఎం%–%కుసుమ్' పథకం లబ్ధిదారులతో ప్రధాని మోదీ సంభాషించారు. రైతుల అనుభవాలు అడిగి తెలుసుకున్నారు.

**నేడు బిహార్ పథకం ప్రారంభం**

బిహార్‌కు సంబంధించిన 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన'ను మోదీ శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద 75 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాల్లోకి రూ.10,000 చొప్పున బదిలీ చేస్తారు. మొత్తం రూ.7,500 కోట్లు విడుదల చేయబోతున్నారు. మహిళల సాధికారత, స్వావలంబనే లక్ష్యమని బిహార్ ప్రభుత్వం వెల్లడించింది.

# వందే భారత్ రైళ్లు వచ్చేస్తున్నాయ్!

భారతీయ రైల్వేశాఖ ప్రతిష్టాత్మకంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టింది. దేశవ్యాప్తంగా వివిధ మార్గాల్లో ఈ రైళ్లు దూసుకెళ్తున్నాయి. ప్రయాణికుల నుంచి సెమీ హైస్పీడ్ రైళ్లకు ఆదరణ లభిస్తున్నది. ఈ నేపథ్యంలో భారతీయ రైల్వేశాఖ సరికొత్తగా అంతర్జాతీయ సదుపాయాలతో వందే భారత్ స్లీపర్ వెర్షన్ రైళ్లను ప్రవేశపెట్టబోతున్నది. ఈ రైలు ట్రయల్ రన్‌ను సైతం వివిధ మార్గాల్లో విజయవంతంగా నిర్వహించింది. తాజాగా వందే భారత్ స్లీపర్ వెర్షన్‌పై కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక అప్‌డేట్ అందించారు. స్లీపర్ రైళ్ల కార్యకలాపాలు అక్టోబర్ 15 తర్వాత ప్రారంభమవుతాయని తెలిపారు. రెండు రేక్ డెలివరీల కోసం భారత రైల్వేలు నిరీక్షిస్తున్నాయని.. ఈ క్రమంలో ప్రారంభోత్సవంలో కాస్త ఆలస్యం జరుగుతోందన్నారు. ఒకేసారి రెండు స్లీపర్ రైళ్లను ప్రారంభించాలని భావిస్తున్నామన్నారు. అవి రోజువారీ సేవల కోసం ఉద్దేశించినవని.. రెండు రేక్‌లు సిద్ధంగా ఉండాలన్నారు. రెండో రైలు అక్టోబర్ 15 నాటికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అత్యాధునిక సదుపాయాలు, మెరుగైన భద్రత, ప్రయాణికులకు అనుకూలమైన సౌకర్యాలతో వందే భారత్ స్లీపర్ వెర్షన్‌ను రైల్వేశాఖ తీసుకువస్తున్నది. తొలి రైలు ఢిల్లీ–పాట్నా మధ్య రాకపోకలు సాగించనున్నది. ప్రస్తుతం రెండు ప్రాంతాల మధ్య ప్రయాణానికి 12నుంచి17 గంటల పడుతుందని.. స్లీపర్ వెర్షన్ అందుబాటులోకి వస్తే 11 గంటలకు తగ్గుతుందని భావిస్తున్నారు. ప్రోటోటైప్ వందే భారత్ స్లీపర్ రైలు 800 నుంచి 1200 కిలోమీటర్ల సుదూర ప్రాంతాలకు రాత్రిపూట ప్రయాణాల కోసం రైల్వేశాఖ తీర్చిదిద్దింది. ఇందులో 16 నుంచి 20 కోచ్‌లు ఉండనున్నాయి. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీతో పాటు రెండు జనరల్ ఫస్ట్ ఏసీ, సెకండ్, థర్డ్ కాకుండా, రెండు సీటింగ్ కం లగేజీ కోచ్‌లు సైతం ఉంటాయి. రైలులో దాదాపు 820 నుంచి 1200 మంది వరకు ప్రయాణం చేయొచ్చు. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తుంది. భద్రతతో పాటు, స్లీపర్ వెర్షన్‌లో యూఎస్‌బీ ఛార్జింగ్‌తో కూడిన ఇంటిగ్రేటెడ్ రీడింగ్ లైట్లు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్, విజువల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మాడ్యులర్ ప్యాంట్రీలు, దివ్యాంగ ప్రయాణికుల కోసం ప్రత్యేక బెర్త్‌లు, టాయిలెట్స్ తదితర ప్రపంచస్థాయి సౌకర్యాలు ఉండనున్నాయి. మొదటి ఏసీ కోచ్‌లో వేడినీటితో కూడిన షవర్లు సైతం ఉంటాయి. సుదీర్ఘ ప్రయాణాల్లో ప్రయాణీకుల సౌకర్యాన్ని మెరుగుపరుచనున్నాయి. మధ్యతరగతి కోసం ఉద్దేశించిన రైలని.. ఛార్జీలు రాజధాని ఎక్స్‌ప్రెస్‌తో సమానంగా ఉంటాయని గతంలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వందే భారత్ స్లీపర్ రైళ్లు సౌకర్యవంతమైన, సరసమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకుందని ఆయన వివరించారు. అయితే, వందే భారత్ స్లీపర్ రైలును దేశవ్యాప్తంగా వివిధ నగరాల మధ్య నడిపేందుకు రైల్వేలు ప్రయత్నాలు చేస్తున్నాయి. న్యూఢిల్లీ–సికింద్రాబాద్, న్యూఢిల్లీ–హౌరా, ఢిల్లీ–పుణే, ముంబయి–ఢిల్లీ నగరాలను కలుపుతూ రైలు నడుపనున్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా పట్నా–ఢిల్లీ మధ్య స్లీపర్ రైలును ప్రారంభించేందుకు కేంద్రం ఏర్పాట్లు చేసింది.







# తేజస్ మార్క్-2కు అమెరికా ఇంజిన్లు లేనట్లేనా?

**ఇంటర్నెట్‌డెస్క్:** భారత్ దేశీయంగా అభివృద్ధి చేసిన ఫైటర్ జెట్ తేజస్ మార్క్–2కు అమెరికా తయారీ జీఈ ఎఫ్–414 ఇంజిన్లను అమర్చకపోవచ్చన్న ప్రచారం జోరందుకొంది. అగ్రరాజ్యం నుంచి సరఫరాలు మందగించిన నేపథ్యంలో ఫ్రాన్స్‌కు చెందిన శాఫ్రాన్ ఎస్ఏతో కలిసి భారత్‌లో ఇంజిన్‌ను అభివృద్ధి చేయడంపై చర్చలు జోరందుకొన్నట్లు బ్లూమ్‌బెర్గ్ కథనంలో పేర్కొంది. అయితే భారత్ ఆ కంపెనీ నుంచి ఇంజిన్లను నేరుగా కొనుగోలు చేస్తుందా..? లేదా సంయుక్తంగా అభివృద్ధి చేస్తుందా అనే దానిపై స్పష్టత రాలేదని భారత్‌కు చెందిన అధికారులు వెల్లడించినట్లు సదరు పత్రిక పేర్కొంది. భారత్‌కు చెందిన తేలికపాటి యుద్ధవిమానం తేజస్‌కు ఆధునిక వెర్షన్ మార్క్–2. వాస్తవానికి ఫైటర్ జెట్‌కు ఇంజిన్ కోసం బైడెన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం జరిగింది. దీని ప్రకారం జీఈ–414 రకం ఇంజిన్లను భారత్‌లోనే సంయుక్తంగా తయారు చేసేలా సంతకాలు జరిగాయి. కానీ, ఇటీవల ఇరు దేశాల మధ్య అభిప్రాయ భేదాలు తీవ్రం అయ్యాయి. దీంతో ఇంజిన్ల తయారీపై చర్చలు మందగించాయి. వాయుసేనలో రిటైర్మెంట్‌కు దగ్గరపడిన జాగ్వర్, మిరాజ్–2000 ఫైటర్‌జెట్లను 200 తేజస్‌లతో భర్తీ చేయాలన్నది ప్రణాళిక. పాక్‌తో సైనిక ఘర్షణ తర్వాత వేగంగా తన రక్షణ సామర్థ్యాలను పెంచుకోవడంపై భారత్ కసరత్తు చేస్తోంది. బ్లూమ్‌బెర్గ్ కథనంపై భారత రక్షణ శాఖ స్పందించలేదు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై ట్రంప్ సర్కారు 25శాతం అదనపు టారిఫ్‌లను విధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత చాబహార్ పోర్టుకు ఇచ్చిన మినహాయింపులను తొలగించింది. హెచ్–1బీ వీసాల ఫీజును పెంచింది. తాజాగా విమాన ఇంజిన్ల డీల్‌పై నీలి నీడలు కమ్ముకొన్నాయి.



## రైలు నుంచి అగ్ని వర్షం

న్యూఢిల్లీ

రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) అరుదైన ఘనత సాధించింది. ఇంటర్మీడియెట్ రేంజ్ అగ్ని–ప్రైమ్ క్షిపణిని రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుంచి విజయవంతంగా పరీక్షించింది. బుధవారం జరిగిన ఈ పరీక్షలో స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్(ఎస్ఎఫ్‌సీ) సైతం పాలుపంచుకుంది. అయితే, ఈ పరీక్ష ఎక్కడ చేపట్టారన్నది రక్షణ శాఖ బహిర్గతం చేయలేదు. స్థిరమైన ప్రదేశం నుంచి కాకుండా పట్టాలపై పరుగులు తీస్తున్న రైలు నుంచి మిస్సైల్‌ను పరీక్షించడం భారత క్షిపణి తయారీ రంగంలో ఒక కీలకమైన మైలురాయిగా భావిస్తున్నారు. క్షిపణులను దేశంలో ఎక్కడికైనా రైలులో సులభంగా తరలించే సామర్థ్యాన్ని భారత్ సాధించడం గమనార్హం. తదుపరి తరం అగ్ని–ప్రైమ్ మిస్సైల్ పరిధి 2,000 కిలోమీటర్లు. ఈ పరీక్ష విజయవంతం కావడం పట్ల రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తంచేశారు. రైలు నెట్‌వర్క్ నుంచి ఆయుధ వ్యవస్థను ప్రయోగించే సామర్థ్యం కలిగిన అతికొద్ది దేశాల జాబితాలో భారత్ సైతం సగర్వంగా చేరిందని పేర్కొన్నారు.

ప్రత్యేకంగా డిజైన్ చేసిన రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుంచి అగ్ని%–%ప్రైమ్‌ను సక్సెస్‌ఫుల్‌గా పరీక్షించినట్లు స్పష్టంచేశారు. అతి తక్కువ సమయంలోనే మిస్సైల్‌ను ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించి, ప్రయోగించే సత్తా మన సొంతమని ఉద్ఘాటించారు. ఈ మేరకు రాజ్‌నాథ్ సింగ్ గురువారం 'ఎక్స్'లో పోస్టుచేశారు.

**అత్యాధునిక క్షిపణి**

అగ్ని–ప్రైమ్ క్షిపణి అత్యాధునికమైనదని రక్షణ శాఖ వెల్లడించింది. అగ్ని బాలిస్టిక్ క్షిపణుల శ్రేణిలో దీన్ని అభివృద్ధి చేశారు. ఇందులో నూతన తరం కమ్యూనికేషన్ వ్యవస్థలు, రక్షణ యంత్రాంగం ఉన్నట్లు పేర్కొంది. గ్రౌండ్ స్టేషన్ నుంచి క్షిపణిని నియంత్రించవచ్చని స్పష్టంచేసింది. భవిష్యత్తులో రక్షణ దళాల్లో రైలు ఆధారిత ఆయుధ వ్యవస్థలు, క్షిపణులను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలియజేసింది. అగ్ని–ప్రైమ్ క్షిపణి పరీక్ష కార్యక్రమంలో డీఆర్‌డీఓ, ఎస్ఎఫ్‌సీ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. 'రోడ్ మొబైల్ వేరియెంట్' అగ్ని%–%ప్రైమ్ క్షిపణులను ఇప్పటికే రక్షణ దళాల్లో ప్రవేశపెట్టారు. పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారత్–పాకిస్తాన్ మధ్య ఘర్షణ జరిగిన తర్వాత నాలుగున్నర నెలల్లోగా రైలు ఆధారిత మొబైల్ లాంచర్‌తో మిస్సైల్‌ను విజయవంతంగా పరీక్షించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**గేమ్ చేంజర్**

అగ్ని–ప్రైమ్ పరీక్ష కోసం రైలును ప్రత్యేకంగా రూపొందించారు. సాధారణ రైళ్లు ప్రయాణించే పట్టాలపైనే ఇది పరుగులు తీస్తుంది. శత్రు దేశాల రాడార్లు గుర్తించకుండా క్షిపణిని రైలు లోపల దాచిపెట్టి తరలించవచ్చు. వర్షం, ఎండ, చలి వంటి వాతావరణ పరిస్థితుల్లోనూ తరలించే అవకాశం ఉండడం మరో ప్రత్యేకత. దేశవ్యాప్తంగా రైలు నెట్‌వర్క్ ఉండడం సైన్యానికి కలిసొచ్చే అంశం. క్షిపణులను రైలు ద్వారా ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చు. ఇదొక 'గేమ్ చేంజర్' అని డీఆర్‌డీఓ వర్గాలు స్పష్టంచేశాయి. రష్యా, చైనా తదితర దేశాలు రైలు ఆధారిత మొబైల్ మిస్సైల్ వ్యవస్థలను అభివృద్ధి చేసుకున్నాయి. అణుశక్తి సంపన్న దేశమైన భారత్ బహుళ రీతుల్లో క్షిపణులను ప్రయోగించే సామర్థ్యాన్ని సొంతం చేసుకోవడం గమనార్హం.

## పార్టీ పరిశీలకులతో అగ్రనేతలు భేటీ

న్యూఢిల్లీ

కాంగ్రెస్‌ని బలోపేతం చేసి.. ఎన్నికల్లో సత్తా చాటాలని ఆ పార్టీ అగ్రనాయకత్వం వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తుంది. అందులో భాగంగా ఏఐసీసీ పరిశీలకులతో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతోపాటు అగ్రనేత రాహుల్ గాంధీ సమావేశం కానున్నారు. డీసీసీ అధ్యక్షుల ఎంపిక కోసం 22 మంది పరిశీలకులతో వారు భేటీ అవనున్నారు. ఈ భేటీకి తెలంగాణ రాష్ట్ర పార్టీ వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్‌తోపాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాజరుకానున్నారు. మరో వైపు.. బిహార్ రాజధాని పాట్నా వేదికగా బుధవారం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక తీర్మానాలు చేసింది. అలాగే మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. భవిష్యత్తులో ఎన్నికల్లో గెలుపు కోసం చేపట్టవలసిన చర్యలపై చర్చించింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాల సీఎంలు, పీసీసీ అధ్యక్షులు, కీలక నేతలతోపాటు ఆ పార్టీ అగ్రనేతలు సైతం హాజరయ్యారు. ఇక మరికొద్ది రోజుల్లో బిహార్ అసెంబ్లీకి ఎన్నికల నగారా మోగనుంది. ఈ రాష్ట్రంలో తన సత్తా చాటాలని ఆ పార్టీ భావిస్తోంది. ఆ క్రమంలో ఇప్పటికే ఆ రాష్ట్రంలో 15 రోజుల పాటు ఎంపి రాహుల్ గాంధీ యాత్ర చేపట్టి పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపారు. ఇంకోవైపు ఓట్ల చోరీ అంశాన్ని ప్రజల్లోకి ఆయన బలంగా తీసుకు వెళ్తున్నారు. తద్వారా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లి.. ఎండగట్టేందుకు ఎంత ప్రయత్నం చేయాల్లో.. అంతా రాహుల్ గాంధీ చేస్తున్నారన్న విషయం అందరికి తెలిసిందే.

## నూతన తేజస్సు

న్యూఢిల్లీ



భారత వైమానిక దళం(ఐఏఎఫ్) మరింత శక్తివంతంగా మారనుంది. అత్యాధునిక యుద్ధ విమానాల రాకతో ఐఏఎఫ్ కొత్త తేజస్సును సంతరించుకోనుంది. ఏకంగా 97 తేజస్ ఎంకే%–%1ఏ తేలికపాటి యుద్ధ విమా నాల(ఎల్‌సీఏ) కొనుగోలుకు హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)తో భార త రక్షణ శాఖ గురువారం ఒప్పందం కుదు ర్చుకుంది. ఈ ఒప్పందం విలువ పన్నులు మినహా రూ.62,370 కోట్లు.

తేజస్ యుద్ధ విమానాల కొనుగోలుకు ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలోని కేబినెట్ కమిటీ నెల రోజుల క్రితమే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒప్పందం ప్రకారం.. 2027%–%28 నుంచి యుద్ధ విమానాల అప్పగింత ప్రారంభమవు తుంది. ఆరేళ్లలోగా మొత్తం విమానాలను రక్షణ శాఖకు హెచ్ఏఎల్ అప్పగించాల్సి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. ఇందులో 68 ఫైటర్ జెట్లు, 29 ట్విన్ సీటర్ విమానాలు ఉన్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించాయి.

**ఏటా 11,750 మందికి ఉద్యోగాలు, ఉపాధి**

ప్రభుత్వ రంగంలోని హెచ్ఏఎల్‌తో ఇలాంటి భారీ ఒప్పందం కుదుర్చుకోవడం ఇది రెండోసారి. 2021 ఫిబ్రవరిలో రూ.48,000 కోట్లతో 83 తేజస్ ఎంకే%–%1ఏ ఫైటర్ జెట్ల కొనుగోలు కోసం హెచ్ఏఎల్‌తో రక్షణ శాఖ ఒప్పందం చేసుకుంది. 2021 కంటే ఈసారి తయారు చేయబోతున్న ఫైటర్ జెట్లు మరింత ఆధునికమైనవి. ఇందులో 64 శాతం దేశీయ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానమే ఉంటుంది. అదనంగా 67 పరికరాలు చేర్చ బోతున్నారు. దేశీయంగా అభివృద్ధి చేసిన అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌ను చేర్చనున్నారు. ప్రతి ఏటా ప్రత్యక్షంగా, పరోక్షంగా 11,750 మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తా యని అంచనా. మొత్తం ఆరేళ్లపాటు ఒప్పందం అమల్లో ఉంటుంది. ఆత్మనిర్భర్ లక్ష్యాని కి ఇదొక ప్రతీక అని అధికార వర్గాలు అభి వర్ణించాయి. ఆరు దశాబ్దాలకుపైగా సేవ లందించిన మిగ్%–%21 యుద్ధ విమానాలకు వీడ్కోలు పలుకుతూ వాటి స్థానంలో తేజస్ ఎంకే%–%1ఏ ఫైటర్ జెట్లను ప్రవేశపెట్టబో తున్నారు.

**నేడు మిగ్%–%21 జెట్లకు వీడ్కోలు**

ఘనమైన చరిత్ర కలిగిన మిగ్%–%21 యుద్ధ విమానాలకు వీడ్కోలు పలికే సమయం వచ్చేసింది. శుక్రవారం బైబై చెప్పబో తున్నారు. చండీగఢ్‌లోని ఎయిర్ ఫోర్స్ స్టేషన్ వేదిక కానుంది.

# ఇక తెలంగాణ తల్లి ఫ్లైఓవర్



**హైదరాబాద్ :** హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) స్టాండింగ్ కమిటీ బుధవారం తీసుకున్న కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు తల్లి ఫ్లైఓవర్‌ను 'తెలంగాణ తల్లి ఫ్లైఓవర్'గా పేరు మార్చాలని సిఫారసు చేసిన తీర్మానించింది. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతలో జరిగిన సమావేశంలో 14 అజెండా అంశాలు, 10 టేబుల్ ఐటమ్‌లకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ పేరు మార్పును రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. 1990ల చివరలో హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉండేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సెక్రటేరియట్ వద్ద రోజూ జరిగే ట్రాఫిక్ జామ్‌లు ప్రజలను ఇబ్బంది పెట్టేవి. దీని నుంచి ఉపశమనం కలిగించడానికి 1997లో ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆధ్వర్యంలో ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. రూ.50 కోట్లు ఖర్చు అంచనా వేశారు. సెక్రటేరియట్ పాత గేట్ నుంచి లోయర్ ట్యాంక్ బండ్ వరకు 2.3 కిలోమీటర్ల పొడవుతో, ఇది హైదరాబాద్‌లోని అతి పొడవైన ఫ్లైఓవర్‌గా రూపొందించారు. నిర్మాణం సమయం లో, అంబేడ్కర్ విగ్రహాన్ని తాత్కాలికంగా తరలించడం, స్లిప్ రోడ్లు నిర్మించడం వంటి సవాళ్లు ఎదుర్కొన్నారు. ఫలితంగా ప్రాజెక్ట్ 7 సంవత్సరాలు ఆలస్యమైంది. చివరకు 2005 జనవరి 22న, కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి ఫ్లైఓవర్‌ను ప్రారంభించారు. ఆయనే దీనికి 'తెలుగు తల్లి ఫ్లైఓవర్' అనే పేరు పెట్టారు, ఇది తెలుగు సంస్కృతి, తల్లి గౌరవానికి ప్రతీకంగా నిలిచింది. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం 50 కోట్ల రూపాయలు ఖర్చు అయింది. అప్పటి నుంచి హైదరాబాద్ రవాణా వ్యవస్థలో కీలక భాగంగా మారింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 'తెలుగు తల్లి' పేరు మార్చాలని డిమాండ్ గట్టిగా వినిపించింది. ఇప్పుడు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ తీర్మానం చేసింది. బుధవారం జరిగిన సమావేశంలో 14 అజెండా అంశాలు 10 టేబుల్ ఐటమ్‌లు చర్చించారు. అందులో పేరు మార్పు ప్రధానమైనది. కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం కోసం సిఫారసు చేశారు. ఈ నిర్ణయం త్వరలోనే అమలులోకి వస్తుందని అధికారులు తెలిపారు. మేయర్ విజయలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ, "ఈ నిర్ణయం తెలంగాణ ప్రజల గౌరవాన్ని పెంచుతుంది. హైదరాబాద్‌లోని ప్రతి నిర్మాణం మన రాష్ట్ర చరిత్రను స్మరించాలి" అని అన్నారు. మరోవైపు, ఈ ఫ్లైఓవర్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఫ్లైఓవర్ రెండు వైపులా ఆర్చ్‌లు నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆర్చ్‌లు తెలంగాణ సంస్కృతి, చరిత్రను ప్రతిబింబించే డిజైన్‌తో ఉంటాయని చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు రూ.5 కోట్లు కేటాయించారు. పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ చర్యలు ఫ్లైఓవర్‌ను కేవలం రవాణా మార్గంగా కాకుండా, టూరిస్ట్ స్పాట్‌గా మారుస్తాయి. ఈ సమావేశంలో రైతీబౌలి- నానల్‌నగర్ జంక్షన్ వద్ద మల్టీ-లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి 398 కోట్ల రూపాయలు కేటాయించారు. రసూల్పురాలో జ-షేప్ ఫ్లైఓవర్‌కు 150 కోట్ల రూపాయలు ఆమోదం తెలిపారు.

# ట్రాఫిక్ రద్దీ తగ్గించి పండుగను సంతోషంగా జరుపుకుందాం

**ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్**



**సిద్దిపేట :** పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పోలీస్ వారి సలహాలు సూచనలు పాటించాలిరోడ్డుకు వచ్చిపోయే ప్రజలకు ఇబ్బందికరంగా షాపుల యజమానులు బోర్డులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దు.షాపుల ముందు డీజే బాక్సులు పెట్టవద్దుడిజె సౌండ్, సౌండ్ పొల్యూషన్ వల్ల ఆరోగ్యాలు పాడు చేసుకోవద్దు.షాపింగ్ మాల్ ఇతర షాపుల యజమానులు తాత్కాలికంగా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసుకోవాలి, ట్రాఫిక్ నియంత్రణ గురించి పెద్దపెద్ద షాప్ ల వద్ద సెక్యూరిటీ గార్డును పెట్టుకోవాలిసిద్దిపేట ట్రాఫిక్ ఏసీపి సుమన్ కుమార్.దసరా, బతుకమ్మ పండుగ సందర్భంగా భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున ఆలయాలు, షాపింగ్ మాల్స్, మార్కెట్లు, రోడ్లపైకి వస్తారు. ఈ సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా షాపింగ్ కాంప్లెక్స్ వద్ద వాహనదారులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రజలందరూ సహకరించి, స్వీయ క్రమశిక్షణ పాటిస్తేనే ఈ రద్దీని సులభంగా నియంత్రించవచ్చు. అడ్డదిడ్డం గా వాహనాలు పార్క్ చేస్తే:ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుం ది. అత్యవసర సేవలకు ఆటంకం కలుగుతుంది. వాహన దారులకే ఇబ్బందులు వస్తాయి.వాహనాలను ప్రత్యేకంగా గుర్తించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే పార్క్ చేయండి.రహదారుల మధ్యలో, మార్కెట్ రోడ్లలో, దేవాలయాల సమీపంలో వాహ నాలు అడ్డుగా నిలపకండి.ట్రాఫిక్ పోలీసుల సూచనలు తప్ప నిసరిగా పాటించండి.అత్యవసర వాహనాలకు అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు మొదలైనవి వెంటనే దారి ఇవ్వండి. ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు:పాత బస్టాండ్, సుభాష్ రోడ్డుకు కేవలం బైకులు మాత్రమే అనుమతి. ఆటోలు, కార్లకు ప్రవేశం లేదు.పుష్పాంజలి ఎక్స్ రోడ్డు, సుభాష్ రోడ్డుకు బైకులకే అనుమతి. ఫోర్ వీలర్స్, ఆటోలు అనుమతి లేదు.మార్కెట్, మాంగల్య షాపింగ్ మాల్ వరకు కేవలం బైకులు మాత్రమే వెళ్లవచ్చు. ఆటోలు, కార్లు నిషేధం.సంతోషిమాత ఆలయం, సుభాష్ రోడ్డు వైపు బైకులు మాత్రమే అనుమతి.బురుజు, సుభాష్ రోడ్డు మార్గం కేవలం బైకులు మాత్రమే వాడాలి. ఇరువైపులా కార్లు, ఆటోలు అనుమతి లేదు.ట్రాన్స్‌పోర్ట్ వాహ నాలు ఉదయం 10 గంటల లోపు సరుకులు దిచ్చుకోవాలి . తిరిగి రాత్రి 8 గంటల తర్వాత మాత్రమే ప్రవేశం ఉంటుంది. ప్రతి ఒక్కరు స్వీయ క్రమశిక్షణతో ముందడుగు వేస్తేనే పండుగ సమయాన్ని సుఖశాంతులతో గడపవచ్చు సిద్దిపేట ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్ అన్నారు.

# నూతన సర్వీసుల మంజూరు వేగవంతం చేయండి

**సీఎండీ ముషారఫ్ ఫరూఖీ,**

**నూతన సర్వీసులు, టైటిల్ ట్రాన్స్ ఫర్, సోలార్ నెట్ మీటరింగ్, ఖఓ సూర్య ఘర్ పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష..**

**నూతన ఎల్టీఎం సర్వీసుల ఛార్జింగ్ కోసం కొత్త విధానం..**

**బైక్ పై సీఎండీ బస్తీ బాట..**



**హైదరాబాద్ :** నూతన సర్వీస్ కనెక్షన్ల కోసం పెండింగ్ లో వున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, దీని కోసం రేపు (శనివారం) ఇస్తున్న లైన్ క్లియరెన్స్ లను సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ ఠ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, విద్యుత్ అధికారుల ను ఆదేశించారు. గురువారం, చీఫ్ ఇంజినీర్, సూపరిం టెండింగ్ ఇంజినీర్లతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ లో నూతన సర్వీసులు, టైటిల్ ట్రాన్స్ ఫర్, సోలార్ నెట్ మీటరింగ్, పీఎం సూర్య ఘర్ పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 593 ఎల్టీఎం ఓ (అపార్ట్మెంట్/ లే అవుట్) దరఖాస్తులు డిపార్ట్మెంట్ వద్ద పెండింగ్ లో వున్నాయి. వాటిని వెంటనే రిలీజ్ చేయాలని ఆదేశించారు. గతం లో నూతన ఎల్టీఎం సర్వీసుల ఛార్జింగ్ కోసం ఫీడర్ ను నిలిపివేసేవారని, దాని వలన సరఫరా లో ఇబ్బందులు ఏర్పడేవన్నారు. నూతన సర్వీసుల ఛార్జింగ్ కోసం ఎప్పుడు పడితే అప్పుడు సరఫరా నిలిపివేయకుండా ఉండేందుకు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినట్టు సీఎండీ తెలిపారు. దీని ప్రకారం, ఎల్టీఎం కనెక్షన్లు ఛార్జ్ చేసేందుకు గాను శనివారం లైన్ క్లియరెన్స్ ఇవ్వనున్నామని సీఎండీ తెలిపారు. సంబంధిత అధికారులు ముందుగా లైన్ క్లియరెన్స్ షెడ్యూల్ ను రూపొందించి , ఏ ప్రాంతంలో ఎంత సేపు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారో ఆ ప్రభావిత ఫీడర్ల పరిధిలోని వినియోగదారులకు తెలియజేయాలని సీఎండీ ఆదేశించారు.ఎల్సీఅ సమయం లో చెట్ల కొమ్మలు కొట్టేయడం, డీటీఆర్ ల వద్ద ఏబీ స్విచ్ ల మరమ్మతులు సైతం చేపట్టాలని సీఎండీ తెలిపారు. సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ప్రతి మంగళవారం, గురువారం నాడు సర్కిళ్ల వారీగా అత్యధికంగా సరఫరా ఫిర్యాదులు నమోదయ్యే ప్రాంతాల్లో పర్యటనలు చేస్తూ ఎల్టీ నెట్వర్క్ ను తనిఖీ లు చేయడం, స్థానిక ప్రజలతో మాట్లాడుతూ సంస్థ పనితీరుని అడిగి తెలుసుకుంటున్నారు. దానిలో భాగంగా ఈ రోజు పాత బస్తీలోని హుస్సేనీ ఆలం, మొగల్ పురా పరిధిలోని బేహరుపియా బస్తీ, గొల్ల ఖిడికి బస్తీలోని చిన్న చిన్న గల్లీల్లో బైక్ మీద తిరుగుతూ నెట్వర్క్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఆపరేషన్ డా. నరసింహులు, మెట్రో జోన్ చీఫ్ ఇంజినీర్ శ్రీ ప్రభాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మరో 2 రోజుల వానలు

**హైదరాబాద్ :** హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలంగాణలోని పలు జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం గురువారం అల్పపీడనంగా, శుక్రవారం వాయుగుండంగా బలపడనుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇది శనివారం నాటికి తీరం దాటే అవకాశం ఉందని, దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు నమోదవుతాయని అంచనా వేశారు. గురువారం మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నల్లగొండ, సూర్యాపేటలో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లో ఉరుములు, మెరుపులతోకూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తారు వానలు కురుస్తాయని, 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది. శుక్రవారం ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఇక శనివారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కుమ్రం భీం, మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది

## ప్రేమపేరుతో నమ్మించి అత్యాచారం

**నల్గొండ :** హైదరాబాద్‌లోని తార్నాకలో దారుణం జరిగింది. ప్రేమ పేరుతో ముగ్గురు మైనర్ బాలికలను యాదగిరిగుట్టకు తీసుకెళ్లి అత్యాచారం చేశారు ముగ్గురు యువ కులు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో తొమ్మిదో తరగతి చదువుతున్న ముగ్గురు బాలికలకు మాయమాటలు చెప్పి.. సదరు యువకులు బడి ఎగ్గొట్టేలా చేశారు. ఆ యువకుల మాటలు నమ్మిన బాలికలు స్కూల్‌లో బతుకమ్మ వేడుకలు ఉన్నాయని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లారు. శనివారం యాదగిరిగుట్టకు దైవ దర్శనానికి తీసుకెళ్లి.. అక్కడ ముగ్గురు బాలికలపై ఆ యువకులు అత్యాచారానికి ఒడిగట్టారు. అనంతరం బాలికలను హైదరాబాద్‌లో వదిలిపెట్టి పరారయ్యారు. సాయంత్రం తార్నాకకు తిరిగొచ్చాక జరిగిన సంఘటనపై తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు బాలికలు. బాలికల పేరెంట్స్ ఫిర్యాదుతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు అల్వాల్ పోలీసులు. వారిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలికలను మోసం చేసిన యువకులలో ఉఊఓఅ కాంట్రాక్ట్ ఉద్యోగి మధు, షాపింగ్ మాల్‌లో పనిచేసే వంశీ, పెట్రోల్ బంకులో పనిచేసే నీరజ్ ఉన్నట్టు గుర్తించారు పోలీసులు. కాగా, ఈ ముగ్గురు నిందితులతో పాటు.. లాడ్జి ఓనర్‌ను అదుపులోకి తీసుకున్నారు

## ఉద్యోగాలకు వెయిటేజ్

**హైదరాబాద్ :** ఆర్టీసీలో ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్లు డ్రైవర్లు, శ్రామిక్, ఇతర క్యాటగిరిలా వారిగా ఉద్యోగులు ఉన్నాయి. ఇందులో ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్లకు, ఔట్సోర్సింగ్ డ్రైవర్లకు 30% వెయిటేజ్ ఇవ్వాలని ఏఐటీయూసీ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ కి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినపత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన తర్వాత ఏఐటీయూసి అధ్యక్షుడు టి.దివా కర్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ఆర్టీసీ సంస్థకు లాభాలు రావడంలోనూ ఆర్టీసీ సంస్థ అభివృద్ధి చెందడంలోనూ ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్లు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఇతర డిపార్ట్మెంట్లో నియామకాలు చేపట్టేటప్పుడు వేయిటేజ్ మార్కులు ఇస్తా రని, అలాగే ఆర్టీసీలో కూడా 30% మార్కుల నుంచి మొదటి ప్రాధాన్యత వీరికే ఇవ్వాల న్నారు. చాలిచాలని జీతాలతో పనిచేస్తున్న హైర్ బస్ డ్రైవర్లకు మొదటి ప్రాధాన్యత కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని, లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి ఉపేందర్, ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్స్ యూనియన్ ఆసిఫాబాద్‌డిపో అధ్యక్షుడు మాధుసూధన్, ఉపాధ్యక్షుడు భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

## సాహితి ఇన్ ఫ్రా విషయంలో విచారణ

**హైదరాబాద్ :** టాలీవుడ్ ప్రముఖ నటుడు జగపతిబాబు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరుకావడం చిత్ర పరిశ్రమలో కలకలం రేపింది. భారీ మోసానికి పాల్పడిందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న సాహితీ ఇన్ ఫ్రా కేసులో భాగంగా, అధికారులు ఆయనను సుదీర్ఘంగా ప్రశ్నించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఆయన ఈడీ కార్యాలయానికి రావడం చర్చనీయాంశంగా మారింది.దాదాపు నాలుగు గంటల పాటు సాగిన ఈ విచారణలో, జగపతిబాబు గతంలో సాహితీ ఇన్ ఫ్రా సంస్థ యాడ్స్ లో నటించ అంశంపై ఈడీ అధికారులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఆ సంస్థ ప్రకటనల్లో నటించినందుకు గాను ఆయనకు అందిన పారితోషికం, చెల్లింపుల మార్గాలపై వివరాలు సేకరించినట్టు సమాచారం. ఆ లావాదేవీల గురించి కూపీ లాగినట్లు తెలుస్తోంది.ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో కస్టమర్లను ఆకర్షించిన సాహితీ ఇన్ ఫ్రా, సుమారు 700 మంది నుంచి రూ. 800 కోట్లకు పైగా వసూలు చేసి మోసానికి పాల్పడిందనేది ప్రధాన ఆరోపణ. ఈ నిధులను షెల్ కంపెనీలకు మళ్లించి అక్రమాలకు పాల్పడ్డారని ఈడీ దర్యాప్తులో తేలింది. ఇదే కేసులో భాగంగా, మోసం ద్వారా సంపాదించిన సొమ్ముతో కొనుగోలు చేసిన రూ.161 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ ఇప్పటికే అటాచ్ చేసింది.గతంలో ఎలాంటి వివాదాల్లోనూ పేరు వినిపించని జగపతిబాబును ఈడీ విచారించడం ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం ప్రకటనల్లో నటించినందుకే ఆయన్ను సాక్షిగా విచారించారా లేక మరేదైనా కోణం ఉందా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

## ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించండి లక్కీడ్రాలో బహుమతి పొందండి

**జగిత్యాల :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో ప్రయాణించండి లక్కీ డ్రా లో బహుమతి లను పొందాలని జగిత్యాల ఆర్టిసి డి. ఎం. కల్పన కోరారు. గురువారం జగిత్యాల మీడియా కు ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ దసరా పండుగను పురస్కరించుకొని ప్రయాణికుల కోసం లక్కీ డ్రా లను ప్రవేశ పెట్టిందన్నారు. ఆర్టీసీలోని డీలక్స్, సెమీ డీలక్స్, సూపర్ లగ్జరి, లహరి, నాన్ ఏ.సి, ఏ. సి బస్సులలో ప్రయాణించే ప్రయానికులందరు లక్కీ డ్రా కు అర్హులన్నారు. ఈ దస రా వేళ సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 6 వరకు ప్రయాణించే ప్రయాణికులు తమ టిక్కట్ల వెనుక తమ పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ రాసి బస్టాండ్ లలో ఏర్పాటు చేసే లక్కీ డ్రా బాక్స్ లలో వేయాలని డి. ఎం. కోరారు. కరీంనగర్ రిజియన్ పరిధిలోని టిక్కె ట్ల ను సేకరించి అక్టోబర్ 8న డ్రా తీసి ముగ్గురు విజేత లను ప్రకటిస్తారని పేర్కొన్నారు.

## జిపిఎఫ్ ప్రతిపాదనలు జిల్లా పరిషత్ కార్యాలయంలో స్వీకరించాలి

**జగిత్యాల :** జగిత్యాల జిల్లాలోని జిల్లా పరిషత్ ఆధీనంలో పనిచేయుచున్న దాదాపు 1,600 మంది ఉపాధ్యాయుల జిపిఎఫ్ లోన్స్ పార్ట్ ఫైనల్స్ మరియు ఫైనల్ పేమెంట్ జిల్లా విద్యాధికారి కార్యాలయం ద్వారా కాకుండా నేరుగా జిల్లా పరిషత్ కార్యాలయంలో స్వీకరించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి గౌతమ్ రెడ్డి కి పిఆర్టీయూ టిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనందరావు, యాల్ల అమర్నాథ్ రెడ్డిలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మాదిరిగానే జీవో ఎంఎస్ నెంబర్ 40 ప్రకారం ప్రధానోపాధ్యా యులు మరియు మండల విద్యాధికారుల మంజూరు చేసిన జిపిఎఫ్ లోన్స్ మరియు పార్ట్ ఫైనల్స్ ప్రతిపాదనలు నేరుగా జిల్లా పరిషత్ కార్యాలయంలో స్వీకరించాలని వారు తెలిపారు

# ఈ ఆకుతో షుగర్ మొత్తం కంట్రోల్



మొక్కలు పెంచుకుంటే ఏమవుతుంది. ఈ ప్రశ్నకు రకరకాల సమాధానాలు వస్తాయి. స్వచ్ఛమైన గాలి అందుతుంది. మైండ్ కి మంచి రిలాక్సేషన్ వస్తుంది. సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. మనసు ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటుంది. క్వాలిటీ ఆఫ్ లైఫ్ అనేది ఇంప్రూవ్ అవుతుంది. ఇన్ని ప్రయోజనాలు ఉంటాయి కాబట్టే చాలా మంది ఇళ్లలో మొక్కల పెంపకాన్ని ఓ అలవాటుగా మార్చుకుంటున్నారు. ప్రత్యేకంగా వాటికి సమయం కేటాయిస్తున్నారు. స్థలం కేటాయించి అందులో వాళ్లకు నచ్చిన పూల మొక్కలు, కూరగాయలు పెంచుకుంటున్నారు. అయితే..వీటి వల్ల ఆహ్లాదం మాత్రమే కాదు. ఆరోగ్యం కూడా అందాలంటే మాత్రం ఇప్పుడు చెప్పిన ఓ మొక్క తప్పక పెంచుకోవాలి. అదేంటంటే..ఇన్సులిన్ ప్లాంట్. పేరులోనే ఉంది..ఇన్సులిన్ అని. అంటే..షుగర్ తగ్గించడంలో ఇది ఎంతగానో తోడ్పడుతుంది. మరి ఈ మొక్కలో ఉండే గుణాలేంటి. ఎలా తీసుకుంటే షుగర్ తగ్గుతుందో తెలుసుకుందాం. ఇన్సులిన్ ప్లాంట్. దీన్నే జశీర్బం అస్త్రఅవబం అనే శాస్త్రీయ నామంతో పిలుచుకుంటారు. ప్రకృతి వైద్యంలో ఎంతో ప్రాధాన్యత సంపాదించుకుంది ఈ మొక్క. ముఖ్యంగా దయాబెటిస్ ని కంట్రోల్ చేసి మెటబాలిజం మెరుగుపరచడంలో చాలా సహాయపడుతుంది. అందుకే..దీన్ని ఇన్సులిన్ ప్లాంట్ గా చెప్తారు. నిజానికి ఆయుర్వేద వైద్యంలో దీన్ని విరివిగా వాడుతుంటారు. చేయడంతో పాటు జీర్ణ శక్తిని పెంపొందించడంలోనూ ఇది ఉపయోగపడుతుంది. దయాబెటిస్ కి మందులు వాడడం తప్పనిసరి. అయితే.. వీటితో పాటుగా బ్లడ్ షుగర్ లెవెల్స్ ని కంట్రోల్ చేయడానికి ఉపయోగపడే ప్రత్యామ్నాయాలలో ఈ ఇన్సులిన్ ప్లాంట్ చాలా కీలకమైంది. ఇన్సులిన్ ప్లాంట్ తో అసలు ఏయే ప్రయోజనాలుంటాయి. అసలు ఇందులో ఏ గుణాలు షుగర్ ని కంట్రోల్ చేయగలుగుతాయి. ఎలా వాడితే షుగర్ తగ్గుతుంది. ఇన్సులిన్ ప్లాంట్ అనే పేరు రావడానికి ముఖ్య కారణం..ఈ మొక్క గ్లూకోజ్ మెటబాలిజాన్ని ఇంప్రూవ్ చేస్తుంది.

ముఖ్యంగా ఇన్సులిన్ సెన్సిటివిటీని నియంత్రిస్తుంది. ఇందులో హైపోగ్లైసెమిక్ గుణాలు ఉంటాయి. ఇందుకు ముఖ్య కారణం అంటంటే..ఈ మొక్కలో కారోసాలిక్ యాసిడ్ ఉంటుంది. ఈ యాసిడ్ బాడీ సెల్స్ లో గ్లూకోజ్ ట్రాన్స్ పోర్టర్స్ ని యాక్టివేట్ చేస్తాయి. ఫలితంగా రక్తంలో ఉన్న గ్లూకోజ్ అంతా సరైన విధంగా మజిల్స్ కి అందుతుంది. అంటే ఈ గ్లూకోజ్ ఎనర్జీలాగా కన్వర్ట్ అవుతుంది. ఇదే సమయంలో మరీ ఎక్కువ మొత్తంలో గ్లూకోజ్ విడుదల కాకుండా చూడడంలోనూ ఈ ఇన్సులిన్ ప్లాంట్ సహకరిస్తుంది. క్రమంగా బ్లడ్ షుగర్ లెవెల్స్ ని కంట్రోల్ చేస్తుంది. కారోసాలిక్ యాసిడ్ దాదాపు ఇన్సులిన్ హార్మోన్ లాగానే పని చేస్తుంది. భోజనం చేసిన తరవాత సాధారణంగానే షుగర్ లెవెల్స్ పెరుగుతాయి. ఇలా పెరగకుండా ఈ మొక్క అడ్డుకుంటుంది.

ఈ ఇన్సులిన్ ప్లాంట్ లో యాంటీ ఇన్ ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెట్ గుణాలు అధికంగా ఉంటాయి. ఫ్లేవనాయిడ్స్ ఉండడం వల్ల ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచి బయటపడేందుకు అవకాశం ఉంటుంది. ఈ స్ట్రెస్ కారణంగానే త్వరగా దయాబెటిస్ పెరుగుతుంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ కండీషన్ నుంచి బయటపడాలంటే ఇంట్లో తప్పనిసరిగా ఈ ఇన్సులిన్ ప్లాంట్ పెంచుకోవాలి. ఇన్సులిన్ ప్లాంట్ తో టైప్ 1 తో పాటు టైప్ 2 దయాబెటిస్ కూడా కంట్రోల్ లోకి వస్తుంది. ఇప్పటికే దీనిపై ఎన్నో పరిశోధనలు జరిగాయి.

## ఖర్జూరాలను నానబెట్టి తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు

ఖర్జూరం, సహజ సిద్ధమైన ఈ పండు అందరూ ఇష్టపడే ఆహారం. ఇందులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటం వల్ల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. అయితే, కొందరికి ఖర్జూరాలను నేరుగా తినడం వల్ల జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు. అలాంటి వారికి ఖర్జూరాలను నీటిలో నానబెట్టి తినడం ఉత్తమ పద్ధతిగా పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఈ విధానం జీర్ణక్రియను సులభతరం చేస్తుంది మరియు పోషకాల శోషణను మెరుగుపరుస్తుంది. ఖర్జూరాలను నానబెట్టడం చాలా సులభం. 3 లేదా 4 ఖర్జూరాలను రాత్రి నీటిలో నానబెట్టి, మరుసటి రోజు ఉదయం పరగడుపున తినాలి. ఈ పద్ధతి వల్ల ఖర్జూరంలోని పీచు మృదువుగా మారి, జీర్ణం సులభతరం అవుతుంది. అంతేకాకుండా, నీటిలో నానబెట్టడం వల్ల ఖర్జూరంలోని పోషకాలు సులభంగా శరీరంలో శోషించబడతాయి. ఈ విధానం శరీరానికి శక్తిని అందించడంతో పాటు, రోజంతా చురుకుదనాన్ని కాపాడుతుంది. ఖర్జూరాలను నానబెట్టి తినడం వల్ల గుండె ఆరోగ్యం, రక్తహీనత నివారణ, ఎముకల బలం, రోగనిరోధక శక్తి పెరుగుదల వంటి అనేక లాభాలు కలుగుతాయి. ఖర్జూరంలోని పొటాషియం, మెగ్నీషియం, ఇనుము వంటి ఖనిజాలు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి.




రోజూ ఈ విధంగా తినడం వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది మరియు మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి.

## పిచ్చి మొక్కే కదా అని పీకేస్తున్నారా..?




శీతాకాలంలో ఎన్నో రకాల ఆకుకూరలు లభిస్తాయి. ఇవి రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. ఈ సీజన్‌లో పోషక లక్షణాలతో నిండిన అనేక రకాల ఆకుకూరలను మీరు ఖచ్చితంగా మీ ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వీటిలో ఒకటి బతువా ఆకుకూర. శీతాకాలంలో వచ్చే వ్యాధులను నివారించడానికి ఈ ఆకు కూరను మీ ఆహారంలో తప్పక ఉపయోగించాలని చెబుతున్నారు. మీరు దీనితో పప్పు, పరాఠా, కూర చేసుకోవచ్చు. అంతేకాదు.. బతువా సూప్ కూడా తయారు చేస్తారు. ఇది రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్యంతో నిండి ఉంటుంది. మలబద్ధకం నుండి ఉపశమనం: జీర్ణ సమస్యలు ఉన్నవారికి బతువా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇందులో ఫైబర్, నీరు అధికంగా ఉంటాయి. ఇది ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను నిర్వహించడానికి సహాయపడుతుంది. మీరు మలబద్ధకంతో బాధపడుతుంటే, మీ ఆహారంలో బతువా ఆకుకూరలను చేర్చుకోండి. ఇది మీ కడుపును శుభ్రపరచడంలో సహాయపడుతుంది. బరువు తగ్గడానికి: బతువా ఆకుకూరలు బరువు తగ్గడానికి ఒక అద్భుతమైన ఎంపిక. వీటిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. వీటిని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మీరు ఎక్కువసేపు కడుపు నిండినట్లు ఉండటానికి సహాయపడుతుంది. అతిగా తినకుండా నిరోధిస్తుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇది తక్కువ కేలరీల ఆహారం కూడా. మీరు దీన్ని మీ బరువు తగ్గించే ఆహారంలో అనేక విధాలుగా చేర్చుకోవచ్చు. మధుమేహ రోగులకు ప్రయోజనకరం: బతువా ఆకుకూరలు డయాబెటిక్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటాయి. వాటిని తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణ స్థాయిలో ఉంటాయి. మీరు డయాబెటిస్‌తో బాధపడుతుంటే, బతువా ఆకుకూరలు తప్పకుండా తినండి. జుట్టుకు ప్రయోజనకరం: బతువాలో ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఇతర విటమిన్లు, ఖనిజాలు కూడా పుష్కలంగా ఉంటాయి. మీరు జుట్టు రాలడంతో బాధపడుతుంటే, మీ ఆహారంలో బతువాను చేర్చుకోండి ఎందుకంటే ఇది మీ జుట్టు మూలాలను బలోపేతం చేస్తుంది. రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది: బతువాను రోగనిరోధక శక్తిని పెంచేదిగా పిలుస్తారు . ఇందులో అమైనో ఆమ్లాలు, ఫైబర్ మరియు రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడే అనేక పోషకాలు ఉంటాయి. ఇది శీతాకాలపు అనేక అనారోగ్యాల నుండి మిమ్మల్ని రక్షించడంలో సహాయపడుతుంది.

## రక్తం చిక్కగామారితే స్ట్రోక్స్ తప్పదు



డీహైడ్రేషన్, క్యాన్సర్, షుగర్, జన్యులోపాల వంటి కారణాల వల్ల చాలా వరకూ రక్తం చిక్కబడుతుంది. రక్తం చిక్కబడితే గుండె సమస్యలు, స్ట్రోక్ వంటి తీవ్ర సమస్యలొస్తాయి. ఆధునిక జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ఒత్తిడి పెరగడం వంటి కారణాల వల్ల చాలా వరకూ రక్తం మందంగా మారుతుంది. వీటితో పాటు వయసు పెరగడం, 65 ఏళు దాటినవారిలో రక్తం గడ్డకడుతుంది. గర్భం, అధిక బరువు, క్యాన్సర్, అన్‌వాంటెడ్ పిల్స్ తీసుకోవడం, హార్మోన్ ట్రీట్‌మెంట్, ధూమపానం, సరిలేని లైఫ్‌స్టైల్ కారణంగా రక్తం గడ్డకడుతుంది. దీని వల్ల హెల్త్ ఎఫెక్ట్ అవుతుంది. ఈ సమస్య ప్రారంభ లక్షణాలు వెంటనే స్పష్టంగా కనిపించకపోవచ్చు. కానీ, వీటిని ముందుగానే గుర్తించాలి. లేదంటే చాలా సమస్యలు వస్తాయి. మన బాడీలో అత్యంత ముఖ్యమైన రక్తంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలి. అయితే, నేచురల్‌గానే రక్తాన్ని పల్చబరిచేందుకు కొన్ని ఫుడ్స్ హెల్ప్ చేస్తాయి. ఇవి మీ డాక్టర్‌తో మాట్లాడి తర్వాత తీసుకోవచ్చు. మిరియాలు తీసుకోవడం వల్ల రక్తం పల్చగా మారుతుంది. వీటిని మనం సూప్స్‌లో కలిపి తీసుకోవచ్చు. మామూలుగా వంటల్లో వాడతాం. వీటిలోని సాలిసిలైట్స్ కారణంగా రక్తం చిక్కబడకుండా ఉంటుంది. వీటిని మనం మసాలాల్లో కలిపి తీసుకోవచ్చు. వీటిని తీసుకోవడం వల్ల బీపి కూడా కంట్రోల్ అవుతుంది. రక్తసరఫరా పెరుగుతుంది. ఎక్కువ పరిమాణంలో తీసుకోవద్దు. తీసుకునే ముందు డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది. విటమిన్ ఇ అనేది మనం తీసుకునే మోతాదుని బట్టి ఉంటుంది. వీటిని ఎక్కువ మోతాదులో తీసుకోవద్దు. డాక్టర్ సలహాతో సప్లిమెంట్స్ రూపంలో తీసుకోవచ్చు. వీటిని మనం ఫుడ్స్ ద్వారా కూడా పొందొచ్చు. బాదం, సన్ ఫ్లవర్ ఆయిల్, సన్‌ఫ్లవర్ నట్స్, పీనట్ బటర్, గ్రెయిన్స్ వంటివాటి నుంచి పొందొచ్చు. అయితే పరిమాణం ముఖ్యం. దీనికోసం ముందగా డాక్టర్ సలహా తీసుకోవాలి. అల్లం యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్న మరో అద్భుత పదార్థం. దీనిని తీసుకోవడం వల్ల బ్లడ్ గడ్డకట్టకుండా నిరోధిస్తుంది. అల్లంలో సాలిసైలేట్స్ ఉన్నాయి. అల్లంలోని గుణాలు రక్తాన్ని పల్చబరుస్తాయి. దీనికోసం అల్లాన్ని తాజాగా లేదా ఎండబెట్టి తీసుకోవచ్చు. వీటిని వంటల్లో యాడ్ చేయొచ్చు. అల్లంని టీలా చేసి తాగొచ్చు. రసాలు, స్మూతీలో కూడా కలిపి తాగొచ్చు.

## చియా సీడ్స్ తినే విషయంలో అసలు చేయకూడని తప్పులు



నీటిలో నానబెట్టి చియా సీడ్స్ తినడం అనేది సరైన పద్ధతే అయినప్పటికీ మరి కొన్ని సార్లు మాత్రం ఎలా పడితే అలా తింటున్నారు. ఈ అలవాటు కారణంగానే సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా జీర్ణ శక్తిపై ప్రభావం పడుతోంది. చియా సీడ్స్ లో ఫైబర్, ప్రొటీన్, యాంటీ ఆక్సిడెంట్స్ అధికంగా ఉంటాయి. ఇవన్నీ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే..వీటిని తినే క్రమంలో కొన్ని పొరపాట్లు చేయడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంటుంది. మరి చియా గింజలు తినే ప్రాసెస్ లో ఎలాంటి తప్పులు చేయకూడదో తెలుసుకుందాం. చియా గింజలలో బోలెడన్ని పోషకాలుంటాయి. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ తోపాటు ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫలితంగా చియా సీడ్స్ ద్వారా జీర్ణ శక్తి మెరుగవుతుంది. అయితే..వీటిలో క్యాల్షియం, మెగ్నీషియం కూడా ఉంటాయి. ఇవి ఎముకలను బలంగా ఉంచడంతో పాటు రక్త సరఫరా మెరుగ్గా అయ్యేందుకు సహకరిస్తచాయి. బ్లడ్ షుగర్ లెవెల్స్ కంట్రోల్ చేయడానికి కూడా చియా సీడ్స్ ఎంతగానో ఉపయోగపడతాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు బరువు తగ్గించడంలోనూ ఇవి ఎంతో తోడ్పడతాయి. వీటిని పెరుగు, జ్యూస్, స్మూతీలలో కలుపుకుని తినవచ్చు. అయితే ఇందులో ఉండే ఫైబర్ కారణంగా జీర్ణ శక్తి మెరుగవుతుంది. పేగులలో కదలికలు తీసుకొచ్చి సులువుగా మలవిసర్జన జరిగేలా చూస్తుంది. నీటిలో నానబెట్టి వాటితో పాటు కలిపి తీసుకుంటే ప్రయోజనాలుంటాయి. అయితే..ఇన్ ఫ్లమేషన్ తగ్గించడంలోనూ ఇది సాయపడుతుంది. ఇందాకే చెప్పుకున్నట్టుగా ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ అనేది జీర్ణ వ్యవస్థకు బూస్టప్ లాంటిది. సరైన విధంగా తీసుకుంటే చాలాత్వరగా ఉబ్బరం, గ్యాస్, లాంటివి కంట్రోల్ లోకి వస్తాయి. ఇలాంటి జీర్ణ సమస్యలున్న వారు తప్పకుండా చియా సీడ్స్ వాడాలి. వీరితోపాటు బరువు తగ్గాలనుకునే వారికి ఇన్ ఫ్లమేషన్ తగ్గించుకోడానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయి.

ఇన్ ఫ్లమేషన్ అంటే కీళ్లలో మంట, వాపులు రావడం. చియా సీడ్స్ తీసుకుంటే ఈ ఇన్ ఫ్లమేషన్ కి చెక్ పెట్టవచ్చు. కేవలం ఇన్ ఫ్లమేషన్ తగ్గించడం ఒక్కటే కాదు. కాలేయం ఆరోగ్యంగా ఉంచడంలోనూ ఇది ఎంతో తోడ్పడుతుంది. బ్లడ్ ప్రెజర్ ని కంట్రోల్ చేయడంలోనూ చియా సీడ్స్ ఉపయోగపడతాయి. జీర్ణ సమస్యలకు మంచిది కదా అని ఎక్కువ మొత్తంలో వీటిని అసలు వాడకూడదు. ఇలా చేయడం వల్ల పొట్టలో ఇరిటేషన్ వచ్చి సమస్యలు మరింత పెరుగుతాయి. న్యూట్రిషనిస్ట్ రేణు రఖేజా చెప్పిన ప్రకారం చూస్తే..చియా సీడ్స్ తినే విషయంలో చాలా మంది మూడు పొరపాట్లు చేస్తున్నారు. అందులో మొట్ట మొదటిది ఏంటంటే..చియా గింజలను పొడిగా తీసుకోవడం. అంటే..వాటిని నేరుగా తినడం. చియా సీడ్స్ ని ఎప్పుడైనా సరే పొరపాటున కూడా నానబెట్టకుండా తినకూడదు. ఇలా నేరుగా సీడ్స్ తినడం వల్ల గొంతులో వాపు వస్తుందని హెచ్చరిస్తున్నారు రేణు రఖేజా. అంతే కాదు. పొట్టలో విపరీతమైన మంట రావడంతో పాటు పొట్ట ఉబ్బరం వస్తుంది.

## బిజినెస్ వాయిస్

# పెరిగిన బీమా కంపెనీల మోసాలు

అనారోగ్యం పాలయినప్పుడు అత్యవసర సమయంలో వైద్య బీమా ఉంటే ఎంతో ధీమాగా ఉంటుందని పాలసీలు కొనుగోలు చేసిన వారికి అంతిమంగా నిరాశనే ఎదురవుతోంది. హాస్పి టల్‌లో చేరిన తర్వాత అడ్డగోలు షరతులు పెట్టి.. బీమా వర్తింపునకు సంబంధిత సంస్థలు మోకాలడ్డు వేస్తోన్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. వైద్య బీమా కంపెనీలపై ఫిర్యాదులు దాదాపు రెట్టింపు కావడమే ఇందుకు నిదర్శనం. ఈ ఏడాది జూన్‌తో ముగిసిన రెండవ త్రైమాసికంలో బీమా ఉత్పత్తులపై ఫిర్యాదులు 45 శాతం పెరిగాయని.. ఇందులో ఎక్కువగా ఆరోగ్య బీమా పాలసీలపైనే ఉన్నాయని 'ఇన్సూరెన్స్ సమాధాన్' తన 2025 రిపోర్ట్‌లో వెల్లడించింది. బీమా రంగంలోని తీరుతెన్నులను విశ్లేషిస్తూ ఆ సంస్థ ఓ నివేదికను విడుదల చేసింది. ఆ వివరాలు.. ఫిర్యాదులు దాఖలు చేయడంలో 31 నుంచి 40సంవత్సరాల వయస్సు గల పాలసీదారు లు అత్యంత చురుకుగా ఉన్నారు. దేశంలో ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 16 శాతం ఫిర్యాదులు చోటు చేసుకున్నాయి. పాలసీదారులకు తప్పుగా విక్రయించడం, క్లెయిమ్ వివాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది మార్చితో ముగిసిన మొదటి త్రైమాసికంలో 684 ఫిర్యాదులు నమోదు కాగా, రెండవ త్రైమాసికంలో 974 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఇది 45 శాతం పెరుగుదల. వివాదాస్పద క్లెయిమ్‌ల విలువ రూ.83.5 కోట్ల నుండి రూ.119.5 కోట్లకు పెరిగింది. ఇది 43 శాతం కంటే ఎక్కువ పెరగడం ఆందోళనకరం. తప్పు దారి పట్టించే బీమా



ఉత్పత్తుల విక్రయా లపై ఫిర్యాదులు 11.2 శాతం పెరిగాయి. ఇందులో ఆరోగ్య బీమా ఫిర్యాదులు 68 శాతం పెరగ్గా.. జీవన బీమాపై 25.5 శాతం, సాధారణ బీమాపై 6.9 శాతం చొప్పున ఫిర్యాదులు పెరిగాయి. ఎండోమెంట్ పాలసీలు అత్యంత తప్పుగా విక్రయిం చిన వాటిలో ఎక్కువగా ఉన్నాయి. ఇవి పాలసీదారులను జరిమా నాలు, తక్కువ రాబడి, మూలధన క్షీణతకు గురి చేస్తున్నాయని పాలసీదారులు ఫిర్యాదు చేశారు. పాలసీదారులు, ముఖ్యంగా యువతరాలు, తమ హక్కుల కోసం నిలబడుతున్నారని ఇన్సూరెన్స్ సమాధాన్ సహవ్యవస్థాపకురాలు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శిల్పా అరోరా తెలిపారు. ఏజెంట్లపై అధిక కమిషన్లు, విక్రయ ఒత్తిడి కారణంగా తప్పుదారి పట్టి ంచే విక్రయ ఫిర్యాదులు పెరుగుతున్నాయన్నారు.

## రూ. 12,000 కోట్లతో ఐపీఓకు వస్తున్న ఫోన్‌పే



ప్రముఖ ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ ఫోన్‌పే త్వరలో భారీ ఐపీఓ ద్వారా స్టాక్ మార్కెట్లలోకి అడుగుపె ట్టనుంది. మదుపర్ల నుంచి రూ. 12,000 కోట్లను సేకరించే లక్ష్యంతో మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ఫోన్‌పే డ్రాఫ్ట్ పేపర్లు అందజేసినట్టు తెలుస్తోంది. భారతీయ స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ అయ్యేందుకు ప్రీ-ఫైలింగ్ మార్గంలో ఐపీఓ కోసం దాఖలు చేసినట్టు సమాచారం. ఆఫర్ ఫర్ సేల్ విధానంలోనే నిధుల సమీకరణ చేపట్టనుంది. ఐపీఓ పరిమాణంపై కంపెనీ పూర్తిస్థాయిలో స్పష్టత ఇవ్వనప్పటికీ, దాదాపు రూ. 11,000 నుంచి రూ. 12,000 కోట్ల వరకు సేకరించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ఈ ఆఫర్ ఫర్ సేల్‌లో కంపెనీలో వాటాదారులుగా ఉన్న వాల్‌మార్ట్, మైక్రోసాఫ్ట్, టైగర్ గ్లోబల్ పాల్గొంటాయి, ఈ సంస్థలు 10 శాతం మేర వాటాను విక్రయానికి షేర్లను ఇవ్వనున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఫోన్‌పే స్టాక్ మార్కెట్లో పబ్లిక్ లిస్టింగ్ కోసం సన్నాహాలు చేస్తున్నట్టు ప్రకటించింది. 2015లో బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభించిన ఫోన్‌పే 2016లో ప్రధాన కార్పొరేట్ ప్రధాన కార్యాలయాన్ని సింగపూర్‌కు మార్చింది. ఆ తర్వాత 2022లో సహ వ్యవస్థాపకుడు, సీఈఓ సమీర్ నిగమ్ రూ. 8,000 కోట్ల పన్నులు చెల్లించి మరీ ప్రధాన కార్యాలయాన్ని భారత్‌కు మార్చారు. కాగా, ఫోన్‌పే కంటే ముందు పేటీఎం, మొబిక్విక్ వంటి ఫిన్‌టెక్ కంపెనీలు ఐపీఓ ద్వారా స్టాక్ మార్కెట్లలోకి ఎంటర్ అయ్యాయి. అయితే, ఈ రెండు కంపెనీల షేర్లు ఆశించిన స్థాయిలో ర్యాలీ చేయలేకపోయాయి.

## హిండెన్‌బర్గ్ నివేదిక భారతీయ సంస్థలపై దాడి



షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణలు కేవలం అదానీ గ్రూప్‌ను టార్గెట్ చేసుకోలేదని, అవి భారతీయ కంపెనీలపై చేసిన దాడేనని గౌతమ్ అదానీ అన్నారు. ఇటీవల స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారమని, అదానీ గ్రూప్, దాని కంపెనీలకు క్లీన్‌చిట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే బుధవారం కంపెనీ వాటాదారులకు రాసిన లేఖలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. అదానీ గ్రూప్‌ను బలహీనపరిచేందుకు హిండెన్‌బర్గ్ ఈ రకమైన ప్రయత్నం చేసింది. తమ సంస్థ పునాదులు ధృఢంగా ఉండటంతో సవాళ్లను అధిగమించింది. హిండెన్‌బర్గ్ నివేదిక అదానీ గ్రూప్‌పై విమర్శ మాత్రమే కాదు. అంతర్జాతీయంగా ఎదగాలని కలలు కనే భారతీయ సంస్థల ధైర్యసాహసాలకు ఇది ప్రత్యక్ష సవాలు. అయితే, సెబీ నిర్ణయంతో ఎప్పటిలాగే సత్యం గెలిచిందని అదానీ లేఖలో అన్నారు. ఈ పరిణామాలతో అదానీ గ్రూప్ ఆశయాన్ని పదును పెట్టడం ద్వారా, మనదేశ భవిష్యత్తు కోసం స్కేల్, వేగం, స్థిరత్వంతో ముందుకెళ్లాలనే బాధ్యత పెరిగిందని లేఖలో పేర్కొన్నారు. ఈ వారం ప్రారంభంలో దర్యాప్తు చుట్టూ ఉన్న అనిశ్చితి తొలగిపోయింది. రెండు సంవత్సరాలకు పైగా మాపై ఉన్న అపరాధ మేఘం తొలగిపోయిందని అదానీ అన్నారు. కాగా, అదానీ గ్రూప్, కంపెనీలపై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణలను ఈ నెల 18న సెబీ క్లియర్ చేసింది. అదానీ గ్రూప్ కంపెనీల్లో స్టాక్ మానిప్యులేషన్, అకౌంటింగ్ ఫ్రాడ్ జరిగినట్టు చేసిన ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేసింది.

## బంగారం ధర రూ.2 లక్షలకు చేరుకుంటుందా? ట్రేడ్ నిపుణులు ఏం చెబుతున్నారంటే?



బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. ఈ ఏడాదిలోనే బంగారం ధరలు ఏకంగా 50శాతం పెరుగుతూ మగువలకు షాక్ ఇచ్చాయి. వెండి సైతం 55 శాతం పెరిగింది. తాజాగా బంగారం ధర రూ.1,17,570కి చేరుకున్న సంగతి తెలిసిందే. కాగా రాబోయే రోజుల్లో బంగారం ధర రూ.2 లక్షలకు చేరుకుంటుందని వార్తలు వస్తున్నాయి. అంతర్జాతీయంగా అమెరికా, ఇంగ్లండ్ లాంటి దేశాలలో ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పుల కారణంగా బంగారంపై పెట్టుబడులు ఎక్కువ అవుతాయని, కాబట్టి బంగారం ధర పెరుగుతుంది కానీ తగ్గే అవకాశమే లేదని ట్రేడ్ నిపుణులు చెబుతున్నారు. 2020 నుండి 2025 వరకు గోల్డ్ ధర రెట్టింపు అయ్యిందని మరో మూడు నాలుగేళ్లలో ఇది రూ.2 లక్షలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. అంతే కాకుండా వచ్చే ఏడాదే గోల్డ్ ధర మరో 15 నుండి 20 శాతం వరకు పెరగవచ్చని అభిప్రాయపడుతున్నారు. రాబోయే కాలంలోనూ వరల్డ్ ఎకానమీలో పెద్దగా మార్పులు ఉండే అవకాశం లేదని, ట్రెండ్ ఇలానే కొనసాగితే కచ్చితంగా బంగారం ధరలు రూ.2లక్షల మార్క్ చేరుకుంటాయని చెబుతున్నారు. అయితే కొంతమంది ప్రస్తుతం బంగారం ధరలు పెరిగాయని, భవిష్యత్ లో తగ్గుతాయని అనుకుంటున్నారు. కానీ ట్రెండ్ ప్రకారం తగ్గే అవకాశమే లేదని ఇంకా పెరుగుతాయి కాబట్టి కొనుగోలు చేయాలని అనుకుంటే ఇదే మంచి సమయం అని నిపుణులు సూచిస్తున్నారు.

## 25,100 దిగువకు నిఫ్టీ



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల్లో వరుసగా నాలుగోరోజూ అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. హెచ్-1బీ వీసాలపై ఆందోళనలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. విదేశీ మదుపర్ల అమ్మకాలూ ఇందుకు తోడయ్యాయి. ముఖ్యంగా ఫైనాన్షియల్, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీంతో సూచీలు డీలాపడ్డాయి. ఈ క్రమంలోనే నిఫ్టీ మళ్లీ 25,100 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 81,917.65 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,102.10) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 81,607.84 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 386.47 పాయింట్ల నష్టంతో 81,715.63 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 112.60 పాయింట్ల నష్టపోయి 25,056.90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.71గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, బీఈఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, మారుతీ సుజుకీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68.17 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3762.83 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# కెప్టెన్ రెస్ట్ బంగ్లాకు కలిసొస్తుందా?.. భారత్ 'ఫైనల్' ప్రత్యర్థి ఎవరో?




**ఇంటర్నెట్ డెస్క్:** వరుసగా రెండు రోజుల్లో రెండు మ్యాచులను ఆడాల్సిన పరిస్థితి బంగ్లాదేశ్‌కు ఎదురైంది. ఆసియా కప్ ఫైనల్‌కు చేరాలంటే ఇవాళ్టి మ్యాచ్‌లో కచ్చితంగా గెలిచి తీరాల్సిందే. సూపర్ -4లో శ్రీలంకపై విజయం సాధించిన బంగ్లా.. భారత్ చేతిలో పరాజయం చవిచూసింది. ఇప్పుడు పాకిస్థాన్‌తో కీలక పోరుకు సిద్ధమైంది. మరోవైపు టీమ్‌ఇండియా చేతిలోనే ఓడిన పాక్‌కు ఇది అత్యంత ప్రతిష్ఠాత్మక మ్యాచ్. ఇప్పటికే ఆ జట్టుపై సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ జరుగుతోంది. ఇప్పుడీ మ్యాచ్‌లో ఓడితే తమ ఫ్యాన్స్ నుంచే విమర్శలు తప్పవు.

**కెప్టెన్ల నుంచి..**

పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లకు సారథులే ఇబ్బందిగా మారారు. ఇద్దరూ మంచి ఫామ్‌లో లేరు. పాక్ సారథి సల్మాన్ అఘాతో పోలిస్తే బంగ్లా కెప్టెన్ లిటన్ దాస్ కాస్త ఫర్వాలేదు. అప్పుడైనా పరుగులు రాబట్టాడు. ఇప్పటి వరకు ఐదు మ్యాచుల్లో కేవలం 46 పరుగులను మాత్రమే చేశాడు. మరోవైపు లిటన్ దాస్ నాలుగు మ్యాచుల్లో 119 పరుగులు చేయగలిగాడు. భారత్‌తో గత మ్యాచ్‌కు లిటన్ దాస్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. తప్పకుండా పాక్‌తో మ్యాచ్‌లో ఆ విరామం కలిసి వస్తుందని ఆ జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. సూపర్ -4లో ఇప్పటికే శ్రీలంకను మట్టికరిపించిన బంగ్లా మరో అద్భుత విజయంతో ఫైనల్‌కు చేరుకోవాలని చూస్తోంది. టీమ్‌ఇండియాతో ముచ్చటగా మూడోసారి తలపడాలంటే పాక్‌కు ఈ మ్యాచ్ ఫలితం చాలా కీలకం. ఫైనల్‌కు ఎవరు వచ్చినా మేం సిద్ధమని వ్యాఖ్యానించిన పాక్ సారథి సల్మాన్ అఘా.. అలా జరగాలంటే తొలుత వారే టైటిల్ పోరుకు చేరాల్సి ఉంటుంది. ఇప్పుడీ మ్యాచ్‌లో ఓడిపోతే ఇంటిముఖం పట్టాల్సిందే.

**వీరి ఆటే కీలకం..**

పాకిస్థాన్ పేసర్లు షహీన్ షా అఫ్రిది, హారిస్ రవూఫ్ ఈ ఆసియా కప్‌లో పెద్దగా ప్రభావం చూపించలేదు. రవూఫ్ మూడు మ్యాచుల్లో ఆరు వికెట్లు తీయగా.. షహీన్ మాత్రం ఐదు మ్యాచుల్లో ఆరు వికెట్లే పడగొట్టాడు. యువ స్పిన్నర్ సయామ్ ఆయుబ్ కూడా ఆరే వికెట్లు తీశాడు. వీరందరితో పోలిస్తే బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ 8 వికెట్లు తీసి అదరగొట్టాడు. దుబాయ్ వంటి పిచ్‌పై స్లో బంతులతో ప్రత్యర్థులను ఇరకాటంలో పెడతాడు. పాక్ బ్యాటర్లకు అతడిని ఎదుర్కోవడం సవాలే. రిషాద్ హుసేన్ కూడా మంచి ఫామ్‌లో ఉండటం బంగ్లాకు కలిసొచ్చే అంశమే. బ్యాటింగ్‌లో లిటన్ దాస్, సైఫ్ హసన్, తౌహిద్ హృదోయ్‌పైనే బంగ్లా ఎక్కువ ఆధారపడుతోంది. పాక్ నుంచి ఫర్హాన్, ఫకర్ జమాన్ ఆడితేనే ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకురాగలదు. సైయామ్, సల్మాన్ అఘా నుంచి భారీ ఇన్నింగ్స్‌లే బాకీ ఉన్నాయి.

## క్రీడా వాయిస్

## కెప్టెన్‌గా రజత్ పాటిదార్.. వైస్ కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్



అక్టోబర్ 1 నుంచి నాగ్‌పూర్‌లో ప్రారంభమయ్యే ఇరానీ కప్ 2025 కోసం రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టును ఇవాళ (సెప్టెంబర్ 25) ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా రజత్ పాటిదార్ ఎంపిక కాగా, అతనికి డిప్యూటీగా రుతురాజ్ గైక్వాడ్ నియమితుడయ్యాడు. ఈ జట్టులో అభిమన్యు ఈశ్వరన్, ఇషాన్ కిషన్, ఖలీల్ అహ్మద్, ఆకాశ్‌దీప్ లాంటి ప్రముఖ ఆటగాళ్లు ఉన్నారు. తొలుత ఈ జట్టుకు శ్రేయస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా అనుకున్నారు. అయితే అతను రెడ్ బాల్ క్రికెట్ నుంచి తాత్కాలిక విరామం కోరడంతో ఎంపిక చేయలేదు. ఆసీస్-ఏతో జరుగుతున్న టెస్ట్ సిరీస్ మధ్యలోనే (తొలి మ్యాచ్ తర్వాత) శ్రేయస్ వైదొలిగాడు.

రెస్ట్ ఆఫ్ ఇండియా వర్సెస్ విదర్భ

ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు రంజీ ఛాంపియన్ విదర్భతో తలపడనుంది. గతేడాది ముంబై (అప్పటి రంజీ ఛాంపియన్) చేతిలో ఓటమి పాలైన రెస్ట్ ఆఫ్ ఇండియా, ఈసారి టైటిల్ సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది.

రెస్ట్ ఆఫ్ ఇండియా: రజత్ పాటిదార్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, ఆర్యన్ జుయల్ (వికెట్‌కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్ కెప్టెన్), యష్ ధుల్, షేక్ రషీద్, ఇషాన్ కిషన్ (వికెట్‌కీపర్), తనుష్ కోటియన్, మానవ్ సుతార్, గుర్నూర్ బ్రార్, ఖలీల్ అహ్మద్, ఆకాశ్‌దీప్, అన్షుల్ కంబోజ్, సరాన్ష్ జైన్

మూడో టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగనున్న విదర్భ

2017-18, 2018-19 సీజన్లలో ఇరానీ కప్ గెలిచిన విదర్భ జట్టు, మూడో టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగనుంది. ఈ జట్టుకు అక్షయ్ వాద్కర్ కెప్టెన్‌గా, గత రంజీ సీజన్‌లో 960 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన యశ్ రాథోడ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు.

విదర్భ: అక్షయ్ వాద్కర్ (కెప్టెన్ %ఽ% వికెట్‌కీపర్), యశ్ రాథోడ్ (వైస్ కెప్టెన్), అథర్వ తైడే, అమన్ మొఖాడే, డానిష్ మాలేవార్, హర్ష్ దూబే, పార్థ్ రేఖడే, యశ్ ఠాకూర్, నచికేత్ భూతే, దర్శన్ నల్కండే, ఆదిత్య ఠాకరే, అక్షయ్ కర్నేవార్, యష్ కదమ్, శివమ్ దేశ్‌ముఖ్ (వికెట్‌కీపర్), ప్రఫుల్ హింగే, ధ్రువ్ షోరే

## గిల్ డిప్యూటీగా రవీంద్ర జడేజా.. విండీస్‌తో టెస్టు సిరీస్‌కు టీమ్‌ఇండియా ఇదే



ఇంటర్నెట్ డెస్క్: ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్‌లో భారత్ తొలిసారి స్వదేశంలో టెస్టు సిరీస్ ఆడనుంది. వెస్టిండీస్‌తో అక్టోబర్ 2 నుంచి అక్టోబర్ 14 వరకు రెండు టెస్టుల సిరీస్ జరగనుంది. ప్రస్తుతం టీమ్‌ఇండియా దుబాయ్ వేదికగా ఆసియా కప్‌లో తలపడుతోంది. అక్కడే భారత టెస్టు జట్టుసారథి శుభ్‌మన్ గిల్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ సమావేశం నిర్వహించారు. అనంతరం టీమ్‌ఇండియా స్క్వాడ్‌ను ప్రకటించారు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో గాయపడిన రిషభ్ పంత్‌కు బదులు ఎన్.జగదీశన్‌కు ఛాన్స్ వచ్చింది. అలాగే గిల్‌కు డిప్యూటీగా రవీంద్ర జడేజాను నియమించింది.

ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఆడిన కరుణ్ నాయర్, శార్దూల్ ఠాకూర్‌ను సెలక్షన్ కమిటీ పక్కన పెట్టింది. ఆ పర్యటనలో వీరిద్దరి నుంచి చెప్పుకోదగ్గ ప్రదర్శన ఏదీ రాలేదు. కరుణ్ నాయర్ బదులు దేవదత్ పడిక్కల్ జట్టులోకి వచ్చాడు. దేశవాళీలో అదరగొట్టిన జగదీశన్‌కు ఛాన్స్ దక్కింది. రిషభ్ పంత్ లేకపోవడంతో ధ్రువ్ జురెల్‌కు బ్యాకప్ కీపర్ అయ్యాడు. భారత పేసర్ మహ్మద్ షమీ పునరాగమనంపై అగార్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇషాన్ కిషన్ భవితవ్యంపైనా స్పందించాడు. "నితీశ్ కుమార్ రెడ్డి గత సిరీస్‌లో చాలా అద్భుతంగా ఆడాడు. అతడికి మరిన్ని ఛాన్స్‌లు ఇస్తే మెరుగ్గా రాణించే అవకాశం ఉంది. అతడిపై భారీగానే అంచనాలు పెట్టుకున్నాం. ఇషాన్ కిషన్‌ను మేం భారత్ %ూ% తరఫున ఎంపిక చేసే సమయంలో ఫిట్‌గా లేడు. ఇప్పుడు ఓకే. అయితే, దేశవాళీలో మరిన్ని మ్యాచులు ఆడితే బాగుంటుందనే ఉద్దేశంతో తీసుకోలేదు. బుమ్రా వర్క్‌లోడ్‌పై ఫిజియోలతో చర్చించాం. ఏదైనా సరే జట్టే తొలి ప్రాధాన్యం. తప్పకుండా బుమ్రా అద్భుతంగా రాణిస్తాడనే నమ్మకం ఉంది. రెండు టెస్టులకూ అందుబాటులో ఉంటాడు. షమీ ఫిట్‌నెస్‌పై మాకు ఇంకా అప్‌డేట్ రాలేదు. భారత్ తరఫున మరింత క్రికెట్ ఆడే సత్తా అతడిలో ఉంది. కరుణ్ నాయర్ నుంచి మేం చాలా ఆశించాం. కానీ, అతడు అంచనాలను అందుకోలేకపోయాడు. పడిక్కల్ ఆస్ట్రేలియాలో బాగానే ఆడాడు. ధర్మశాలలో ఇంగ్లాండ్‌పై హాఫ్ సెంచరీ కొట్టాడు. తప్పకుండా అదే ఫామ్ కొనసాగిస్తాడని ఆశిస్తున్నాం" అని అగార్కర్ వెల్లడించాడు.

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదుత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీశ్, జగదీశన్, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్‌దీప్ యాదవ్ వెస్టిండీస్: కెవ్లాన్ అండర్సన్, బ్రాండన్ కింగ్, అలిక్ అథనాజ్, తాగెనరైన్ చంద్రపాల్, జాన్ క్యాంప్‌బెల్, జస్టిన్ గ్రీవ్స్, రోస్టన్ ఛేజ్ (కెప్టెన్), టెవిన్ ఇమ్లాచ్, షై హోప్, షమార్ జోసెఫ్, అండర్సన్ ఫిలిప్, జైడెన్ సీలెస్, ఖారీ పిర్రె,



# రష్మికకు కొత్త సవాల్.. పోరాడాల్సిందే!

**ఆమె ముందుంది పెద్ద సవాల్...యాక్షన్ డైరెక్టర్**

జర్మనీలో జన్మించిన వియత్నామీస్ మూలాలున్న యాక్షన్ డైరెక్టర్ ఆండీ లాంగ్ న్గుయెన్ ఆయన కుంగ్ ఫూ వారియర్ (2017) యాక్సిడెంట్ మ్యాన్: హిట్‌మ్యాన్ హాలిడే (2022) వంటి హాలీవుడ్ చిత్రాల నుంచి శివాయ్ (2016), సనక్ (2021) వంటి బాలీవుడ్ చిత్రాల దాకా పనిచేశాడు. ఇటీవల తెలుగు పౌరాణిక సైన్స్ ఫిక్షన్ కల్కి 2898 ఎడి కి పని చేయడం ద్వారా స్టంట్స్ కొరియోగ్రఫీలో అంతర్జాతీయ కెరీర్‌ను అందుకున్న టాప్ యాక్షన్ డైరెక్టర్‌గా నిలిచారు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడాడు. "జర్మనీ లో డబ్ చేయబడిన భారతీయ చిత్రాలను చూస్తున్న టీనేజర్‌గా, అమితాబ్ బచ్చన్‌ను డైరెక్ట్ చేస్తానని ఎప్పుడూ ఊహించలేదు. ఆయన వయస్సు గురించి తొలుత నాకు ఆందోళన ఉండేది అయితే షూటింగ్ సమయంలో ఆయన తన వయస్సులో సగం మంది కంటే చురుకుగా కదిలారు" అంటూ ఆయన చెప్పాడు. " దేవుళ్ళు, అమరులు, దిగ్గజాలు, రోబోలు అంతరిక్ష నౌకలతో నా మొదటి పౌరాణిక సైన్స్ ఫిక్షన్ యాక్షన్ చిత్రం అది. సవాలుగాగానూ, అద్భుతంగా కూడా ఉంది, "అని ఆయన గుర్తుచేసుకున్నాడు. నాగ్ అశ్విన్ తో కలిసి పనిచేయడం గురించి మాట్లాడుతూ 'స్టోరీబోర్డులు లేదా రిఫరెన్స్‌లపై ఆధారపడకుండా నాగ్ తన టీమ్‌ని నడిపించే విధానం సూపర్. తక్కువ సూచనలతోనే అందరి దృష్టి తన వైపు మళ్ళించగలిగాడు. అది చాలా ఆకట్టుకుంది." అని చెప్పాడు ఆండీ.

తెలుగు సినిమాలో లాంగ్ తదుపరి అతి పెద్ద ప్రాజెక్ట్ మైసా ఇందులో నేషనల్ క్రష్ రష్మిక మందన్న నటిస్తోంది. అది కూడా తొలిసారిగా ఆమె ఒక యాక్షన్ క్వీన్‌గా మారనుంది. ఈ విషయంపై ఆండీ మాట్లాడుతూ "రష్మికతో అంతకు ముందుగానే పనిచేయాల్సి ఉండింది. ఆమెతో పనిచేయడం పట్ల నేను సంతోషంగా అంతకు మించి ఆసక్తిగా ఉన్నాను. రష్మిక చాలా చురుకైన యువతి.. అయితే నేను డైరెక్ట్ చేయబోయే పాత్ర కోసం తనను తాను మరింత సాన బెట్టుకోవాల్సిన అవసరం ఉంది. చాలా కఠినమైన శారీరక స్టంట్ శిక్షణ పొందవలసి ఉంటుంది, ఇది ఆమెకు పూర్తిగా కొత్త అనుభవం సరికొత్త సవాల్ కూడా "అని అంటున్నాడాయన.

ఆండీకి, ఫైట్ కొరియోగ్రఫీ అంటే శారీరక కదలికలు గురించి మాత్రమే కాదు %-% ఇది కథ చెప్పడం కూడా. 'కథకు ఉపయోగపడే విధంగా పాత్రను మరొక స్థాయికి తీసుకెళ్లే విధంగా యాక్షన్‌ను రూపొందించడాన్ని ఇష్టపడతాను. ఏ నైపుణ్యాలు అర్థవంతంగా ఉంటాయో, వారు ఎందుకు పోరాటంలోకి ప్రవేశిస్తారో వారి లక్ష్యం ఏమిటో తెలుసుకోవడం కోసం స్క్రిప్ట్ , పాత్రలను అధ్యయనం చేయడం చాలా ముఖ్యం" అని వివరించాడు. అతను యాక్షన్ ను కథనం నుంచివిడదీయలేని భాగంగా వర్ణించాడు. 'యాక్షన్ అనేది సంభాషణ కు మరొక రూపం అది ప్రతి ఇతర సన్నివేశంతో సంపూర్ణంగా మిళితం కావాలి. పోరాటం వెనుక ఉన్న భావోద్వేగం కొరియోగ్రఫీ లాగే ముఖ్యమైనది అంటున్న ఆయన 'హైదరాబాద్ భారతదేశంలో తన మొదటి గమ్యస్థానంగా తనపై శాశ్వత ముద్ర వేసిందనీ, ఇక్కడి వంటకాలు మరపురానివని చెప్పాడు, గోల్కొండ కోట యాక్షన్%-%సాహసం కోసం వేచి ఉన్న రెడీమేడ్ మూవీ సెట్ లాగా తనకు అనిపిస్తుంది.' అంటూ వర్ణించాడు.

# అరుదైన గౌరవం దక్కించుకున్న నేచురల్ బ్యూటీ



నేచురల్ బ్యూటీ సాయి పల్లవికి మరో అరుదైన గౌరవం దక్కింది. తమిళనాడు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కలైమామణి పురస్కారాలను బుధవారం ప్రకటించింది. తమిళనాడులోని అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ఈ అవార్డును 2021, 2022, 2023 సంవత్సరాలకు కలిపి మొత్తం 90 మందికి ఈ అవార్డులను ప్రకటించింది. ఇందులో 2021వ సంవత్సరానికి గాను సాయి పల్లవితో పాటు దర్శకుడు అండ్ నటుడు ఎస్‌జే సూర్య అవార్డును సొంతం చేసుకున్నారు. 2023వ సంవత్సరానికి గాను మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్.. అలాగే జాతీయ పురస్కారాల విభాగంలో ప్రముఖ నేపథ్య గాయకుడు కె.జె ఏసుదాస్‌కు, ఎంఎస్ సుబ్బలక్ష్మికి ఈ పురస్కారాన్ని ప్రకటించారు. ఇక వీరితో పాటుగా.. దర్శకుడు లింగుసామి, నటుడు విక్రమ్ ప్రభు, మణికందన్ వంటి ప్రముఖులు కూడా ఈ అవార్డుకు ఎంపికయ్యారు. సాహిత్యం, సంగీతం, నాటకం, సినిమా వంటి వివిధ కళా రంగాల్లో కృషి చేసిన వారిని గుర్తించి తమిళనాడు ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందిస్తుంది. త్వరలోనే తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు.

# 'థామ' నుంచి బిగ్ అప్డేట్..



నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ప్రజెంట్ భాషతో సంబంధం లేకుండా వరుస సినిమాలు అనౌన్స్ చేస్తుంది. ఈ హీరోయిన్ నటిస్తున్న క్రేజీ ప్రాజెక్టులలో 'థామ' (హిందీ) ఒకటి. మాడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో నాల్గవ భాగంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నాడు. దినేష్ విజన్, అమర్ కౌశిక్ నిర్మిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే వచ్చిన టీజర్.. 'ఒక ప్రేమకథ.. ఇంతకు ముందుకు చూసిన దానికంటే క్రూరంగా, ప్రాణాంతకంగా ఉంటుంది' అంటూ వచ్చి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక దీపావళికి ఆడియన్స్ ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్న ఈ చిత్రం నుంచి తాజాగా మరో అప్డేట్ వచ్చింది. 'థామ' సినిమా ట్రైలర్ సెప్టెంబర్ 26న రాబోతున్నట్లు బాలీవుడ్ మీడియా నుంచి వార్తలు వైరల్ అవుతున్నాయి. దీంతో.. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ కోసం ఈగర్‌గా వెయిటింగ్ అంటున్నారు నెటిజన్లు. కాగా.. 2018లో 'స్త్రీ' గా స్టార్ట్ అయిన ఈ హారర్ కామెడీ యూనివర్స్‌లో 2022లో భేడియా, 2024లో స్త్రీ-2, ఇప్పుడు నాల్గొవ భాగంగా 'థామ'గా రాబోతుండగా.. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.




# శ్రద్ధా శ్రీనాథ్ వెబ్ సీరిస్ స్ట్రీమింగ్.. ట్రైలర్ చూశారా?

కాశ్మీర్ బ్యూటీ శ్రద్ధా శ్రీనాథ్ నటించిన వెబ్ సీరిస్ 'ది గేమ్ : యు నెవర్ ప్లే అలోన్' విడుదలకు సిద్ధమైంది. అక్టోబర్ 2న ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ క్రమంలో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు సెల్వా తెరకెక్కించిన ఈ వెబ్ సీరిస్‌ను అప్లాజ్ ఎంటర్ టైన్ మెంట్స్ తెరకెక్కిస్తుంది. ఇందులో సంతోష్ ప్రతాప్, చాందినీ, శ్యామ హరిణి, హేమా, బాల హాసన్, ధీరజ్ తదితరులు నటించారు. 'ది గేమ్ : యు నెవర్ ప్లే అలోన్' అనే వెబ్ సిరీస్‌ను తమిళ్‌లో నెట్‌ఫ్లిక్స్ విడుదల చేస్తున్న మొదటిది కావడం విశేషం. ఇందులో డిజిటల్ యుగం రియాలిటీలతో పాటు ప్రజల కోరికలు వారి బలం, బలహీనత, నిజం, అబద్ధం వంటి అంశాల్లో ఉండే చిన్న తేడాలను ఈ చిత్రంలో చూపించనున్నారు. ఈ వెబ్ సిరీస్ తెలుగు వర్షన్ కూడా విడుదల కావచ్చని తెలుస్తోంది.



# కృతి శెట్టికే ఎందుకిలా జరుగుతోంది

ఉప్పెన రూపంలో డెబ్యూతోనే సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ చూసిన హీరోయిన్ కృతి శెట్టికి ఆ తర్వాత శ్యామ్ సింగ రాయ్, బంగార్రాజుతో డీసెంట్ హిట్లు దక్కేసరికి అమ్మడికి టాలీవుడ్ లో తిరుగులేదని అందరూ అనుకున్నారు. కానీ తర్వాత మొత్తం రివర్స్ అయ్యింది. ఒకటి రెండు కాదు ఏకంగా అయిదు ఫ్లాపులు ఆమె కెరీర్ మీద తీవ్ర ప్రభావం చూపించాయి. మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, వారియర్, కస్టడీ, మనమే ఒకదాన్ని మించి మరొకటి ఆయా హీరోల కెరీర్ లోనే బెస్ట్ డిజాస్టర్స్ అయ్యాయి. మలయాళంలో చేసిన ఏఆర్ఎం ఒకటే కొంచెం ఊరట కలిగించింది. ఇదంతా ఇప్పటిదాకా జరిగిన గతం. అదేంటో కానీ కృతి శెట్టికో విచిత్రమైన సమస్య వచ్చింది. ప్రస్తుతం తను తమిళంలో మూడు సినిమాల్లో ఉంది.

# 'ఓజీ' సినిమా రివ్యూ.. పవన్‌కల్యాణ్ గ్యాంగ్‌స్టర్ డ్రామా ఎలా ఉందంటే?




**సినిమా: ఓజీ**
**తారాగణం: పవన్‌కల్యాణ్, మాళవిక అరుళ్ మోహన్, ఇమ్రాన్ హాష్మీ, ప్రకాశ్‌రాజ్..**
**దర్శకత్వం: సుజిత్**
**సంగీతం: తమన్**
**నిర్మాత: డీవీవీ దానయ్య**

విడుదలకు ముందే అంతులేనంత క్రేజ్‌ను సంపాదించుకున్న సినిమా పవన్‌కల్యాణ్ 'ఓజీ'. ఈ సినిమా విడుదల కోసం అభిమానులంతా ఆతృతగా ఎదురు చూశారు. ఎట్టకేలకు వారి ఎదురుచూపులకు తెరదించుతూ గురువారం 'ఓజీ' విడుదలైంది. ఒకరోజు ముందుగానే ప్రపంచవ్యాప్తంగా ప్రీమియర్ షోలతో 'ఓజీ' హంగామా మొదలైంది. అంచనా ప్రకారం కేవలం ప్రీమియర్స్‌తోనే ఈ సినిమా వందకోట్ల వసూళ్లను రాబట్టినట్టు తెలుస్తున్నది. మరి గురువారం నుంచి అసలు షోలు మొదలయ్యాయి. మరి అభిమానులకు నచ్చేలా 'ఓజీ' ఉన్నదా? ఈసారి పవన్‌కల్యాణ్ బ్లాక్‌బస్టర్ అందుకున్నారా? ఈ ప్రశ్నలకు సమాధానం తెలుసుకునే ముందు కథేంటో చూద్దాం.

**కథ**

1990ల్లో ముంబైలో జరిగే కథ ఇది. ముంబైలోని ఓ షిప్ యార్డ్‌కు ఓ కంటేనర్ వచ్చి చేరుతుంది. ఆ షిప్ యార్డ్ అధినేత సత్యా దాదా (ప్రకాశ్‌రాజ్). సమాజం గురించి ఆలోచించే మంచి మనిషి. తన షిప్ యార్డ్‌లో వచ్చిన ఆగిన కంటేనర్ నిండా ప్రమాదకరమైన ఆర్డీఎక్స్ ఉన్న విషయాన్ని తెలుసుకున్న సత్యాదాదా అది విద్రోహుల చేతికి చిక్కితే దేశానికే ప్రమాదమని భావించి, దాన్ని ఎవరికీ తెలీకుండా దాచేస్తాడు. ఆ కంటేనర్ ఓమీ (ఇమ్రాన్ హాష్మీ) అనే గ్యాంగ్‌స్టర్‌ది. తన కంటేనర్ కోసం ఓమీ వెతుక్కుంటూ ముంబై వస్తాడు. అది సత్యాదాదా పోర్టులో ఉందని తెలిసి, దాదా మనుషులందర్నీ వెంటాడతాడు. పదిమందిని బతికించేందుకు సత్యాదాదా నిర్మించిన ఈ సామ్రాజ్యం ఇప్పుడు గ్యాంగ్‌స్టర్ ఓమీ కారణంగా సర్వనాశనం అయ్యేలా ఉంది. ఇప్పుడు ఈ ప్రమాదం నుంచి ఒక్కడే రక్షించగలడు. అతడే.. 'ఓజీ' అని అందరితో పిలవబడే ఓజెస్ గంభీర(పవన్‌కల్యాణ్). తను ముంబై వదిలి 15ఏండ్లయింది. ఇప్పుడు తిరిగి రావాల్సిన పరిస్థితులు ముంబైలో ఉత్పన్నమయ్యాయి. అసలు ఈ ఓజెస్ గంభీర ఎవరు? తను ముంబై వదిలి ఎందుకు వెళ్లిపోయాడు? మళ్లీ ఎలా తిరిగొచ్చాడు? అసలు ఈ ఓజీ పుట్టుపూర్వోత్తరాలేంటి? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే మిగతా కథ.

**విశ్లేషణ**

వెళ్లేంతవరకే ఇది పవన్‌కల్యాణ్ సినిమా. థియేటర్‌లో కూర్చున్నాక ఇది పూర్తిగా దర్శకుడు సుజిత్ సినిమా. ఒక సూపర్‌స్టార్‌కి ఎలాంటి ఎలివేషన్స్ ఉంటే అభిమానులు పండుగ చేసుకుంటారో.. అలాంటి ఎలివేషన్స్‌తో అసలు సిసలైన ఫ్యాన్ మూవీ తీశాడు సుజీత్. తను స్వతహాగా పవన్‌కల్యాణ్ అభిమాని. ఒక అభిమాని తన అభిమాన నటుడ్ని డైరెక్ట్ చేస్తే ఎలా ఉంటుందో 'ఓజీ' చూస్తే తెలుస్తుంది. ఇది నిజానికి రొటీన్ కథే. కానీ ఆ కథను తనదైన శైలిలో, అద్భుతమైన ఎలివేషన్లతో కొత్తగా మార్చేశాడు సుజీత్. ఓ న్యూ సినేరియా తెరపై కనిపించింది. ఈ సినిమా ప్రారంభమైన 24 నిమిషాలు పవన్‌కల్యాణ్ కనిపించరు. కానీ ఉన్నట్టే అనిపిస్తుంది. అది సుజిత్ మ్యాజిక్. పవర్‌స్టార్‌ని ఎప్పుడెప్పుడు చూస్తామా? అనే ఉద్వేగానికి ఫ్యాన్స్‌ని గురిచేశాడు. ఇక పవన్ ఇంట్రడక్షన్‌ని సుజిత్ చూపించిన తీరు, తమన్ ఆర్ఆర్ అభిమానులు పండుగ చేసుకునేలా ఉంది. ఇక ఎంట్రీ అయ్యాక.. ఒక్క క్షణం కూడా సినిమా ఆగలేదు. పరుగులుపెట్టించాడు. ఈ సినిమాలో పవన్ కనిపించే ప్రతి ఫ్రేమూ అభిమానులకు నచ్చుతుంది. తుపాకుల శబ్దాలతో సినిమాను మోతమోగించినా.. కణ్మని ఎపిసోడ్‌తో కాస్త రిలీఫ్ ఇచ్చాడు సుజిత్. కథానాయిక కణ్మని పాత్రలో ప్రియాంక అరుళ్ మోహన్ ఒదిగిపోయింది. తెరపై దీపంలా ఉంది ప్రియాంక. పవన్, ప్రియాంక మధ్య సాగే సన్నివేశాలు హృద్యంగా ఉంటాయి. ఇక సెకండాఫ్‌లో పోలీస్ స్టేషన్ ఎపిసోడ్ సినిమాకే హైలెట్. ఆ సీన్‌కోసం అభిమానులు మళ్లీ మళ్లీ సినిమా చూస్తారు. కాకపోతే సినిమాలో హింస మాత్రం తీవ్రంగా ఉంది. అలాగే కథనం అక్కడక్కడ కాస్త కన్ఫ్యూజ్ చేస్తుంది. మొత్తంగా ఫస్ట్‌హాఫ్ అదిరిపోయింది. సెకండాఫ్ మాత్రం కాస్త గాడి తప్పింది. అయితే.. చివరి 30 నిమిషాలు మళ్లీ ట్రాకెక్కింది.

**నటీనటులు**

పవన్‌కల్యాణ్ నట విశ్వరూపం ఈ సినిమా. దర్శకుడు సుజిత్‌కి పూర్తిగా సెరండర్ అయిపోయి నటించారాయన. దానికి తగ్గట్టు ట్కస్టైల్‌గా, అందంగా కనిపించారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్ సీన్లో అయితే.. ఫుల్ ఎనర్జీతో నటించారు. ఆయన మార్షల్ ఆర్ట్స్ కూడా సినిమాకు బాగా ఉపయోగపడింది. గ్యాంగ్‌స్టర్‌గా, యోధుడిగా, ప్రేమికుడిగా, తండ్రిగా.. ఇలా భిన్న పార్శ్వాలు ఇందులో పవన్‌కల్యాణ్‌లో చూడొచ్చు. ఉన్నంతలో ప్రియాంక కూడా బాగా చేసింది. ప్రకాశ్‌రాజ్ ఎప్పటిలాగే తన పాత్రకు పూర్తి న్యాయం చేశారు. ఇమ్రాన్ హాష్మీ విలనిజం అంత గొప్పగా అనిపించదు. పవన్ ముందు తను తేలిపోయాడు. అర్జున్ దాస్ పాత్ర కూడా బావుంది.

**సాంకేతికంగా**

ఈ సినిమాకు నిజమైన హీరోలు సుజిత్, తమన్. నిజంగా వీరిద్దరు చలరేగిపోయారు. తమన్ అద్భుతమైన ఆర్ఆర్ ఈ సినిమాను నెక్ట్స్ లెవల్లో నిలబెట్టింది. అతను అలా ఇవ్వగలిగాడంటే.. దానికి కారణం సుజిత్ ఇచ్చిన అవుట్‌పుట్. అలా ఇద్దరూ పోటీపడి సినిమాను నిలబెట్టారు. కెమెరా వర్క్ అయితే చాలా బావుంది. ఎడిటింగ్ కూడా బావుంది. డైలాగులు కేజీఎఫ్‌ని గుర్తు చేసేలా ఉన్నాయి. మొత్తంగా మాస్ సినిమాలు ఇష్టపడేవాళ్లకు 'ఓజీ' బాగా నచ్చుతుంది. ముఖ్యంగా అభిమానులకైతే విందుభోజనమే.

బలాలు
పవన్‌కల్యాణ్ నటన, తమన్ ఆర్ఆర్, కథనం, సుజిత్ ట్కస్టైలిష్ మేకింగ్..
బలహీనతలు
కథ, సెకండాఫ్, హింస ఎక్కువ అవ్వడం

**రేటింగ్ 3.5/5**

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com